## నమ్మలేని నిజాలు

కరువు నీడ
ఆకలి ఆక్రందన
శ్మశాన జాడ.

ప్రకృతి శాంతి
నీతి దుర్నీతి త్రాసు
వికృతి హింస.

రెండ్రెండ్ల రెండు
ఉన్నకండ్లు నాలుగు
సాగని బండి.

ఈటెలు మాయం
మరోకొత్త ఆయుధం
పాతాక రోత.

కొండ కూలింద
దిక్కులు మటుమాయం
పుట్ట గొడుగు

– రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

## శ్రీనిజాలు

మాస్కువేసి తిరుగుబయట
పగలంతా అన్ లాక్ !
ఆరింటికి ఇంటి బాట
రాత్రంతా నో వాక్ !

అప్పుడే అయిపోలేదు
ముందుంది మూడోవేవు!
వదిలేట్లు లేదు, కరోన
ఆటలో మనిషొక పావు!

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 10-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 260 | పేజీలు: 8 | వెల: రూ.1/-


## విద్యాసంస్థల పునఃప్రారంభంపై మంత్రి సబిత సమీక్ష

హైదరాబాద్, జూన్ 9:రాష్ట్రంలో విద్యాసంస్థల పునఃప్రారంభంపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. నాంపల్లిలో నిర్వహించిన ఈ సమీక్షా సమావేశానికి ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇంటర్, పాఠశాలల ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణపై చర్చిస్తున్నారు. ఇంటర్ సెకండియర్ పరీక్షల నిర్వహణపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.తెలంగాణలో ఏప్రిల్ 27 నుంచి వేసవి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ లాక్‌డౌన్ పొడిగింపుతో ఆ సెలవులను జూన్ 15వ తేదీ వరకు పొడిగించారు. వేసవి సెలవుల గడువు సమీపిస్తుండటంతో విద్యాసంస్థల పునఃప్రారంభం, ఆన్‌లైన్ తరగతుల నిర్వహణపై చర్చిస్తున్నారు.

## తెలంగాణలో భారీ వర్షాలు

హైదరాబాద్, జూన్ 9:తెలంగాణ నైరుతి రుతుపవనాలు పలు జిల్లాల్లో ప్రవేశించాయి. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వరగంల్, కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా తదితర జిల్లాల్లో భారీ వర్షం కురుస్తోంది. వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై నీళ్లు నిలిచాయి. వరంగల్‌తో పాటు హన్మకొండ, ఖాజీపేట సైతం జలమయమయ్యాయి. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. హన్మకొండ తహసీల్దార్ కార్యాలయంలోకి నీరు చేరింది.

రానున్న రెండు మూడు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి నైరుతి రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈనెల 11న ఏర్పడబోయే అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తెలంగాణలోని ఉత్తర, తూర్పు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది.

## కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు నీటి విడుదల

మహబూబ్ నగర్, జూన్ 9: జిల్లాలోని చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలోని పంప్ హౌస్ స్టేజ్ ? 1 నుంచి కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నీటిని విడుదల చేశారు. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో ముందస్తుగానే ప్రాజెక్టులను నింపే ప్రక్రియ కొనసాగిస్తు న్నామని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. దీంతో రైతులకు సాగు నీటి సమస్యలు తలెత్తవన్నారు. వారి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## వేముల సురేందర్ రెడ్డికి నివాళులర్పించిన సీఎం కేసీఆర్



నిజామాబాద్, జూన్ 9: నిజామాబాద్ జిల్లా వేల్పూరు మండల కేంద్రంలో దివంగత నేత వేముల సురేందర్ రెడ్డి విగ్రహానికి సీఎం కేసీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. మెట్‌పల్లి పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి మార్గమధ్యలో వేల్పూర్‌లో ఆగారు. సురేందర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తండ్రి సురేందర్ రెడ్డి.

## ప్రైవేట్ ఆస్పత్రుల్లో కరోనా టీకాల ధరలు ఖరారు

హైదరాబాద్, జూన్ 9:ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందించే కరోనా వ్యాక్సిన్ల ధరలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా తయారు చేసిన కొవిషీల్డ్ వ్యాక్సిన్ ఒక డోసు ధర రూ.780, రష్యాకు చెందిన స్పుత్నిక్ వీ టీకా రేటు రూ.1,145, భారత్ బయోటెక్ కంపెనీ కొవాగ్జిన్ టీకా ధర రూ.1,410గా నిర్ణయించింది. అన్ని పన్నులతో పాటు ఆస్పత్రులకు చెల్లించే సర్వీస్ ఛార్జి రూ.150 ఇందులో భాగమేనని కేంద్రం స్పష్టం చేసింది. ప్రైవేటు దవాఖానలు సర్వీస్ ఛార్జి రూ.150 కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను కోరింది.

ఈ మేరకు ఆయా ఆస్పత్రులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించింది. ఈ నెల 21 నుంచి దేశవ్యాప్తంగా 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ టీకాలు ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రధాని సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే.

కంపెనీలు ఉత్పత్తి చేసే వ్యాక్సిన్లలో 75శాతం కేంద్రమే కొనుగోలు చేసి ఉచితంగా ఇవ్వనుండగా.. ఉచితంగా వద్దనుకునే వారికి టీకాలు వేసేందుకు 25శాతం ప్రైవేటు ఆస్పత్రులకు ఇస్తున్నట్లు కేంద్రం పేర్కొంది.

## టీఎస్ఆర్టీసీ బస్సుల ప్రయాణ వేళలు పొడిగింపు

హైదరాబాద్, జూన్ 9:తెలంగాణ వ్యాప్తంగా కరోనా కేసులు తగ్గుముఖం పట్టడంతో ఈనెల 10 నుంచి ఉ.6 గంటల నుంచి సా.6 గంటల వరకు సడలింపులను ఇచ్చింది. దీంతో టీఎస్ఆర్టీసీ జిల్లాలకు నడిపే బస్సులను ఉ.6 గంటల నుంచి సా.6 గంటల వరకు తిప్పుతామని ఆర్టీసీ ఆపరేషన్స్ ఈడీ యాదగిరి స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా సుమారు 3,600 బస్సులను మధ్యాహ్నం 2 గంటల వరకే నడుపుతున్నామని, వాటినే సా.6 గంటల వరకు తిప్పుతామని తెలిపారు.

హైదరాబాద్ నగరంలో ఉ.6 గంటల నుంచి సా.5 గంటల వరకు సిటీ బస్సులు అందుబాటులో ఉంటాయని టీఎస్ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. లాక్‌డౌన్ విరామ సమయంలో సిటీ బస్సులను తిప్పుతామని ఈడీ తెలిపారు. గ్రేటర్ పరిధిలోని బస్ పాస్ కౌంటర్లన్నీ ఉ.6:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## చివరి దశకు మెట్రాజ్‌పల్లి పంప్ హౌస్ పనులు : ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, జూన్ 9 : మెట్రాజ్‌పల్లి పంప్ హౌస్ పనులు చివరి దశకి చేరుకున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దేశంలోనే అత్యున్నత టెక్నాలజీతో ప్యాకేజీ 21 నిర్మాణం అవుతోందని కవిత పేర్కొన్నారు. రైతుల భూములు పోకుండా భూగర్భం నుంచే పైప్ లైన్స్ వెళ్తాయని స్పష్టం చేశారు.

ప్యాకేజీ 21 తో 2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. కరోనా నవథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అలాగే నిజామాబాద్‌లో కరోనా మూడో వేవ్‌ని ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో మూడో వేవ్ రాదనే అనుకుంటున్నామని ఆమె అభిప్రాయపడ్డారు. అయినా కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని వైద్య సదుపాయాలు సిద్ధం చేస్తున్నామని కవిత తెలిపారు. ఎమ్మెల్సీ వెంట ఎమ్మెల్యే బాజి రెడ్డి గోవర్ధన్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## బాల గేయం

### వర్షా కాలం!

పంటలు ఎన్నో పండేకాలం
కుంటలు చెరువులు నిండే కాలం
వానలు కురిసే వర్షాకాలం!
జల్లుల తడిసే వర్షాకాలం ॥పంట॥

బీటలు వారిన బీడుల సైతం
మాటి మాటికీ తడిపే కాలం!
మాగాణాల్లో వరిధాన్యాలు
బాగా పండే రైతుల కాలం!
మెట్ట భూమిలో కందులు, జొన్నలు
మెండుగ పండే వర్షాకాలం! ॥పం॥

వరద నీటిలో పిల్లలు కాగిత–
పడవలు ప్రియముగ వదిలే కాలం!
మూలకు పడిన గొడుగులు కాస్తా
ముక్తిగ చేతుల కొచ్చే కాలం!
అతిగా వానలు కురిశాయంటే
అనర్థాల కెరయయ్యే కాలం! ॥పం॥

– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## చరిత్రలో నేటినిజం



కేం॥ అల "బాడ్మింటను" నాడుచు
విలువలకే విలువలనిడ - విఖ్యాతి నిలిపె
జగజెట్టిగ వర్ధిల్లెను
పలుకీర్తులలో "ప్రకాష్ పదుకోనే"పై !!

–రాధశ్రీ
( జూన్ 10 ప్రకాష్ పదుకోనే పుట్టిన రోజు... )
సెల్: 9494481210

## ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్ల చర్చలు సఫలం

అరమావతి, జూన్ 9ఏపీ ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్ల చర్చలు సఫలమయ్యాయి. సమ్మె విరమిస్తున్నట్లు జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. జూనియర్ డాక్టర్లతో రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి ఆళ్ల నాని, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి చర్చలు జరిపారు. డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు తెలిపారు. సమ్మె విరమించి విధులకు హాజరు అవుతామని ప్రకటించారు.

కరోనా సమయంలో చికిత్స అందిస్తూ మృతి చెందిన డాక్టర్ రోజికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. సీఎం వైఎస్ జగన్ అదేశాలు మేరకు జూనియర్ డాక్టర్స్ ప్రతినిధులతో మంత్రి ఆళ్ల నాని మంగళగిరి ఏపిఐఐసిలో చర్చలు జరిపారు. ప్రభుత్వం నిర్ణయాలకు సానుకూలంగా స్పందించిందని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సీఎం వైద్యులు, వైద్య సిబ్బంది పట్ల పూర్తి సానుకూలంగా ఉన్నారని మంత్రి ఆళ్ల నాని పేర్కొన్నారు. ఏలూరు ఆశ్రమం హాస్పిటల్ లో కోవిడ్ విధులు నిర్వహిస్తూ కరోనాతో మరణించిన డాక్టర్ రోజికి రూ.25 లక్షలు రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించారు.

కరోనా సమయంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి ఎల్లవేళలా అండగా ఉంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కరోనా సమయంలో విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి ఆళ్ల నాని స్పష్టం చేశారు.

కరోనా బారిన పడిన డాక్టర్ భాస్కర్ కి సీఎం కోటి 50 లక్షలు రూపాయలు సాయం అందించారని తెలిపారు. అవసరం అయితే మరింతగా ఆర్థిక సహాయం అందించడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హాస్పిటల్స్ లో విధి నిర్వహణలో ఉన్నప్పుడు వైద్యులకు, వైద్య సిబ్బందికి ప్రభుత్వం పూర్తిగా రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో కోవిడ్ కోసం వైద్య సేవలు అందించడానికి సుమారుగా 30 వేల మందిని రిక్రూట్మెంట్ చేశామన్నారు. ఏపిలో పీజీ చదివే వైద్య విద్యార్థులకు ఫీజు రూ. 26 లక్షలు నుండి రూ. 5 లక్షలు వరకు తగ్గిస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. బ్లాక్ ఫంగస్ వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు మంత్రి వివరించారు.

### ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల రద్దుపై నిర్ణయం తీసుకోలేదు: మంత్రి సబిత

హైదరాబాద్, జూన్ 9: తెలంగాణలో ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల రద్దు విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన తర్వాత పరీక్షలపై ప్రకటన చేస్తామని చెప్పారు. మంత్రి సబిత బుధవారం వికారాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు రద్దు చేశారా అని మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రి వివరణ ఇచ్చారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులను పరీక్షలు లేకుండానే ప్రమోట్ చేసిన విషయం విదితమే.

## ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పరామర్శించిన సీఎం కేసీఆర్

జగిత్యాల, జూన్ 9: మెట్‌పల్లిలోని రేగుంటలో ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా సుమన్ తండ్రి సురేష్ చిత్రపటానికి సీఎం కేసీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రేగుంట నుంచి సీఎం రోడ్డు మార్గాన హైదరాబాద్ బయల్దేరారు. మెట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్క సురేష్(62) కరోనాతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఇటీవల కన్నుమూశారు.

## ఇకపై ప్రభుత్వ దవాఖానల్లోనూ గుండె జబ్బులకు వైద్యం

నల్లగొండ, జూన్ 9:: ఇకపై గుండె జబ్బులకూ ప్రభుత్వ దవాఖానలో వైద్యం అందించ నున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. తెలంగాణా డయాగ్నొస్టిక్ సెంటర్, మొబైల్ క్రిటికల్ కేర్ అంబులెన్స్ తో పాటు ఆక్సిజన్ ప్లాంట్లను మంత్రి నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ దవాఖానల్లో గుండె జబ్బులకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు నిర్వహించ నున్నట్లు ఆయన ప్రకటించారు.

అందుకు సంబంధించిన సిబ్బంది నియామకాలకు సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు.

క్యాన్సర్ మహమ్మారిని నిలువరించేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికలను సిద్ధం చేశారని ఆయన చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ దవాఖానలలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెరిగిందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కే. వి.రామారావు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీఎంహెచ్‌వో కొండల్ రావు, దవాఖాన సూపరింటెండెంట్ జైసింగ్ రాథోడ్, డీసీహెచ్ డాక్టర్ మాతృ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణలో తెలంగాణ టాప్

నల్లగొండ, జూన్ 9: ప్రజారోగ్య పరిరక్షణలో తెలంగాణ ప్రభుత్వం సత్ఫలితాలు సాధిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ముందు చూపుతో ముఖ్యమంత్రి కేసీఆర్ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడమే అందుకు కారణమని ఆయన చెప్పారు. జిల్లా కేంద్రంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కళాశాల నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచాన్ని కబలిస్తున్న కరోనా కట్టడిలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న ముందు చూపు నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. మెడికల్ కళాశాలల ఏర్పాటుతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు కలిగే ప్రయోజనాలు ఇప్పుడిప్పుడే బోధ పడుతున్నాయని చెప్పారు.

కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, రాజన్నగూడెం సింగిల్ విండో చైర్మన్, సీనియర్ టీఆర్ఎస్ నేత కేవీ రామారావు, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, స్థానిక మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి సబితా రెడ్డి

వికారాబాద్, జూన్ 9: వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌ను విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..57 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు ఇక నుంచి ఉచితంగా అందుబాటులో కి వస్తాయన్నారు. దీంతో ఎంతో మంది పేదలకు వైద్య ఖర్చుల భారం తప్పుతుందన్నారు.ఈ మేరకు జిల్లా ప్రజల తరుపున సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి , ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్ , కాలే యాదయ్య, పట్నం నరేందర్ రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి, కొప్పుల మహేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పౌసుమి బసు, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానల పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వసనీయత

మహబూబ్‌నగర్, జూన్ 9: ప్రభుత్వ దవాఖానల పట్ల పేద ప్రజల్లో విశ్వాసం పెరిగిందునే నేనుపోత బిడ్డో సర్కారు దవాఖానకు అంటున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.

ఈ డయాగ్నొస్టిక్ కేంద్రంలో హార్ట్, కిడ్నీ, బ్రెస్ట్ క్యాన్సర్, షుగర్, లిపిడ్ ప్రొఫైల్ వంటి అన్ని రకాల టెస్టులు నిర్వహిస్తారని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన డయాగ్నొస్టిక్ కేంద్రం ద్వారా పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడే ఇవ్వాలని, ఫలితాలను డిజిటలైజేషన్ చేయాలన్నారు.

నమూనాల సేకరణ ఫలితాల విషయంలో ఎలాంటి తేడా లేకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు ఫలితాలను తక్షణమే సంబంధిత రోగులకు వారి వాట్సాప్ కు పంపించే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

ఫలితాల వివరాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని, ఫలితాలను పర్యవేక్షించేందుకు ఒక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అంతేకాక తెలంగాణ డయాగ్నొస్టిక్ వాట్సాప్ ను కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు.

మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో డాక్టర్లు , నర్సులు, సిబ్బంది సంఖ్య పెరిగిందని, 500 పడకలు, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల సుమారు140 మంది హౌస్ సర్జన్లు సేవలందిస్తున్నారని ఇకపై నిరంతరం 300 మంది డాక్టర్లు దవాఖానలో సేవలు అందించే అవకాశం ఉందన్నారు.

మహబూబ్ నగర్ జిల్లా ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పై వారంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారని, టెండర్లను పిలిచి కాలువల నిర్మాణం చేపట్టి కాలువల ద్వారా చేరువులన్ని నింపుతామని మంత్రి వెల్లడించారు.

కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు, జిల్లా ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ కె.సి. నర్సింహులు, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పర్యవేక్షకుడు డాక్టర్ రాంకిషన్, మెడికల్ కళాశాల డైరెక్టర్ పుట్టా శ్రీనివాస్, డీఎంహెచ్ఓ డా. కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ శశికాంత్, ఆర్ఎంవో డాక్టర్ జీవన్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ తదితరులు ఉన్నారు.

## ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన సీఎం కేసీఆర్

నిజామాబాద్, జూన్ 9: ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ఇవాళ సందర్శించారు. సీఎం కేసీఆర్ వెంట మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే జీవన్ రెడ్డితో పాటు టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా ఆర్మూర్‌లో సీఎం ఆగారు. ఈ సందర్భంగా నూతన క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు.

మెట్‌పల్లిలోని రేగుంటలో ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సుమన్ తండ్రి సురేష్ చిత్రపటానికి సీఎం కేసీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రేగుంట నుంచి సీఎం రోడ్డు మార్గాన హైదరాబాద్ బయల్దేరారు. మెట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్క సురేష్(62) కరోనాతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఇటీవల కన్నుమూశారు.

## పవిత్ర స్నానాల కోసం వచ్చి ప్రాణాలు విడిచారు

కరీంనగర్, జూన్ 9: : పవిత్ర స్నానాల కోసం వచ్చి తండ్రి, కూతురు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర సంఘటన జిల్లాలోని రామడుగు మండలం చిప్పకుర్తి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రుద్రారం గ్రామానికి చెందిన కత్తి శ్రీనివాస్ (35) అతని కూతురు రుచిత(7) చిప్పకుర్తి సమీపంలోని గ్రావిటీ కాలువలో పవిత్ర స్నానాలకోసం వచ్చారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి తండ్రి, కూతురు మృతి చెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సంగారెడ్డిలో డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

సంగారెడ్డి, జూన్ 9: : సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్, ఆర్టీపీసీఆర్ సెంటర్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. ఈ సెంటర్‌లో ప్రజలకు 57 రకాల పరీక్షలు ఉచితంగా చేయనున్నారు. పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కిడ్నీ, లివర్, థైరాయిడ్, గుండెజబ్బులు వంటి 90 శాతం వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేయనున్నారు. టెస్టు చేసిన 24 గంటల్లోనే ఫలితాలు ఎస్ఎంఎస్ రూపంలో సెల్‌ఫోన్‌కు వస్తాయన్నారు. సంగారెడ్డి జిల్లా ప్రజలకు త్వరలో రేడియాలజీ సేవలు అందుబాటులో కి రానున్నాయని మంత్రి హరీష్ రావు తెలిపారు.

## యజ్ఞం ముగిసింది



కథతో పయనించి
కథలోనే శయనించినవాడు
కథను శ్వాసిస్తూనే
కొంతకాలం కథను శాసించినవాడు
కారామాస్టారు అనగానే
ఈ లక్షణాలే స్ఫురిస్తాయి ఎవరికైనా
కాళీపట్నం రామారావంటే
కథకు చిరునామా
గణితంపైన విశేష అధ్యయనం
జీవితం పట్ల అంతకుమించిన అవగాహన
అందుకే పాత్రలూ, పరిమితులను
లెక్క కట్టగలిగాడు
జీవితంలో నుంచే
కథను ఆవిష్కరించగలిగాడు
యజ్ఞం, ఆర్తి, జీవి, చావు
కథ ఏదైనా, అది
కారా మాస్టారి భావనలకు అద్దం
కథానిలయం ఆయన నాటిన విత్తనం
ముందుతరాల పరిశోధకులకు
అదే కథల కల్పవృక్షం
కథకులు, పాఠకులే కాదు
తెలుగుకథే, ఆయనకు ఋణపడింది
తెలుగు నేలపై నిలిచి చూసినప్పుడు
ఎక్కడో ఉత్తరాంధ్ర సాహితీలో
తెరచిన తలుపు
తెలుగు కథల ఆకాశంలో
ఆయన ఒక మెఱుపు



– మద్దాళి రఘురాం
9866057777

## కోల్పోయింది...

తెలుగు కథ
మాస్టారును కోల్పోయింది
కథను చెక్కి చెక్కి
శిల్పంలా మలచిన
ఓ శిల్పకారున్ని కోల్పోయింది.
సమాజ జీవన చిత్రాన్ని
కథా కాన్వాసుపై
దృశ్యమానంచేసిన
ఓ కథా చిత్రకారున్ని కోల్పోయింది.
సాహితీ కొలనులో
వికసించిన కథా పుష్పాలను
మాలగా కూర్చి
కథా నిలయాన్ని అందంగా అలంకరించి
నిత్యం కథను పూజించిన
ఓ నిత్య కథా పూజారిని కోల్పోయింది.
కథా పరిశోధకులకు
ఊతకర్రై తోడునిల్చి
కథా ప్రపంచానికి కొత్తదారి చూపిన
ఓ మార్గదర్శిని కోల్పోయింది.
నిరంతరం
కథా యజ్ఞాన్ని గావించి
వ్యక్తులలో
చైతన్యపు జ్వాలలను రగిలించి
సమాజానికి వెలుగు చూపిన
ఓ క్రాంతదర్శిని కోల్పోయింది.
మాస్టారుగా
వృత్తిజీవితాన్ని ప్రారంభించి
కథలనే ధ్యానించి
కథలనే శ్వాసించి
కన్నీటి వ్యథలను కథలుగా మలచిన
ఓ కథాసామ్రాట్టును కోల్పోయింది.
(కారా మాస్టారుకు నివాళిగా.....)

–ఎస్.నరేశ్ చారి
9701334516

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 10-6-2021





-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240


## నేటికవిత-కవిత్వ విశ్లేషణ

నేటికవితలో ఈ వారం: నీ అలికిడి లేక
అనే అంశంపై వచ్చిన 63 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ

-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544


## తొలిచే జ్ఞాపకాలు

మనసు ఒంటరిదై తోడులేక
కాలం తోడేస్తుంది నిర్దాక్షిణ్యంగా
నీ తలపుల నీడల్లో తొంగిచూసేవేళ
దోబూచులాడే నీ అలికిడి లేక.
ఏదిశలో నీ రాక తెలియకపోతుందాని
చెవులు రిక్కించి మరీ విందామనే
మస్తిష్కంలో తొలిచే జ్ఞాపకాలు పిలిచే
ఏ అలికిడి వచ్చినా పసిగట్టేలా..
ఎంతకూ రావేమి ఎగిసిపడే ఎదలో
అంతకంతకూ పెరిగే సెగలు పొగలుకమ్మి
చింతనలతో వేసారుతుంటే
నీ అలికిడి నిట్టూర్పును నిబాయించుతూ..
నా శ్వాస నిశ్వాసల్ని నిరోధిస్తున్నా నెమ్మదిగా
ఏ చిన్నపాటి శబ్దం నీనుంచే వస్తుందని
అవి వింటే నన్ను నేను మరచిపోతాను
నీవు దరిచేరి సేదతీర్చేస్తావనే.. చిన్ని ఆశ
నిరీక్షణలో విరహవేదన ఎంత కమ్మటిదో
అలుపెరుగని ఎదురుచూపు
వెలుగుపూల దండలల్లి
నీ మెడలో అలంకరించాలని
నీ అలికిడి లేక
ఉసూరుమంటోంది ప్రాణం

-వెంకటేశ్వర్లు లింగుట్ల
9440472254

తిరుపతికి చెందిన కవి వేంకటేశ్వర్లు లింగుట్ల గారు నీ అలికిడి లేక అంశాన్ని తొలిచే జ్ఞాపకాలు శీర్షికతో తమ కవితను తీర్చిదిద్దారు. ప్రియసఖి అలికిడి లేక .. పొందే వ్యధను మరియు నిరీక్షణలో ఉండే విరహవేదన ఎంత బాగుంటుందో వివరింప యత్నించారు. అలికిడి లేక ప్రాణం ఉసూరుమంటోందని అలుపెరుగని ఎదురుచూపు వెలుగు పూలదండలల్లి నీ మెడలో అలంకరించాలని ఉందంటూ కవి లింగుట్ల గారు తమ కవితను చక్కని భావుకతతో కొనసాగించారు. ఔచిత్యవంతమైన పదబంధాలు ప్రయోగించి కవితావస్తువు వెలుగులో తమ ఆలోచనలను చక్కని శిల్పంతో అర్థవంతంగా ఆవిష్కరించారు. అలికిడికి దూరమై మదిలో తొలిచే జ్ఞాపకాల సవ్వడులను కవిత్వ మువ్వలుగా వినిపించారు. మనసు ఒంటరిదై తోడులేక నిర్దాక్షిణ్యంగా కాలం ఒకవైపు తోడేస్తుంటే ప్రియసఖి తలపులనీడల్లో తొంగిచూసే వేళ దోబూచులాడే మనసును అక్షరాల్లో అందంగా నిక్షిప్తం చేసి కవిత ఎత్తుగడకు మరింత బలాన్ని కూర్చారు. మనసు ఒంటరిదై తోడులేక పడే బాధను ప్రారంభ పంక్తుల్లో .. కవితా వస్తువుకు సరిపడే విధంగా కవి లింగుట్ల గారు భావప్రకటన చేసి మెప్పించారు. అలుపెరుగని ఎదురుచూపులను కవితాత్మకంగా దృశ్యమానం చేశారు. నెచ్చెలి రాకకోసం చెవులు రిక్కించి మరీ విందామనే జ్ఞాప కాలు మస్తిష్కంలో తొలుస్తుంటే.. సంబంధిత వేదన ఓ వైపు మెలిపెడుతుంటే ఏ అలి కిడి వచ్చినా రాకను పసిగట్టే విధంగా అప్రమత్తంగా ఉన్న స్థితిని అక్షరాల్లో బంధించిన తీరు బాగుంది. అయితే ఎంతకూ రాని నేపథ్యంలో ఎదలో అంతకంతకూ పెరిగే సెగలుపొగలు కమ్మి చింతనలతో వేసారుతుంటే ఆమె అలికిడికై నిట్టూర్పును నిబాయించుకునే అంశాన్ని చక్కగా వివరించారు.

విరహవేదనను మరీ బలంగా ప్రకటించడానికి కవి ప్రయత్నించిన తీరు ప్రశంసనీయంగా ఉంది. నా శ్వాస నిశ్వాసలను నిరోధిస్తున్నానెమ్మదిగా ఏ చిన్నపాటి శబ్దం నీ నుంచే వస్తుందని.. అవి వింటే నన్ను నేను మరచిపోతాను అంటూ కొనసాగించారు. సేద తీర్చేస్తాననిఅంటూ మనసులో కదలాడే చిన్ని ఆశకు అక్షరరూపమిచ్చారు కవి లింగుట్ల వెంకటేశ్వర్లు గారు. అలికిడి లేక పొందే విరహవేదనలను చక్కని భావుకతతో కవితను రూపుదిద్దారు. భావకవిత్వానికి పెద్దపీట వేస్తూ కవిత యొక్క రమణీయతను పెంచారు. మున్ముందు మరింత గాఢమైన కవిత్వం ఆయన కలం నుండి జాలువారగలదన్న విశ్వాసం ఉంది.

## నాలో నిశ్శబ్దం

నాలో నిశ్శబ్దం పేరుకుపోయి
మౌన శిలనై నిలిచిపోయా
నన్ను కరిగించే నీ అలికిడి లేక.
నువ్వొస్తావో రావో తెలియని
నిశీధిబాట వెంట పరుగులు పెడుతున్నా
నీ అచూకీ కోసం
నీ అలికిడి కానరాక.
కళ్లు వర్షిస్తున్నాయి
గ్రీష్మం లో ఆవిరై
మబ్బులో కెగసిన నీటి సంద్రంలా
నీ అలికిడి లేక.
నా మౌనభావాలు
ఎవరితో పంచుకోలేక రాలిపడుతున్నాయి
శిశిరంలో నేల రాలిన పండుటాకుల్లా
నీ అలికిడిలేక.
వాకిట్లో విరజాజులు
వాసన కోల్పోతున్నాయి
ఆస్వాదించే తమ సఖుడు లేడని
వాడి విలపిస్తున్నాయి
నీ అలికిడి లేక
చిన్ని అలికిడి వినిపించినా
నా ఎదసడి కి ఏదో ఆశారేఖ
నాలోని నిశ్శబ్ద రాగాలని
శృతి చేసి
వాసంత సమీరంలా నన్ను
అల్లేసే ఆ అలికిడి
నీ అలికిడి ఏమో అని



-ఉత్కర్ష
9000479057

కాజీపేటకు చెందిన కవయిత్రి ఉత్కర్ష గారు నీ అలికిడి లేక అంశంపై నాలో నిశ్శబ్దం శీర్షికతో మౌనరాగాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. నన్ను కరిగించే అలికిడి లేక నాలో నిశ్శబ్దం పేరుకుపోయి మౌనశిలనై నిలిచిపోయానంటూ ప్రియుడి అలికిడికి దూరమైన వైనాన్ని ప్రారంభపంక్తుల్లోనే కవయిత్రి ఉత్కర్ష గారు బలంగా ప్రకటించారు. ప్రియుడి అలికిడికి దూరమై వస్తాడో రాడో తెలియక నిశీధి బాటవెంట పరుగులు పెడుతూ అచూకీ కోసం చేసే ప్రయత్నాన్ని చక్కని భావధారతో తీర్చిదిద్దారు.

విరహవేదనను మరింత కవితామయం చేసేందుకు కవయిత్రి ప్రయోగించిన పదబంధాలు కవితలో అందంగా ఒదిగిపోయాయి. నీటి సంద్రంలా గ్రీష్మంలో ఆవిరై కన్నీళ్ళు వర్షిస్తున్నాయని మౌన భావాలు ఎవరితో పంచుకోలేక పండుటాకుల్లా రాలిపడుతున్నాయని అంటూ కొనసాగించిన తీరు బాగుంది. శిల్పంలో చతురతను ప్రదర్శిస్తూ ఔచిత్యవంతమైన భావాలను కవితలో పొందుపరుస్తూ కవితా వస్తువుకు మెరుగులు అద్దారు.

అలికిడి లేక వాకిట్లో విరజాజులు వాసన కోల్పోతున్నాయని ఆస్వాదించే సఖుడు లేడని వాడి విలపిస్తున్నాయని ఆవిష్కరించి కవితకు పుష్టిని కలిగించారు. కవిత్వ అంశాన్ని ఆద్యంతం కవితాత్మకంగా మలచడంలో కవయిత్రి ఉత్కర్ష గారు సఫలీకృతులైనారు. విరహవేదనను, అలికిడి దూరమైన వెతలను అలవోకగా కవిత్వీకరించారు.

కవయిత్రి ముగింపులో ప్రకటించిన భావాలు రమణీయంగా కొలువుదీరాయి. ఏ చిన్న అలికిడి వినిపించినా నా ఎద సడికి ఏదో ఆశారేఖ.. నాలోని నిశ్శబ్దరాగాలను శృతి చేసి వాసంత సమీరంలా నన్ను అల్లేసే ఆ అలికిడి నీ అలికిడి ఏమోనని అంటూ కవితకు చక్కని ముగింపునిచ్చారు. వస్తువిశ్లేషణ , శిల్పం వంటి విషయాల్లో కవయిత్రి చూపిన ప్రతిభ అభినందనీయం. కవిత్వ నిర్వహణలో కవయిత్రి నేర్పరితనం కానవస్తోంది. అభివ్యక్తిలో నవ్యతను పాటించి కవయిత్రి ఉత్కర్షగారు పాఠకులను మెప్పించారు.

## నువ్వే నేననుకున్నా

నువ్వు నను పలకరించవని తెలిసినా..
నీ స్వర మధురిమ కోసం..
ఆశల వాకిలి తెరిచి చూస్తూనే వున్నా..
నీ అలికిడి లేక మూగబోయిన మనసుతో
ఏ క్షణమైనా నీ గుండెలయలోని పదం
నీ పెదవి గడప దాటి వస్తుందేమోననే
ఆశతో నిన్ను గమనిస్తూనే వున్నా..
నువ్వెక్కడ ఉన్నా..
నీ పదసవ్వడి కోసం ఆశిస్తూ
నీ తలపుల నావలో పయనిస్తూనే వున్నా..
నేను నీకు జ్ఞాపకం లేకున్నా..
నా హృదయాలయంలో నిను
చెరగని చిత్రపటమై నిలుపుకున్నా...
నామదిలో ముద్రించిన
నీ చిత్రంలో .. ముంగురులు
గాలికి చెదిరి అలికిడి చేస్తున్నట్లు
తలచి మురిసిపోతున్నా
నువ్వెంత వద్దనుకున్నా
నీలో నే లేకున్నా
నాలో నిను నిలుపుకున్నా
నువ్వే నేననుకున్నా...



-లక్ష్మీపద్మజ దుగ్గరాజు
9866328747

హైదరాబాదుకు చెందిన కవయిత్రి దుగ్గరాజు లక్ష్మీ పద్మజ గారు నీ అలికిడి లేక అంశంపై నువ్వే నేననుకున్నా శీర్షికతో రాసిన కవితలో ప్రతి పంక్తిని కవితాత్మకంగా మలచడానికి ప్రయత్నించారు. పదాడంబరాలకు పోకుండా అలతి అలతి పదాలతో అద్భుతమైన భావాలను పండించారు.

నువ్వు ఎంత వద్దనుకున్నా నీలో నేలేకున్నా నాలో నిను నిలుపుకున్నా నువ్వే నేననుకున్నానంటూ అడుగడుగునా ప్రియునికోసం వేచిచనూసే పదచిత్రాలను పదబంధాలను ప్రయోగిస్తూ కవితావస్తువును ప్రకాశమానం చేశారు. ప్రియుడి అలికిడి కోసం ప్రియురాలు పడే విరహవేదనను అక్షరబద్ధం చేశారు. నువు నన్ను పలకరించవని తెలిసినా నీ స్వర మధురిమ కోసం ఆశావాకిలి తెరిచి చూస్తూనే ఉన్నానంటూ కవితనెత్తుకోవడంలో కవయిత్రి ప్రతిభను ప్రదర్శించారు. ఎత్తుగడలో ఆశలవాకిలి పదాన్ని ప్రయోగించడంలో కవయిత్రి ఔచిత్యాన్ని ప్రశంసించి తీరుతాం. నీ అలికిడి లేక మూగబోయిన మనసుతో ఏ క్షణమైనా నీ గుండెలోని పదం నీ పెదవి గడపదాటి వస్తుందేమోనని ఆశతో నిన్ను గమనిస్తూనే ఉన్నానంటూ ఎదురుచూపులను పై పంక్తులలో ప్రస్తావించినతీరు బాగుంది.

నువ్వెక్కడ ఉన్నా నీ పద సవ్వడి కోసం ఆశిస్తూ నీ తలపుల నావలో పయనిస్తూనే ఉన్నా అని ప్రకటించడం వల్ల కవితకు మరింత శిల్ప పరంగా గాఢతను అద్దినట్టయ్యింది. తలపుల నావ పదం కవితలో చక్కగా ఒదిగిపోయింది. నేను నీకు జ్ఞాపకం లేకున్నా నా హృదయంలో నిన్ను చెదరని చిత్రపటమై నిలుపుకున్నానంటూ మరింత బలంగా నిరీక్షణకు సంబంధించి ప్రియుడి అలికిడికి సంబంధించి భావప్రకటన చేశారు. హృదయాలయంలో చెదరని చిత్రపటంగా నిలుపుకున్నానంటూ ప్రకటించడం బావుంది. నా మదిలో ముద్రించిన నీ చిత్రంలో ముంగురులు గాలికి చెదిరి అలికిడి చేస్తున్నట్లు తలచి మురిసిపోతున్నా అంటూ రాసిన పంక్తులు కవయిత్రి లక్ష్మీ పద్మజ గారి భావుకతకు అద్దం పట్టే విధంగా రూపుదిద్దుకున్నాయి. నువు ఎంత వద్దనుకున్నా.. నీలో నేలేకున్నా నాలో నిను నిలుపుకుంటున్నా.. నువ్వే నేననుకున్నానంటూ అర్థవంతమైన ముగింపునిచ్చారు. మున్ముందు కవయిత్రి లక్ష్మీ పద్మజ గారు మరింత బలమైన కవిత్వాన్ని అందిస్తారని ఆశిద్దాం.

సామాన్యుని జీవనము-న
సామాన్యముగా నుడివిన సత్కథకుండౌ
ధీమతి కాళీ పట్నము
రామారావుకు నివాళి ప్రస్తుతి జేతున్...

-రాధశ్రీ
సెల్: 9494481210

# కథా సాహిత్య దీపధారి 'కా.రా'

కథలన్నీ 'కంచి'కి వెళ్తాయి. మనం ఇంటికి వెళ్తాము. కాని 1977 నుండి కథలు కంచికి వెళ్ళటం లేదు. సాహితీ ప్రియులందరూ అభిమానంతో పిలుచుకునే కారా మాస్టారు శ్రీకాకుళంలో స్థాపించిన 'కథా నిలయాని'కి వెళ్తున్నాయి.

ఆనాడు 500పై చిలుకు పుస్తకాలతో ప్రారంభించ బడిన కథా నిలయంతో నేడు లక్షకు పైగా కథలు, 25000పైగా కథా సంకలనాలు, మరో 25000పైగా పత్రికా సంచికలు వ్యాసాలు పరిశోధనా రచనలు, తెలుగు అనువాద కథలు కథకుల వ్యక్తిగత సమాచారంతో కథల 'ఎన్‌సైక్లోపీడియా' అనదగిన కథా నిలయం 2009లో డిజిటైజేషన్ గావించబడింది. ఆసక్తిగలవారు 'కథానిలయం.కామ్' వెబ్‌సైటుకు వెళ్ళి కావలసిన కథను చదువుకోవచ్చును. డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

తెలుగు కథకు దశ,ధిశ, స్థిరత్వం కల్పించిన ఈ ఘనత నిస్సందేహంగా నిర్వివాదంగా, 4వ జూన్‌న స్వర్గస్థులైన కాళీపట్నం రామారావు (9-11-1924 -4-6-2021)గారికి దక్కుతుంది.

### ఎవరీ కారా మాస్టారు?

అతి సామాన్య కుటుంబంలో భ్రమరాంబ పేర్రాజు దంపతులకు, శ్రీకాకుళం జిల్లాలోని మురపాక అనే కుగ్రామంలో జన్మించిన వీరి అసలు పేరు కాళీపట్నం వెంకట సూర్య సుబ్రహ్మణేశ్వరావు. తలిదండ్రులిప్పించ గలిగిన చదువు అంతంత మాత్రమే! ఆరో తరగతి తప్పారు. పదవ తరగతి వ్రాసివచ్చి స్వగ్రామంలోని రామకృష్ణ గ్రంథాలయంలో గడిపేవారు. ఈ గ్రంథాలయం కారాగారి జీవితంలో మైలురాయి అయింది. నిరంతర అధ్యయనంతో మేధకు పదును పెట్టుకున్నారు. టైపిస్టు, జిల్లా కోర్టు, రేషనింగ్ ఆఫీసులో చిరుద్యోగిగా గడిపిన ద్యాసంతా కథ మీదే వుండేది. రచయితకు ఒక ప్రాపంచిక దృక్పధం ఉండాలని గట్టిగా విశ్వసించే మాస్టారు స్వతః అలవర్చుకున్నారు. కథల్లో ప్రతిఫలింప చేసారు.

### కథా యజ్ఞం:

తన 14 ఏటనే కథా రచన ప్రారంభించారు. వీరి తొలి కథ: అముద్రిత "ముద్దు". 1943లో చిత్ర గుప్త పత్రికలో ప్రచురించబడిన 'ప్లాటు ఫారమో' వీరి మొట్ట మొదటి కథగా చెప్పుకోవచ్చును. 1955 నుండి 1963 దాకా కలం పట్టకుండ ప్రపంచాన్ని పరిశీలించారు. ఒక నిబద్ధ రచయితగా తన్ను తాను మలుచుకున్నారు. 1964లో వెలుగు చూసిన 'తీర్పు' కథలో మేష్టారు ప్రతిభ లోకానికి అవగతం అయింది. 1966లో రాసిన 'యజ్ఞం' కథ వీరి అవగాహన ప్రాపంచిక దృక్పధానికి అద్దం పట్టింది. కథకు ఉండవలసిన సమాజానుబంధం, వ్యష్టి, సమిష్టిల బలాబలాలుకు మార్గదర్శి అయింది. Magnum opus అనదగిన ఈ కథ నాటి సామాజిక ఆర్థిక మూలాల కఠినత్వాన్ని ఎత్తి చూపింది.

నేనెందుకు, కుట్ర, తీర్పు, నోరూ, స్నేహం, ఆర్తి, చావు, భయం, ఆదివారం, హింస, వీరుడు, మహావీరుడులాంటి ప్రముఖమైన 60 కథలు వ్రాసారు. రాసిలో తక్కువే. అయినా వాసిలో ప్రతీ కథాఓ ఆణిముత్యం.

1955లో వీరిని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. స్వీకారానికి మొదట తటపటాయించినా, వచ్చిన ఆర్థిక సాయంతో 'కథా నిలయాన్ని స్థాపించారు. తెలుగు విశ్వ విద్యాలయం వారి గౌరవ డాక్టరేటు, రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు, లోక నాయక్ ఫౌండేషన్ అవార్డులాంటి వెన్నో మేష్టారును వరించాయి. 1973 తానా మహాసభలకు ఆహ్వానించబడి, ప్రవాసాంధ్రుల ప్రశంసలు అందుకున్నారు.

కమ్యూనిస్టు భావ జాలాన్ని అభిమానించే వీరి కథల్లో సమిష్టి సాధనకు పునాదులు కనబడుతాయి. ప్రతీ కథకు సామాజిక ప్రయోజనం ఉండాలని విశ్వసించే వీరి కథలు గుప్పెట మూసిన కథలు. పాఠకుడిని కథలో లీనమయ్యేలా చేసి, ఆలోచింప చేస్తాయి. శ్రీకాకుళం భాష యాసలతో స్థానికతను దీపస్థంభంలా నిలబెట్టారు. బడుగు బ్రతుకుల చిత్రన వీరి బలం.

'కారా మాస్టారు నా గురువు' అని చెప్పుకునే ప్రముఖ కథకులు యండమూరి, రావిశాస్త్రి, వరవరరావు, వివినమూర్తి, కవనశర్మ లాంటి ప్రముఖులు వీరి అభిమానులు.

ఈ నెల నాలుగున దివంగతులైన మాస్టారు నిజానికి మనను విడిచిపోలేదు.

కథకు ఒక ఉనికి, స్థాయి కల్పించిన వీరు 'కథానిలయం' ఉన్నత వరకూ సాహితీ ప్రేమికుల గుండెల్లో, తెలుగు కథా సాహితీ వీధుల కూడలిలో దిక్సూచియై, చుక్కానియై మనమధ్యే ఉంటారు. మనవెంటే ఉంటారు, మార్గదర్శనం చేస్తారు.



- కూర చిదంబరం
సెల్: 8639335675



'తెలుగు కథ'కు పర్యాయపదంగా నిలిచిన సుప్రసిద్ధ కథా రచయిత కాళీపట్నం రామారావు మృతికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంతాపం ప్రకటిస్తున్నాయి. కథా రచన చేయడంతో పాటు కథకులకు ప్రేరణగా నిలిచారు కాళీపట్నం రామారావు. 'కథానిలయం' వ్యవస్థాపనతో కథకులకు, భావి తరాల పరిశోధకులకు ఒక మార్గం చూపించారు. ఆయన కథలపై పలువురు రచయితల స్పందనను క్లుప్త వ్యాసాల రూపంలో 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -నిర్వహణ: డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

- సంపాదకులు

## కథల కాణాచి కా.రా

కా.రా.మాస్టారుగా ప్రసిద్ధి చెందిన కాళీపట్నం రామారావు సరళ భాషలో, సామాజికాంశాలతో కథలు రచించి సామాన్య జ్ఞానమున్న పాఠకులను కూడా తన కథలలో లీనమయ్యేలా చేసిన గొప్ప రచయిత, విమర్శకుడు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన కాళీ పట్నం రామారావు 1924 నవంబర్ 9 వ తేదీన శ్రీకాకుళం జిల్లా మురపాక గ్రామంలో వారి అమ్మమ్మ గారి ఇంట్లో జన్మించారు. ఎయిడెడ్ ఉపాధ్యాయునిగా సేవలందించి 1972 లో పదవీ విరమణ పొందారు.

చిన్ననాటి నుండే వివిధ పత్రికల్లో వచ్చిన కథలు చదివి కథారచన చేయాలన్న ఆసక్తిని పెంచుకున్న కాళీపట్నం రామారావు 1943 నుండి కథలు రాయడం మొదలు పెట్టారు. ఆంధ్ర పత్రిక,భారతి పత్రికలలో కథలు అచ్చయ్యాయి. అధ్యయనం వల్ల అనుభవం వస్తుందన్న వారి నాన్న మాటల ప్రభావం కా.రా. పై బాగా పడింది. బాగా అధ్యయనం చేసి పట్టు సాధించి 1957 నుండి ఉన్నత స్థాయి రచయితగా ఎదిగారు. ఆయన రచనలలో సామాజికాంశాలు,మన చుట్టూ తిరుగుతున్న పాత్రలు, నిజ జీవితంలో అనుభవించిన, పరిశీలించిన కష్టాలు, సంఘర్షణలను తన కథలో ఇమిడ్చారు. సమాజంలో అట్టడుగు వర్గాల జీవన సమరాన్ని సునిశితంగా పరిశీలించి తన పాత్రల్లో చూపారు.

1964 లో వెలువడిన 'యజ్ఞం' కథ ఫ్యూడల్ విధానంలోని దోపిడీని కళ్ళకు కట్టినట్టుచూపుతుంది. ఆయన కథలు రష్యన్,ఆంగ్ల భాషలలోనికి అనువదింపబడ్డాయి. శ్రీకాకుళం యాస,సామాన్య జీవన విధానం ఆయన కథల్లో తారసపడతాయి. 1995 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ద్వారా వచ్చిన సొమ్మును మూల ధనంగా పెట్టి ఆయన మనసులో ప్రతిష్టించుకున్న కథానిలయానికి శ్రీకాకుళంలో పునాది వేశారు. ఈ కథా గ్రంథాలయాన్ని 1997 ఫిబ్రవరి 22న స్థాపించారు. కథానిలయం తెలుగు కథల సేకరణకు అంకితమైన ఒక గ్రంథాలయం. ఇక్కడ దొరకని తెలుగు కథ ఉండదు.ఎక్కడెక్కడి పాత కథలో సేకరించి భద్రపరిచారు. శ్రీకాకుళంలో నెలకొన్న ఈ భవనం కథానికానిలయం. అందరూ వచ్చి చదువుకోడానికి ఉండటానికి కూడా అనువుగా ఉంది. తెలుగులో వచ్చిన ప్రతి కథనీ ఈ గ్రంథాలయంలో భద్రపరచాలని కా.రా. ఆకాంక్ష.

ఇలా కథలే జీవితంలా బతికిన కథల కాణాచి సుప్రసిద్ధ కథా రచయిత కాళీపట్నం రామారావు శ్రీకాకుళంలో తన స్వగృహంలో కథలనే పలవరిస్తూ ఈ నెల 4వ తేదీన తన 97వ ఏట వృద్ధాప్యంతో కథాభిమానులను శోకసంద్రంలో ముంచి, తుదిశ్వాస విడిచారు.

- డాక్టర్ చీదెళ్ల సీతాలక్ష్మి, 9490367383

## 'అశిక్ష అవిద్య' కథ- పాత్రలు

కాళీపట్నం రామారావు రాసిన కథ 'అశిక్ష అవిద్య' ఒక ఎగువ మధ్య తరగతి కుటుంబనేపథ్యంలో నడిచిన కథ. ప్రధాన పాత్ర రామారావు తన సొంతూరికి దూరంగా పట్నం లో లెక్చరర్ గా పనిచేస్తున్నాడు. తమ్ముడి పెళ్లికి ఇంటిపెద్దగా భార్య శ్రీదేవితో పాటు పెళ్ళి పెద్దగా వ్యవహరిస్తాడు. సాధారణంగా అన్ని కుటుంబాలలో వుండే పాత్రలే అయినా ఆయా పాత్రలను పరిచయంచేస్తూనే కథను మలుపు తిప్పుతూ ముందుకు నడిపిన విధానం రచయిత లోని రచనా శక్తికి తార్కాణం. కనబడని నగని ఆ యింటి ఆడపడుచు విశాలాక్షి దొంగిలించిందని వదిన శ్రీదేవి అనుమానం. నగ పోయిందని ఎవ్వరికీ చెప్పొద్దని పెళ్ళిలో రభస చేయొద్దని భర్త చెప్పినా వినకుండా అమె ప్రవర్తించిన తీరు విశాలాక్షి ప్రాణం తీసుకునే వరకు రచయిత సాగించిన పట్టు ఈ కథకు హై లైట్.

రామారావు మంచితనం కంటే అతని చేతకాని తనం సొంత చెల్లెలిని సమస్యనుంచి బయటపడవేయలేక పోవడం ఈ కథ ప్రధానాంశంగా కనబడుతుంది. ఆమె మరణానికి కారణం ఆమె లోని న్యూనత భావం, అవమాన భారం. పరోక్షంగా ఆమె భర్త, తల్లిల వ్యవహార శైలి. పెళ్లిళ్లలో అత్యంత అల్ప విషయాలు విషాదాలు సృష్టిస్తాయి. పైకి కనబడని వాటి మూలాలు తెలుసుకోవడానికి ఎవరికి ఆసక్తి ఉండదు. మొత్తానికి విషయం ఏదైనా కథను పాఠకుడి చేత ఆసక్తిగా చదివించే కా.రా. మాస్టారి సత్తాకు ఈ కథ ఒక ఉదాహరణ.

ఈ కథ 1955 సంవత్సరంలో భారతి పత్రికలో ప్రచురితమైంది.

- రామకృష్ణ చంద్రమౌళి, 9666656687

## అద్భుత కథలు- అంతులేని విలువలు

కా.రా. కథలు ఆనాటి సామాజిక స్థితిగతులకు అద్దం పట్టినట్లుంటాయి. మధ్యతరగతి జీవితాలలోని ఒడిదుడుకులను ఒడుపుగా తన కథా వస్తువు గా చేసుకుని అద్భుత కథలను ఆవిష్కరింపజేశారు కాళీపట్నం రామారావు. ఆయన కథలన్నీ వైవిధ్యభరితమే.

'అదృశ్యం' కథలో బడుగులతో పాటు మధ్యతరగతి వారి బతుకులు చిత్రించిన విధానం పాఠకుడిని ఆకర్షిస్తుంది. కథ విషయానికి వస్తే సామాన్య వర్గానికి చెందిన లలిత లక్షణమైన పెళ్ళి సంబంధం వచ్చినా తిరస్కరించడం కథావస్తువై కథను నడిపించిన తీరు బాగుంది. అనురాధ, లలితల మధ్య చర్చ ఆసక్తికరంగానూ సహజంగానూ నిత్యజీవిత వాస్తవాలుగా,సగటు మధ్యతరగతి ఆడపిల్ల మనోభావాలుగా రాశారు కా.రా.

కా.రా. కథల్లో మరో గొప్ప కథ 'అశిక్ష-అవిద్య'. ఈ కథ మొత్తం ఎగువ మధ్య తరగతి కుటుంబ కథా నేపథ్యంలో సాగింది. ప్రధాన సూత్రధారి రామారావుపై, ఆయన భార్య శ్రీదేవి, కుటుంబం లోని పాత్రలన్నీ ఏ విధమైన ప్రభావాన్ని చూపాయో చెప్పీ చెప్పకుండానే చూపడం ఆయనకే చెల్లింది. నాటి కాలంలోని ఎగువ మధ్యతరగతి కుటుంబంలో జరిగే యధార్థ సంఘటనలనే తన కథలో ఆవిష్కరించడంలో కా.రా. కృత్యకృత్యులయ్యారు. ఆయా పాత్రలన్నీ జీవం పోసినట్లుగా, కళ్ళముందు కదలాడేలా కథను వైవిధ్య భరితంగా అనేక మలుపులు తిప్పారు. కథలో రామారావు లెక్చరర్ గా, జ్ఞానాన్ని పంచే స్థానం లో ఉన్నా అతని మంచితనం చేతకానితనంగా, స్వార్థపరుడిగా, సమస్య పరిష్కరించలేని అసమర్థుడిగా కనిపించినా ఈ పాత్రను అద్భుతంగా మలిచారు. మధ్యతరగతి పెళ్ళిళ్ళలోని ఆర్భాటాలను, పురోహితుల అవసరాలను, అపనమ్మకాలను ఎత్తి చూపిన శైలి బాగుంది.తమ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యతలను మరవడం, ఆడపడుచుల ఆత్మనూన్యతను గుర్తించకపోవడం, సమస్యను సాధించే నేర్పరితనం లోపించడం వల్ల జరిగిన హృదయ విదారక సంఘటనలను కా.రా. క్లుప్తంగా తెలపడం అన్నింటికన్నా ఆసక్తికరం. ఏదేమైనా ఒకదాన్ని మించిన మరో కథనం ఆయన కథల్లో కనిపిస్తాయి. మాండలిక ప్రయోగాలతో ఒకదానికొకటి పోలిక లేకుండా కథలల్లడం ఆషామాషీ కాదు.

కా. రా. కథలు పాఠకుల హృదిలో పదిలమై ఉంటాయనడంలో అనుమానం లేదు. అద్భుతమైన కథలను అందించిన కా.రా. రచనాశైలికి అభివందనం.

- పురం మంగ, 8106248082

## వర్గ సంఘర్షణ- కారా కథలు

తెలుగు కథాసాహిత్యంలో ఈ శతాబ్దపు గొప్ప రచయిత కాళీపట్నం రామారావు. కారా మాస్టారు రాసిన అదృశ్యం, ఆదివారం, చావు మొదలయిన కథల్లో అట్టడుగు వర్గాలు, శ్రామికజీవుల కార్మికవర్గాల సంఘర్షణలు, త్యాగం, మానవీయ విలువలు, స్త్రీల దీనపరిస్థితి, సాహసం, సమయస్ఫూర్తి కనబడతాయి. ఉత్తరాంధ్ర మాండలికం, సంస్కృతి మనసుకు హత్తుకుంటుంది. 'చావు' కథలో రైతులు, వరికోతలు, సంక్రాంతి పండుగ కోలాహలం కళ్ళకు కట్టినట్టు గా కనిపిస్తుంది. ధనికవర్గం సాగించిన దోపిడీ కథాంతంలో నిరోధిస్తారు. అట్టడుగువర్గాల్లో స్త్రీ పాత్రలకూ వీరికి తంటాలు, శ్రామిక మానసికహింసలు పైకి తెస్తారు. కథాకథనం ఆసక్తి కరంగా ఉంటుంది. ముసలమ్మ,నారెమ్మ బతుకులు కన్నీటితో తడుస్తాయి.

'ఆదివారం' కథలో పాచి పనులు చేస్తూ అంట్లుతోమే పాత్ర ద్వారా శ్రామిక, కార్మిక మహిళా చైతన్యాన్ని ప్రదర్శిస్తారు. ఆమెలో హక్కులు, బాధ్యతలు, ఆధునికత, ఖచ్చితత్వం, పనిలో అంకితభావం, పరిశుభ్రత స్పష్టంగా చూపిస్తారు. కూలీలప్రాధాన్యత, ఇతరులతో పోలిక అత్తపాత్రలో రాజీమార్గం చూపిస్తూ,కోడలు పరిశీలన, ప్రేక్షక, రాయబారి పాత్రను విశ్లేషిస్తారు. కార్మికులకు ఆదివారం సెలవు తప్పదని, డబ్బులకన్నామాట ముఖ్యమని అంటారు. రెండు రూపాయలు అదనంగా తీసుకోవటానికి నిరాకరించటం ద్వారా దీన్ని నిరూపిస్తారు.

'అదృశ్యం' కథలో లలిత, అనూరాధ పాత్రలద్వారా విద్యావంతులకు, సామాన్య మహిళలకు ఉండే భేదాలను చూపిస్తారు. వివిధ మనస్తత్వాలను ఈ కథలో ప్రదర్శిస్తారు. అమలిన శృంగారం, మానసిక వ్యభిచారంపై చర్చపెడతారు. రాయప్రోలు, చలం రచనలు గుర్తు చేస్తారు. అదే అబ్బాయితో లలిత పెళ్ళి కుదుర్చాలనుకోవటంతో మానసిక సంఘర్షణ పాఠకులకే వదిలివేస్తారు.

-మాడుగుల నారాయణమూర్తి, 9441139106

## 'అదృశ్యం' కథ- ఒక పరిశీలన

బడుగు జీవుల బాధలు, మధ్య తరగతి త్రిశంకు స్వర్గం వంటి బతుకులను చిత్రించడంలో సవ్యసాచి అయిన కాళీపట్నం రామారావు రాసిన కథ 'అదృశ్యం'. కథాంశం కొన్ని దశాబ్దాల క్రితం నాటిదైనా ఇప్పటికీ చర్చించదగ్గదిగా ఉంది. సామాన్యురాలైన అమ్మాయి లలిత తనకు వచ్చిన లక్షణమైన పెళ్లి సంబంధం తిరస్కరించడం కథారంభం. దానికి మరికొన్ని పూర్వాపరాలు జోడించి, రసవత్తరంగా నడిపించే కథ 'అదృశ్యం'. దృశ్యమానంగా కళ్ల ముందే కథ కదలాడుతూ ఉత్కంఠ రేకెత్తిస్తుంది. నిజానికి లలిత కుటుంబ స్థాయికి ఆ పెళ్లికొడుకుని కళ్లకద్దుకుని వివాహనీ చేసుకోవచ్చు. కానీ లలిత తిరస్కారానికి బలమైన కారణాన్ని, అది జరిగిన తీరును మనలో మనమే చర్చ జరిపేలా కథలో అనూరాధ, లలిత పాత్రల మధ్య చర్చ ఆసక్తికరంగా, చాలా సహజంగా రాశారు కారా మాస్టారు.

అక్కయ్యతో విశాఖ వెళ్లిన లలిత పట్టణ నాగరికతకి, ఆహార విహారాలకి విసుగు చెందుతుంది. ఆ నేపథ్యంలో పొరుగున ఉన్న వివాహిత అనూరాధతో త్వరిత స్నేహం ఏర్పడుతుంది. అనుకోని సంఘటనతో ఆ స్నేహం చెడిపోతుంది. విలువలు, వ్యక్తిస్వేచ్ఛ, నీతి వర్తన మానసికంగా కూడా ఉండాలన్న లలిత దృఢమైన భావన కథను బిగి సడలకుండా నడిపిస్తుంది. నేస్తాన్ని ఉలిక్కి పడేలా చేయాలని హఠాత్తుగా అనురాధ గదిలోకి వెళ్లిన లలితకు ఎదురింటి కిటికీలో నుండి యువకుడు, అనూరాధ సైగలు చేసుకోవడంతో ఆమె మనసులో వ్యతిరేకభావనలు ఏర్పడతాయి. మిత్రురాలితో జరిగిన చర్చలో లలిత కంటే విద్యావంతురాలైన అనూరాధ తన ప్రవర్తనను సమర్థించుకుంటుంది. అతని మీద తనకు మోహభావన లేదని, తనతో మాటల వల్ల ఒకరికి సంతోషమైతే అది సమాజసేవ కిందే లెక్క అన్నట్టు మాట్లాడుతుంది. లలితకు గతం లో జరిగిన పెళ్లి చూపులు గురించి, ఆమె కలల గురించి ప్రశ్నించి ఎదురుదాడి చేస్తుంది.

ఈ కథ మానవ సహజమైన భావాలను ఎత్తి చూపుతుంది. ఎక్కడా విషయం పక్కకు పోకుండా కథ నడిచింది. లలిత రాజీ పడని తత్వం, నీతికి రెండు నాలుకల ధోరణి ఉండరాదు అనే భావన, కిటికీలోని యువకుడే తనను చూడవచ్చిన పెళ్లికొడుకు అని గుర్తించి తిరస్కరించిన తీరు చాలా సమర్థనీయంగా రాశారు కా. రా. ఈ పరిస్థితి నేటికీ సమాజం లో కొనసాగుతూనే ఉంది. నీతులు, శీలం శారీరకమే కాదు మానసికనీ గా కూడా పద్ధతిగా ఉండాలనే లలిత తన భావనను మార్చుకోలేకపోవడం బాగుంది. ఈ కథకు 'అదృశ్యం' అనే పేరు కూడా చక్కగా సరిపోయింది.

- ఎం. వి. ఉమాదేవి, 7842368534

## కాళీపట్నం కథా తత్వం

తొంభై ఏడేళ్ళ జీవితంలో మరొక కథా రచయితైతే పుంఖానుపుంఖాలుగా కథలు రాసేసేవారు. కానీ అలా ఆయన రాయలేదు కాబట్టే కథా మాష్టారు అయ్యారు. మార్క్స్ మౌలిక సిద్ధాంతాలు ఆయన కథల్లో పూలదండలో దారంలా దర్శనమిస్తాయి. ఆ సిద్ధాంతాల్ని కథా శిల్పం చెడిపోకుండా సమ్మిళితం చేయడం ఆయనకే సాధ్యం.

కథలు రాయడం ఆపేసిన ఎంతో కాలం తరువాత 1992లో (ఆయనకు అప్పుడు అరవై ఆరేళ్ళు) బహుశా శాయి గారి ప్రోద్బలంతో 'సంకల్పం' కథ రాశారు. రామ భద్రయ్య డెబ్బై ఎనిమిదేళ్ళ వయసులో చనిపోతాడు. బతికుండగా మూడు సార్లు కాశీ వెళ్ళాలనుకున్నా ఏవో కారణాల వలన కుదరదు. ఈ విషయం కుటుంబంలో అందరికీ శ్రాద్ధకర్మలు చేయడానికి వచ్చిన బ్రాహ్మణుడికీ తెలుసు. చివరి కొడుకు తల్లీ యితరులతో కాశీ వెళ్ళి గంగానదిలో అస్థికల నిమజ్జనం చేయడంతో కథ ముగుస్తుంది.

చాలా మంది కథ పైపైన చదివి కారా అవసాన దశ కథగా తేల్చేశారు. కానీ ఈ కథని ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా చదివితే చనిపోయిన తరువాత కూడా ఆర్థిక సంబంధాలు అనివార్యమన్న రచయిత భావన తెలుస్తుంది. వాటితో బంధం తెంచుకోవడమే పరోక్షంగా జీవిని వైతరిణి దాటించడమని తెలిసి వస్తుంది. ఆర్థిక సంబంధాలు మానవ జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తాయో ఈ కథలో నిరూపించారు. చివరి వరకూ కారా మేష్టారుకి మార్క్స్ సిద్ధాంతాలపట్ల నమ్మకం సడలిపోలేదనడానికి ఇది ఒక ఉదాహరణ.

- ఆర్.ఎస్. వెంకటేశ్వరన్, 7982450256

## కథాయాజ్ఞికుడు

కాళీపట్నం రామారావు మొదట చిన్న కథలతో కథారచన ప్రారంభించారు. క్రమక్రమంగా మధ్యతరగతి నుండి సామాజిక ప్రగతి శీల అభ్యుదయ కర విప్లవ దృక్పథం వైపు పయనించారు. 'యజ్ఞం' కథ ఆయనకు విశేష కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టింది. శ్రీకాకుళ పోరాట నేపథ్యంలో విరసం వ్యవస్థాపకులలో ఒకరిగా ఆయన పనిచేశారు. 'యజ్ఞం' కథ ఆ కాలంలోనే యువ దీపావళి ప్రత్యేక సంచికలో వచ్చింది.

శ్రీరాములు నాయుడు ఊరిపెద్ద. గాంధేయవాది. ఊరికి ఉన్నత పాఠశాల,రోడ్డు, కార్యాలయాలు రావడానికి కృషి చేశాడు. ఆ ఊళ్ళో సావుకారికి దళితుడైన అప్పల్నాయుడు రెండు వేలరూపాయలు బాకీ పడ్డాడని వడ్డీతో కలిసి రెండు వేలైదువందలు అయిందని దాదాపు ఖరారు. దీని నేపథ్యంలోనే కథంతా నడుస్తుంది. ఈ అప్పల్నాయుడు పంచాయతీ మెంబరు కూడా. అప్పుకింద తేలిన పైకానికి బదులుగా అప్పల్నాయుడు భూమి సావుకారికి బదలాయింపు జరగాలనే ఎక్కువ మంది పెద్దల అభిప్రాయం. అయితే కొంత కాలంగా ధర్మమూర్తిగా పేరుపడ్డ శ్రీరాములునాయుడు ఏం తీర్పు చెబుతాడో ఉత్కంఠ. సంభాషణలన్నీ వారి వారి నేపథ్యాల్లో ఉంటాయి. అప్పల్నాయుడు సంభాషణలు ఒప్పుకోనట్లూ తిరస్కరించనట్లూ ఉంటాయి. చివరకు నర్మగర్భంగా శ్రీరాములు నాయుడు పలికిన మాటలకు అప్పల్నాయుడు సమాధానం చెప్తాడు. తన యింట్లో జరిగిన ఘర్షణ దాదాపు రెండు మూడు తరాల క్రింద సమాన స్థాయిలో ఉన్న తమ కుటుంబాలు ఎందుకు కూలీ బ్రతుకులు గా మారాయో అత్యంత సహజసిద్ధంగా, నిజాలతో సహా వెల్లడిస్తాడు. ఇందులో సామాజిక, చారిత్రిక, ఆర్థిక, ఆధిపత్య విశ్లేషణ చాలా సహజంగా ఉంది. తాను ఆడినమాట తప్పకుండా దస్తావేజుపై వేలిముద్ర వేస్తే తనను చంపుతానని కొడుకు హెచ్చరించిన విషయం చెప్తూ విధిలేని పరిస్థితుల్లో వేలిముద్ర వేస్తాడు. అప్పుడాతని మనమడు ఉరికి పోయి ఆ యజ్ఞానికి హృదయం ద్రవించే ముగింపునిస్తాడు. ఆ ముగింపు కథ చదివి తెలుసు కోవాల్సిందే.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పైకంతో పాటు విరాళాలు సేకరించి నిబద్ధులైన శిష్య గణంతో 'కథానిలయం' స్థాపించి దాదాపు ఒక లక్ష తెలుగు కథలను కా. రా. సేకరించారు. ఇది ఒక ప్రపంచ రికార్డు. దీనిపై బీబీసి ఒక వీడియో ప్రసారం చేసింది. ఈ కథానిలయం భావి తరాల కథా పరిశోధకులకు ఎంతో ఉపయోగపడుతుంది.

-కాసర్ల రంగారావు, 9866837741

## నిజ జీవిత సంఘర్షణకు కథారూపం

కారా మాస్టారుగా ప్రసిద్ధి పొందిన కాళీపట్నం రామారావు 1924 నవంబరు 9 శ్రీకాకుళంలో జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఆయన ప్రవృత్తిరీత్యా రచయిత, కథకుడు, విమర్శకుడు. ఆయన రచనాశైలి సరళంగా ఉంటుంది. సామాన్య పరిజ్ఞానం ఉన్న పాఠకులు సైతం తన రచనలో లీనమయ్యేలా, భావప్రాధాన్యత కలిగి ఉంటాయి.తన నిజజీవితంలో అనుభవించిన, పరిశీలించిన కష్టాలకు, సంఘర్షణలకు ఆయన కథారూపం ఇచ్చాడు. సమాజంలో అట్టడుగు వర్గాల జీవన సమరాన్ని సునిశితంగా పరిశీలించి తన పాత్రలలో చూపారు. ఆయన రాసిన 'యజ్ఞం' కథ తెలుగు పాఠకుల విశేష మన్ననలను పొందింది. ఇందులో దోపిడీ స్వరూప స్వభావాలను స్పష్టంగా, సరళంగా, సహజంగా, శాస్త్రీయంగా చిత్రీకరించారు.

శ్రీకాకుళంలో 1997 ఫిబ్రవరి 22న కా. రా. కథానిలయాన్ని స్థాపించారు. తెలుగులో వచ్చిన ప్రతి కథనీ ఈ గ్రంథాలయంలో భద్రపరచాలన్న సత్సంకల్పంతో కథానిలయం స్థాపితమైంది. భావి తరాలకు ఉపయోగపడేలా కథానిలయాన్ని స్థాపించిన కా. రా. ధన్యులు.

-మంజుల, 8073638776

## చదివి తీరవలసిన కథ 'ఆదివారం'

సున్నితమైన హాస్యాన్ని అందిస్తూ పనిమనిషితో పాట్లను, ఆదివారం ఇంటి యజమానురాలి చిత్తాన్ని చిత్రించిన 'ఆదివారం' కథ నన్ను బాగా ఆకట్టుకుంది. అత్తగారి దబాయింపులో, పనిమనిషి అంకాలు పాత్రల సంభాషణల్లో నేటివాస్తవికత తొంగిచూస్తోంది. ఆ రెండు పాత్రలు లోలోపల అభిమానం, ఆప్యాయత ఉన్నా మాటల ఈటెలు విసురుతూ, పాఠకుని సస్పెన్స్ లో పెడతాయి. ఆదివారం అంకాలు వస్తుందా రాదా అనే సందేహం పాఠకులకూ కలుగుతుంది.

అత్తగారు నేటిమధ్యతరగతి ఇల్లాలు. కోడలిని ఆదరించే అత్త. అంకాలుతో సంధిచేసుకునే ప్రయత్నం ఆమెది. అంకాలు నీతి, నిజాయితీ, ఆత్మాభిమానం ఉన్న పడుచు. ఎనిమిది రూపాయల జీతం చాలని, ఆదివారం పని చేయనని, సెలవు కావాలని నిక్కచ్చిగా చెప్తుంది. ఇలా కుండబద్దలు కొట్టేలా మాట్లాడే వ్యక్తిని నమ్మవచ్చు. తీయనికబుర్లు చెప్పి మాట తప్పేవారి కన్నా వీరుమిన్న.

ఈ కథలో పద విన్యాసలాస్యం అద్భుతం! హాళ్ళు హాళ్ళు...అత్తరిబొబ్బా అల్లరి బొల్లా..బలబలతెల్లారితే...లజ్జగుజ్జులు.. మొదలైనవి అర్థంతెలీకున్నాఅలరిస్తాయి. పార్లమెంట్ హౌస్ లోకంకరసభ్యురాలు గక్కురుమనటం..మాండలిక పదాలు కాబోలు. నాకు చాలా చాలా నచ్చిన వాస్తవికతకు అద్దం పట్టిన కథ ఇది. సర్వకాల సర్వావస్థలకు ప్రతీక. పనిమనిషి ఇప్పుడు సెల్ లో రాను అని చెప్పే రోజులు. అంకాలు ఆదివారం ఏంచేయబోతోంది? ఉత్కంఠ?! బుగతమ్మ అత్తగారి పరువు నిలబెడుతుందా!? చక్కని చిక్కని సస్పెన్స్! తప్పకుండా చదివి తీరవలసిన కథ ఇది.

-ఎ.రాజ్యశ్రీ, 8985035283

## అప్పుడే కదా !

ఒళ్ళును
విల్లులావంచి
అభివృద్ధి ఫలాలను రాల్చినా
శ్రామికుల నోటికందే ఫలమెప్పుడూ
అందని ద్రాక్షే.

చెమట చుక్కలతో సేద్యం చేసి
సమాజానికి తిండిపెట్టినా
వారి జీవితమెప్పుడూ
కష్టాల కడలిలో ఈదులాటే.

యంత్రపు ఇనప్పాదాలకింద
నలిగీ నలిగీ వాళ్ళదేహాలు
అభివృద్ధి దీపానికి చమురౌతున్నా
వారి బతుకిప్పటికీ
కొడిగట్టిన దీపమే.

కర్షకధీరుల ఉద్ధరణకు
ఎన్ని ప్రభుత్వాలు మారినా
ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా
శ్రామికుల బతుకు పతాకమెప్పుడూ
పెట్టుబడిదారుల పాదాలకిందే.

కన్నీటి సంద్రంలో
ఆశల పడవనెక్కి
బతుకుతీరం చేరదామన్నా
అడుగడుగునా అవమానాల రాళ్లు
బతుకు పడవకెప్పుడూ
గండికొడుతునేవున్నాయ్.

బతుకు బండిని నడిపే
కర్షకులను మరచి
పురోగతికి కారణమయ్యే
కార్మికులను మరచి
ఎన్ని అంతరిక్ష యాత్రలు చేస్తేనేం
ఎంత సాంకేతిక విప్లవం సాధిస్తేనేం
అవన్నీ కృతఘ్నుతా చిహ్నాలే కదా!

తాము నీరుపోసి పెంచిన
అభివృద్ధి ఫలాలకు తామే కర్తలైనప్పుడు
కన్నీళ్ళ వ్యధలుబాసి
కడుపునిండా తిన్నప్పుడు
కలలతీరం చేరి
కంటినిండా నిద్దరోయినప్పుడు
వారి చెమట చుక్కలు
పెట్టుబడిదారీ తులాదండాలకు
సరిగ్గా తూగినప్పుడు
అప్పుడే కదా !
అభివృద్ధికొక నూతన నిర్వచనం

-ఎన్.నరేశ్ చారి
9701334516

## విజ్ఞానపు కాగడా అక్షరం

జీవితాన్ని మలుపు తిప్పేది
లోకం గతిని మార్చేది
జనాన్ని జాగృతం చేసేది
నరుడి నాగరికతను
చరిత్ర పుటల్లోకి ఒంపేది
అన్యాయపు కొండలను పిండిచేసి
కాఠిన్యంపై కత్తులు దూసేది అక్షరం.
ఉద్యమాలకు ఊటచెలిమై
నిరసనలకు నిప్పుల కొలిమై
అగ్గిని రాజేసేది అక్షరం
హాలికుల,శ్రామికుల కన్నీళ్ళతో ఎరుపెక్కి
కొడవలెత్తేది, బరిగీసేది అక్షరం.
జ్ఞాన సముద్రాలను చిలికి
రహస్యాలను రట్టుచేసి
విజయజెండాఎగరేసేది అక్షరం
మూఢ ఇనుపతెరపై ముప్పేట దాడిచేసి
ధైర్యపు ఇటుకలను పేర్చేది అక్షరం.
అక్షరం ఒక ఫిరంగి
అక్షరం ఒక ఆయుధం
అక్షరం ఒక మిసైల్
అక్షరం ఒక చైతన్య కిరణం.
మదిలోని భావాలకు దర్పణం
మానవ వికాసానికి దిక్సూచీ
మానవ గమనానికి వేగుచుక్క
అజ్ఞానపు చిమ్మచీకట్లను తొలగించే
విజ్ఞానపు కాగడా అక్షరం .

-తాటిపాముల రమేష్
7981566031

## భారత పౌరులు

పచ్చ,పచ్చని మొలకల్లారా
చిట పట కురిసే చినుకుల్లారా.
చెంగు చెంగున ఎగిరే జింకల్లారా
టప టప ఎగిరే పక్షుల్లారా.
కిల కిల మను నవ్వుల్లారా
రంగు రంగులా పువ్వుల్లారా.
గల గలమను మువ్వల్లారా
ఏమి ఎరుగని పిల్లల్లారా.
ముత్యాల్లా పెరగండి
వజ్రాల్లా మెరవండి.
చదువులలో ఎదగండి
రేపటి 'ఉజ్వల ' భారత్ కోసం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## రాకాసి అల..

శరద్రుతువు రాత్రుల్లో
వెండివెన్నెల పర్చుకుని
లోకం శాంతిగీతమాలపిస్తున్న
ప్రశాంత పరిస్థితుల్లో
పుడమితల్లి చల్లని ఒడిలో
సేదదీరుతున్న అంబుధికి
అశాంతిగీతానికి నిద్రపట్టక
ఏమి తోచక శ్వాసాడక
అచేతనంగా మూలుగుతుంది..
ప్రశాంతంగా ఉన్న కడలిలో
ఓ చిన్న కుదుపు
ఆటుపోటుల విన్యాసాలతో
సంతోషకేళిలో మునిగిఉన్న
అలల కలలపై ఓ రాకాసి అల
విరుచుకుపడి విలయతాండవం చేస్తుంది..
సముద్ర గర్భం మధ్యలో జనించి
తీరాన్ని ముద్దాడాలనే
అలల సహజమైన కలల్ని
విచ్ఛిన్నం చేస్తూ
వాటిని మధ్యలోనే తుంచేసి
సంద్రం హృదయానికి
మానని రంధ్రం చేస్తూ
తనకు పుత్రశోకం మిగులుస్తుంది..
అది బినామియైనా,
సునామియైనా అలల
జీవితాల్ని బద్నాం చేస్తూ
నామరూపాల్లేకుండా చేయ
ప్రయత్నిస్తుంది
దానిదెబ్బకు కొన్ని అలలు
నడిసంద్రంలోనే నడ్డివిరిగి
ఒడ్డునపడలేక ఊపిరాడక
మధ్యలోనే మునకలేస్తే,
సముద్రపు ఒడ్డున చేరిన మిగిలిన
అలలు తమ కలల్ని ఏరుకుని
అందర్నీ చైతన్యపరిచి రాకాసి అలను
పట్టి బంధించే ఆత్మవిశ్వాసపు వలను
రూపొందించే ప్రయోగంలో
తలమునకలయ్యాయి..
కడలి ప్రశాంతతను తిరిగి
సొంతం చేసుకుంటుందా...?
కలల అలలు సాకారమౌతాయో..?
నిర్జీవరాకాసి అలల ఆశల వలలో
బందీ అవుతుందో..? లేదో..?
ఇక కాలమేసే వలనే నిర్ణయించాలి..?

-సర్ఫరాజ్ అన్వర్, 9440981198

# పర్యావరణ పునరుద్ధరణ తక్షణ కర్తవ్యం

ఈ అనంత విశ్వంలో భూగ్రహం మాత్రమే జీవి మనుగడకు అనుకూలంగా ఉంది. వివిధ వృక్ష జంతుజాలంతో జీవవైవిధ్యం కలిగిన భూమి చక్కని పర్యావరణంతో కూడిఉన్నది. అడవులు, సముద్రాలు, నదులు, పర్వతాలు, హిమపాతలు, వాతావరణం, ఋతువులు, వర్షాలు, అసంఖ్యాక జీవరాశి, అద్భుతమైన ప్రకృతి, అమూల్యమైన వనరులు చక్కని పర్యావరణం ఈ భూమిని ప్రత్యేకంగా నిలబెట్టాయి. అలాంటి పర్యావరణాన్ని మనం నిరంతరం కాపాడుకోవాలి.

**"ప్రకృతిని ప్రేమించడం, దానితో మమేకమై జీవించడం ద్వారానే మనిషి మనుగడ సవ్యంగా సాగుతుంది"**

ప్రకృతిని ప్రేమించడం, దానితో మమేకమై జీవించడం ద్వారానే మనిషి మనుగడ సవ్యంగా సాగుతుంది. మానవుడు తన మేధోసంపత్తి ద్వారా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని అభివృద్ధి పేరుతో ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతీశాడు. పరిశ్రమలు, వాహనాలు వెదజల్లే కాలుష్యం, విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు పీల్చేగాలి, త్రాగేనీరు, తినేఆహారం, నివసించే భూమి..... ఇలా అన్నిటినీ కలుషితం చేస్తున్నాడు. మానవుడు అతివేగంగా అభివృద్ధి చెందుతున్నాడు. అంతేవేగంగా ప్రకృతిని నాశనం చేసి తన ఉనికికే పెనుప్రమాదం కొనితెచ్చుకుంటున్నాడు. అభివృద్ధి పర్యావరణ అనుకూలంగా ఉండాలికానీ అభివృద్ధిమాటున మానవమనుగడ ప్రశ్నార్థకంగా మారేలా చేయకూడదు. మానవమనుగడకు గాలి, నీరు, నింగి, నిప్పు, నేల పంచభూతాలు ఆవశ్యకం. వీటిలో ఏ ఒక్కటి లోపించిన జీవనం అస్తవ్యస్తం ఔతుంది. భూమిపై ఉన్న వనరులను పరిమితంగా వినియోగిస్తేనే రాబోయేతరాలు ఊహించని విపత్తులు గురికాకుండా ఉండే పరిస్థితులు కల్పించిన వారవుతాము.

అభివృద్ధి పేరుతో అనాలోచిత మానవ చర్యలవల్ల పర్యావరణం కలుషితం అవుతునే ఉంది. ప్రకృతి విరుద్ధంగా చేస్తున్న చర్యలవల్ల భూమి వేడెక్కుతుంది. ఇంధనాల విచ్చలవిడి వాడకం వల్ల వాయుకాలుష్యము పెరుగుతుంది. పరిశ్రమలు, పట్టణాల నుండి వెలువడుతున్న వ్యర్థాలు పర్యావరణ కాలుష్యాన్ని పెంచుతున్నాయి. వ్యవసాయంలో హానికరమైన ఫెర్టిలైజర్స్ విరివిగా వాడటం వల్ల అవి నేలను, నీటిని కలుషితం చేస్తున్నాయి. పంటలలో ఫెర్టిలైజర్స్ బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలి. అంతేకాకుండా అందుబాటులో ఉన్న నీటిలో 70% నీటిని వ్యవసాయం కోసం వాడుతున్నాం. తక్కువగా నీటిని వాడుకునే పద్ధతులను అవలంభించాలి. క్లోరోఫ్లోరో కార్బన్ వాయువులు వెలువరించి వాతావరణంలో మార్పులకు, ఓజోన్ పొర దెబ్బతినడానికి కారణమవుతున్న పరికరాల వాడకం తగ్గించాలి. అదే సమయంలో పర్యావరణ అనుకూలమార్గాలు అవలంభించాలి. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వం మాత్రమే కాదు ప్రజల చేతుల్లోనే ఎక్కువగా ఉంది. తరిగిపోయే వాటినికాకుండా పునర్వినియోగించుకోగలిగే వనరుల వాడకం ఎక్కువ చేయాలి. కాలుష్యకారక వస్తువుల వాడకం తగ్గించాలి. సోలార్ విద్యుత్ వాడాలి. అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఇంధనాలతో నడిచే వాహనాలువాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలి. రీసైక్లింగ్ ద్వారా వ్యర్థ పదార్థాలనుండి కొత్తవి తయారుచేస్తూ వ్యర్థాలను తగ్గిస్తారు. ప్లాస్టిక్ 2-3 సార్లు మాత్రమే రీసైక్లింగ్ చెయ్యబడుతుంది. ప్లాస్టిక్ బయోడిగ్రేడబుల్ కాదు. కావున మనం వీలైనంతవరకు ప్లాస్టిక్ వాడకపోవడం ఉత్తమం.

ప్రభుత్వాలు కూడా పర్యావరణహిత ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడమేకాకుండా వాటిని అభివృద్ధిచేసే కార్యక్రమాలకు నిధులు వెచ్చించాలి.

నేడు వాతావరణ కాలుష్యం మనిషి ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది. రేడియో, టీ.వి, సెల్ టవర్ల నుండి విడుదలయ్యే రేడియో కిరణాలు మానవ పక్షి జంతువుల మనుగడను దెబ్బతీస్తున్నాయి. కొన్ని జీవజాతులు మన కళ్ళముందే అంతరించిపోతున్నాయి. వ్యర్థపదార్థాలు, ప్లాస్టిక్ నదులలో, సముద్రాలలో కలసి జలకాలుష్యం జరిగి అనేక జలచరాలు నశించిపోతున్నాయి. పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం వల్ల పంటలకు మేలుచేసే జీవులు నశించడం, నేలలో సారం కోల్పోయి వ్యవసాయ ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి, వాటిలో పోషకాలు శాతం తక్కువవుతుంది. అడవుల నరికివేత వల్ల వర్షాభావపరిస్థితులు ఏర్పడడం, అడవుల్లో నివశించే జంతువులు వాటి ఆవాసాలు కోల్పోయి మానవ ప్రపంచంలోకి వస్తున్నాయి. ఈ విధంగా జీవవైవిధ్యం కళతప్పుతుంది. "ప్రకృతికి చెందిన కార్యకలాపాలూ కొన్ని నియమాలననుసరించి సాగుతాయి. వాటిని అతిక్రమించజాలము. ప్రకృతి నియమాలను అతిక్రమిస్తే క్షణకాలంలోనే ఈ సృష్టి అంతమైపోతుంది..

తరువాత ఏమీ మిగలదని" హెచ్చరించిన స్వామివివేకానంద మాటలు మనం స్మరించుకుని ప్రకృతిని గౌరవించాలి.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 1972 నుండి జూన్ 5న నిర్వహిస్తున్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణం పట్ల అవగాహనకై ప్రతీసంవత్సరం ఒక థీమ్ ఉంటుంది. 2021 సంవత్సరం థీమ్ "పర్యావరణ వ్యవస్థ పునరుద్దరణ". పర్యావరణ వ్యవస్థ పునరుద్దరణలో భాగంగా చెట్లను పెంచడం, నగరాలను పచ్చదనం చేయడం, తోటలను పునర్నిర్మించడం, ఆహార పంటలు మార్చడం, నదులు, నదీతీరాలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలను చేయాలని పిలుపునిచ్చింది. ఇప్పుడు కరోనా మహమ్మరి కానీ, అనేకచోట్ల సంభవిస్తున్న ప్రకృతి విపత్తులు కానీ, కరుగుతున్న హిమనీనదాలు కానీ, సునామీలు ఇవన్నీ మనకు ప్రకృతి పంపిస్తున్న హెచ్చరికలు.

ప్రతిఏటా ప్రపంచ పర్యావరణ దినోత్సవం దగ్గరకురాగానే పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, హరితచట్టాలు, వివిధ ప్రోటోకాల్ ఒప్పందాలు తెరపైకి వస్తాయి. వాటిని పాటించాలని మరింత కఠినతరం చేయాలని వాదనలు వస్తుంటాయి. చట్టాలు ముఖ్యమే కానీ పర్యావరణాన్ని పరిరక్షించడానికి చట్టాలు మాత్రమే సరిపోవు. స్వీడన్ కి చెందిన గ్రేట థన్ బర్గ్ ప్రపంచ దేశాలను ఘాటుగా ప్రశ్నించింది. మా తరాలకు మరియు రాబోయే తరాలకు వనరులు అందకుండా వాటిని వాడుకునే హక్కు మీకెవరిచ్చారని అగ్రదేశాలను ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా కాలుష్యాన్ని ఎక్కువగా వెదజల్లే అభివృద్ధిచెందిన దేశాలను నివ్వెరపోయేలా నిలదీసింది. పర్యావరణ ప్రేమికులు, ప్రపంచవ్యాప్తంగా ఆమెకు సంపూర్ణ మద్దతు అందించి, ఆమె డిమాండ్ సరైందని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా తక్షణమే కార్యాచరణ ప్రణాళిక ప్రకటించి పర్యావరణాన్ని పునరుద్ధరణకు పిలుపునిచ్చారు . ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు అనేక మంది, సంస్థలు పాటుపడుతున్నారు. మరీముఖ్యంగా అభివృద్ధి పేరుతో అ పరిశ్రమలు ఏర్పాటుచేసి వాటినుంచి వెలువడే ఉద్గారాలవల్ల పర్యావరణాన్ని కలుషితంచేసిన అగ్రదేశాలు ఇప్పటి పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారకులు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచ దేశాలు కొన్ని ప్రోటోకాల్ ఒప్పందాలు చేసుకున్నాయి. అందులో ముఖ్యంగా స్టాక్ హోం డిక్లరేషన్ 1972, నైరోబి డిక్లరేషన్ 1982, వియన్నా కన్వెన్షన్ 1985, మాంట్రియల్ ప్రోటోకాల్ 1987, ధరిత్రి సదస్సు 1992(రియో డీ జనిరో), క్యోటో ప్రోటో కాల్ 1997, పారిస్ ఒప్పందం 2015 లు ముఖ్యమైనవి. ఈ ఒప్పందంలో దేశాలు సంతకాలు చేసినా మార్గద ర్శకాలు పాటించిన సంగతి తూతూ మంత్రమే. ఇటీవలకాలంలో అమెరికా పారిస్ ఒప్పందం నుంచి వైదొలగడం మళ్ళీ జో బైడెన్ అధ్యక్షుడు అయ్యాక తిరిగిచేరడం శుభపరిణామం. అన్ని దేశాలు ఒప్పందాలను గౌరవిస్తూ వాటికి కట్టుబడి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి. ఒకరిపై ఒకరు విమర్శలు మాని ప్రకృతిని ప్రకృతిలాగే చూస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని మనం చేసిన విధ్వంసం వల్ల రాబోయేయేకాలంలో విపత్తుల బారినుంచి మానవాళిని కాపాడుకోవాలంటే ప్రతీఒక్కరూ పర్యావరణపరిరక్షణకు తప్పనిసరిగా పాటుపడాల్సిన ఆవశ్యకత నెలకొంది. ఇది పర్యావరణ సంస్థలు, పర్యావరణ ప్రేమికులు మాత్రమే కాదు ప్రకృతిలో భాగమైన ప్రతిఒక్కరి బాధ్యత. పర్యావరణ విద్య అనేది నామమాత్ర పరీక్షల కోసం రూపొందించిన పాఠ్యప్రణాళికగా నేటితరం భావిస్తున్నారు. కాబట్టి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను బలంగా నేర్పించాలి.

మనదేశంలో పర్యావరణ పరిరక్షణకు గ్రామస్థాయిలో 1970లలోనే ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. జీవితాంతం పర్యావరణ పరిరక్షణకు పోరాటం చేసినటువంటి సుందర్ లాల్ బహుగుణ గారు ఇటీవలే మరణించారు. చెట్ల నరికివేత వలన హిమాలయాలు జీవవైవిధ్యం కోల్పోతాయని చెట్లను కౌగిలించుకునే చిప్కో ఉద్యమం చేశారు. వారి ఉద్యమస్ఫూర్తితో మనమంతా పర్యావరణాన్ని కాపాడాలి. రాబోయేతరాలకు ప్రకృతి వనరులను అందించాల్సిన బాధ్యత అందరిదీ. పర్యావరణ పరిరక్షణ భారతీయ జీవనవిధానంలో నిత్యం మనతో మమేకమై ఉంది. చెట్లు, నదులు, పర్వతాలు, ప్రకృతి వీటన్నిటినీ ఎల్లప్పుడూ పూజిస్తూనే ఉన్నాం. ప్రకృతిని పవిత్రంగా భావించి ఆరాధించే గొప్పసంప్రదాయం మనది.

**ఓం ద్యయః శాంతిః అంతరిక్షం శాంతిః**
**పృథ్వి శాంతిః రాపా శాంతిః రోషదాయ శాంతిః**
**వానప్రస్తాయ శాంతిః శాంతిర్విశ్వేదేవాః శాంతిః బ్రహ్మం శాంతిః**
**సర్వం శాంతిః...** అనగా వాయువులో గాలి వెల్లివిరియాలి. గగనంలో శాంతి ప్రభవించాలి. భూమిమీద శాంతి వ్యాపించాలి. నీరు,వనమూలికలు,మందులు, మొక్కలు, వృక్షాలు శాంతంగా ఉండాలి. ప్రపంచమంతా శాంతి పల్లవించాలి. దేవతలందరిలో శాంతి వెల్లివిరియాలని ఈ శ్లోకం అర్థం. వేదాలు అందించిన ఈ మంత్రం విశ్వవ్యాప్తంగా శాంతి వెల్లివిరియడానికిగాను పఠించాలి. యజ్ఞయాగాదులు సైతం దీన్ని పాటించకుండా సంపూర్ణత పొందేవికావు.

మన సంప్రదాయాలకు గౌరవమిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి. వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. చెట్లను మనం రక్షిస్తే చెట్లు మనల్ని రక్షిస్తాయి. కరోనా రోగులు ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోతున్న వేళ బీహార్ ప్రభుత్వం శుభ్రమైన తాజా ఆక్సిజన్ అందించే ఇండోర్ ప్లాంట్స్ అయిన స్నేక్ ప్లాంట్, రబ్బర్ ప్లాంట్, ఎరికాపామ్ వంటివాటితో పాటు ఔషధ గుణాలుండే మొక్కలను సూచించింది. ఈ మేరకు "ప్రకృతి మిమ్మల్ని రక్షిస్తుంది" అనే నినాదంతో ఒక క్యాంపైయిన్ ప్రారంభించింది. చెట్లను పెంచడం వలన వానలు సమృద్ధిగా కురుస్తాయి. వానల వల్ల నీరు పుష్కలంగా ఉంటుంది. నీరు తగినంత ఉంటే పంటలు బాగా పండుతాయి. ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనావైరస్ మన మధ్య దూరం ఉండాలని చెబుతుందే తప్ప, పర్యావణాన్ని కాపాడుకునే దిశగా మనం వేసే అడుగులను అది ఆపలేదు.

ప్రస్తుత పరిస్థితి ఇలానే కొనసాగితే భూతాపం మరింత పెరిగి, 2100 కల్లా భూమిమీద మానవుడు బ్రతికే పరిస్థితి ఉండబోదని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. **"సుజాలాం, సుఫలాం, మలయజ శీతలాం, సస్యశ్యామలం మాతరం వందేమాతరం"** అంటూ నిత్యం నినదించే మనం ఆ గీతం అందించే స్ఫూర్తిని ప్రతి మదిలోనూ నింపుకుని మన నేలతల్లిని మనవే కాపాడుకునేందుకు సిద్ధం కావాలి. మన పూర్వీకులు అందించిన స్వచ్ఛమైన గాలి, నీరు, నేలను యథావిధిగా ముందుతరాలకు అందించడం తమ బాధ్యతగా ప్రతిఒక్కరూ గుర్తించాలి. ''పరిశుభ్రత, పచ్చదనంతో కూడిన ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతిఒక్కరు పునరంకితం కావాలని" మన ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు గారు ఆకాంక్షిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అనేది ఒక నినాదం కాకుండా మన జీవన విధానంగా చేసుకుని మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని పచ్చదనం వెల్లివిరేసేలా పునరుద్దరణ చేసుకుని భద్రమైన భవిష్యత్ ని నిర్మించుకుందాం.

-స్వేచ్ఛావి
8185062909

## స్వేద వచనం

శీతల గదులలో
సమాధి చేసే వాడి కంటే
నుదుటి ఆకాశంలో
నన్ను శ్రమ సూర్యుని చేసి జార్చే
వాడంటేనే నాకిష్టం.

వాడి కాళ్ళలో
గడియారపు ముల్లునై
తిరగడం నాకిష్టం.

వాడి కుటుంబ దీపంలో
నిత్యం ఆవిరౌతూ
వెలుగు పువ్వై విచ్చుకోవడం నాకిష్టం.

పెట్టుబడి దారుల
నియంతృత్వ కొలిమిలో
వాడి పోరాట ఆయుధంగా
కాలడం నాకిష్టం

అక్కరకు రాని చట్టాల మధ్య
దగా పడ్డ వాడి
రక్త మాంసాల యంత్రానికి
ఇంధనమై ఇగిరిపోవడం నాకిష్టం.

కోట్లు కొల్లగొట్టేయడం చేతగాని
వాడి కడుపు కొడితే
విప్లవ గళమై గర్జించడం నాకిష్టం.

పేదరికపు ఆల్చిప్పలో
వాడు దాచుకున్న
అపురూప ముత్యాన్ని నేను
పస్తులుంచినా భరిస్తాను గాని
వాడి కన్నీటిలో
కరిగి పోవడమంటేనే
నాకెంతో కష్టం

-నల్లు రమేష్
9989765095

## అగ్రజుడు!

ఎవరి జోలికి పోనివాడు
ఇంకెవరి ముందర జోలె పట్టనివాడు
ఒకరి కష్టం తిననివాడు
వాడు!మరొకరిని కష్టపెట్టనివాడు!!

ప్రతి అంగుళం నేలను
చెమటతో తడి చేస్తాడు
ప్రతికూల పరిస్థితులను
పట్టుదలతో తుడిచేస్తాడు
పంటపొలాలను
ప్రాణప్రదంగా పదిలపరుస్తాడు
పంటఫలాలను ప్రజలకందించి
ప్రాణభిక్ష పెడతాడు!
పగలంతా సూర్యునితో సహవాసం
రాత్రిరైతే చందమామతో పరిహాసం
ఆరుఋతువులూ ఆశ్రమం చెంతనే
ఆయలు ఛాయలు!ఆనందం రవంతనే!!.
బతకడానికి బుక్కెడు బువ్వ
కట్టడానికి మూరెడు బట్ట
వీటికోసమేనా వెంపర్లాట?
కానేకాదు!వాని దేవులాట!!.
వృత్తిధర్మం నిర్వర్తించే నిమిత్తం!
రైతుజన్మ సార్థకత వినిమయత్వం!
ప్రతిఫలాపేక్ష లేని పరోపకారం!
పంటచేను పరాయిపాలైతే
ప్రాణమే పరిత్యాగం!!
మానవ మనుగడ కోసం
నిరంతరం శ్రమించే కర్మవీరుడు!
పర్యావరణ సంరక్షణ సంకల్పం
చెప్పుకొనే పాండవ అగ్రజుడు!
మరుగుజ్జుల మధ్య మహాకాయుడు!
ప్రజాసంక్షేమార్థం
పునరుత్థానంచేందే ఫీనిక్స్ పక్షి!వాడు!



-కరిపె రాజ్ కుమార్
8125144729

## ఉషోదయం

పచ్చదనం, పరిశుభ్రతతో
అనురాగాలను పూయించిన ప్రకృతి
మనిషి తీరని దాహానికి బలియై
మనిషుల పాలిట మృత్యువై
కరోనా రూపంలో ప్రాణాలను
తృణప్రాయంగా మింగేస్తుంది.

గుస గుస లాడే పైరు పంటలు
కిలకిలలాడే పక్షుల శబ్దాలు
చల్లని మలయమారుతాలు
పిల్లలు అల్లరి చేష్టలు
బంధువుల ఇష్టాగోష్ఠితో
కళకళలాడిన జగతిలో
కరోనా కాలనాగై
విషం చిమ్ముతున్నది,

సంధికాలం పోయి
ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని
చేతులు చేతులు కలుపుకొని
చెట్టాపట్టాలు వేసుకుని
అందరూ కలిసి కులాసాగా
కబుర్లు ఆడే రోజుల కోసం
ఆసక్తిగా ఎదురుచూస్తున్నది లోకం..

కాలం మిగిల్చిన చేదు అనుభవాలు
అనుమానపు భయాలు
అభద్రతా భావాలు
సంధి కాలపు అయోమయాలు
నశించి మరలా మునుపటి
రోజులు త్వరగా రావాలి
సెలయేరు సవ్వడిలా..
ఉషోదయపు కిరణాల్లా..



-పిల్లి.హజరత్తయ్య
9848606573

## శ్రమైక జీవన సౌందర్య రాశి

యవ్వన ప్రాయం నుండి పెళ్లి చూపుల వరకు...
అద్దాల నాటి బిడ్డలకై పాడే జోల పాట నుండి...
గడ్డాలు వచ్చిన పిల్లల ప్రేమకై జోలి పట్టే వరకు....
పురిటి నొప్పుల నుండి పాలు పంచుకున్న
తొలి రేయి నుండి పాడెక్కి కట్టెగా మారే వరకు
అలుపెరుగని శ్రమ జీవి స్త్రీ....

గనుల్లో ఖనిజాల అన్వేషకుడు
కొలిమి దగ్గర కార్మికుడు
రక్షణనిలయం లో రక్షక భటుడు
దేవాలయం లో అర్చకుడు.

దవాఖానలో వైద్యుడు
రోడ్డుమీద రిక్షావాడు
మురికి కూపాలను
శుభ్రపరిచే సేవాతత్పరుడు..

ఆకాశంలో విమాన చోధకుడు..
దేశాన్ని ఏలే నాయకుడు
బడిలో విద్య నేర్పే గురువు
అక్షరాలు దిద్దే శిష్యుడు...
మమతల మాగాణిలో
అందరి కలలను పండించి
ఫలితమే ఆశించని నిరంతర
కర్షక మిత్ర స్త్రీ.....

కొత్త జీవికి జీవం పోసి
నిత్య వెనుకుండి వెన్నుతట్టి
ధైర్యం నింపే స్వేదపు చిరునవ్వుల
శ్రమైక చందనపు బొమ్మ స్త్రీ...

గుర్తింపు పొందక ఫలితాన్నే
ఆశించని ఆశాజ్యోతి స్త్రీ

నిరంతరం దోపిడి కి గురవుతూ
విరామమే ఎరుగని
ఉద్యోగ విరమణ కు అవకాశమే లేని
ఏకైక శ్రమ జీవి స్త్రీ.

నిన్ను తన హృదయానికి హత్తుకునీ
స్తన్యమిచ్చి నీకొక స్థాయి వచ్చే వరకు
సకల సపర్యలు చేసి నీ కడుపునింపి
నీ కండపుష్టి కై తన కడుపు మాడ్చుకుని
కాటికి చేరే వరకు కూలికి మానని
అసలైన శ్రామికులకు సిసలైన చిరునామా స్త్రీ...

మనసున్న ప్రతి మదిలో
స్త్రీ శ్రమకు గుర్తింపునిస్తూ...
శ్రమైక జీవన సౌందర్యాన్ని గౌరవిద్దాం....



-దుర్గా మహాలక్ష్మి ఓలేటి

## ఆదిత్య గమనం

నీలాకాశ సంద్రంలో అలజడి
పురిటి నొప్పుల సూచన
సింగిడి వర్ణాలతో కలకలం
తూర్పుదిశగా అరుణ వర్ణం
అందులో మెల్లగా పసుపు వన్నెతో
బంతిలా భానూదయం,
ప్రకృతికాంత ఒళ్ళు విరుపుతో
తనపై ఆధారపడ్డ సమస్త
జీవకోటికి మేల్కొలుపు,
పత్రి రావాల పరవశంతో
ప్రతి అణువులో చలనం,
దినకరుని వెచ్చటి కిరణాలతో
జనజీవన ప్రవంతి ఉల్లాసానికి,
అర్కుడి ఆగమనమే పచ్చజెండా,
అలా మార్తాండుడు మొదలు,
గ్రీష్మ మధ్యాహ్నవేళ
వేడి భగభగలతో తన
తడాఖా చూపిస్తాడు,
అది భరించలేక కొంతసేపు
ప్రకృతిలో జడత్వం
జీవజంతుజాలం నీడకై వెత్కులాట
కప్పుకిందికే జనం అంకితం
ఆదిత్య తాపానికి భూమిపై
నీరు ఆవిరై తిరిగి భూమిపై
వర్ష ధారగా జనుల సేదదీర్చు,
ఈ ఖచరుడు ఆదిలో ఉత్సాహం,
మధ్యలో అలసట,
మలిసంధ్యలో విశ్రాంతినిస్తూ
పడమటి అరుణిమలో
మరో అర్ధగోళానికి పయనమౌతూ,
తనకి మారుగా శశిని
ధరణి పంపు, వెన్నెల పంటకై !

-సంధ్య సుత్రావె,
9177615967

## అడివి

అడివి తల్లినీ చూడరమ్మా. ..ఆc?
అడివి తల్లినీ చూడరమ్మా.. అది..
చెట్టు చేమల్నీ కంటున్న బాలింతరమ్మా
అడవి తల్లినీ చూడరమ్మా?
కొమ్మల్ల దాగినా - కోయిలలోయమ్మా
కోc అంటె కోc అంటూ ? పాటా పాడూనమ్మా
ఆడ నెమలీలన్నీ - ఆటాలూ ఆడంగా
మగ నెమిలీలన్నీ - నాట్యాలూ సేయంగా
పొగరూ బోతూ అడవీ - పుంజులా జోడీ
అడివి కోళ్ళ జంట - కాపు కాయంగా
మేత మేసే లేడీ - జింకల మందల్లా
వేటాడ రెక్కీ చేస్తూ - పొంచివున్న చిరుత పులులు
పొదల మాటున నక్కి చూస్తూ - ఊళ బెట్టే గుంటనక్కలు
చెట్ల కొమ్మల మీద దుంకుతూ - కోతులూ కొండెంగలూ
కలకలమని పక్షి గణములు - హెచ్చరిస్తూ గోలచేయగ
ఖాcమూష్? అని ఘర్జిస్తూ - పెద్దపులులా గాండ్రింపులు //అడవి//
గుట్టల్ల నడుమున - బండా గుండ్లను దునికి
వంకలూ తిరుగుతూ - వయ్యారంగా వాగూ
విరబోసిన కురులతో - అడివి మల్లే తీగా
వృక్షాలా ఛత్రాలు - పూల విల్లైనాది
జల్లు జల్లులై విరులు - పూలవానై కురువంగా
పిల్లగాలి పరిమళాన్ని ? చెట్టు చెట్టుకు మోసుకెల్లగ ॥2॥
పూల సింగిడి అడివి సిగలో - చంద్రవంకై అలరించగ ॥అడివి॥



-ది సత్యాపతి
9440372842

## ప్రాసల (ప)నస

నటనలన్ని చెల్లు
ప్రేమలన్ని సొల్లు

డబ్బు లన్ని మాయం
అప్పులేమో ఖాయం.

చెడును చేరదీస్తే
బతుకు ముళ్లరస్తే

పనికి రాని కోపం
ఉనికి కి శరగోపం

విడువాలి కుంటి గుఞ్జం
ఎక్కాలి కీలు గుఞ్జం

కప్పు కోకు పులి తోలు
తెలిస్తే తీస్తారు తోలు

కొంగ నక్కలా నీతెలివి
ఎందుకు పనికి రాదు నీచెలిమి

శ్రమచుక్కల రొక్కం లెక్క తేలదు
నల్లడబ్బు లెక్క తేలిన దొరకదు

- రేడియమ్
సెల్: 9291527757

## వంక

మనసులోని మౌనరాగం
మురిపించేను వెన్నెల సౌరాభమై..
పులకించిపోయెను మదిలోని
ఆశల సౌధం.
కరిగిపోయే కలలా.. కలకన్నా కన్నీటి
సరాగాలా..
రేపటి కొత్త రెక్కల ఉషోదయం..
పురుడు పోయా! అక్షరాల హేలలో..
కొత్త కాంతుల వెలుగు దివ్వెలు
మందారాలై విరబూయాలి
కన్నీటి చారలలో దాగిన నిరాశ కుంపట్లు
పారద్రోలా.. తొలికిరణాలయి పుష్పించాలి
గతి తప్పిన అంతరంగాల అనుబందాలు
మేలుకొలుపా.. మానవత్వపు సుగంధాలు
వెండి వెన్నెల పరిమళాలుగా వికసించాలి!
ఎల్లలు లేని ప్రేమానురాగాలు
ఆత్మీయత తొలకరి జల్లులయి
మానవ సంబంధాలను పటిష్ఠ పరచ..
చిరునవ్వుల కేరింతలు కావాలి
నెలవంక ధరహాసంలో
పున్నమి సొగసులు గుభిలింపా..
నిస్వార్ధమైన ప్రేమ అంకురమై
చిగురులు తొడగాలి

-రవీందర్ కొండ
9848408612

## అదే ఇప్పుడు కనిపించంది!

అదే ఇప్పుడు లోపించింది
దుర్భిణీ వేసి వెతికినా కనిపించంది.
భయంగొలిపే వార్తల్ని కత్తుల్లా విసురుతూ
మన అస్తిత్వాలను
తుత్తునియలు చేస్తున్నారు.
అనుక్షణం భయపెడుతూ
పిరికితనపు గూట్లో గువ్వలా
ముదుచుకుపొమ్మని బెదిరిస్తున్నారు.
ధైర్యం చెప్పే మాటల తీగల్ని
అబద్ధాల ప్రచారాలతో తెగనరుకుతూ
అయినదాన్ని కానిదాన్ని
సోషల్ వేదిక మీద వైరల్ చేస్తూ
పిరికి మందు నూరిపోసి
నిలువునా చంపేస్తున్నారు.
భుజాలమీద వేసే చేతుల్ని నిర్దయగా నరికేసి
కాళ్లకు భయంతీగలు
చుట్టి నడవమంటున్నారు
బాసటగా నిలవాల్సిన క్షణాలను బూడిదచేసి
ఆత్మన్యూనతా భావాన్ని పోగు చేసి
ప్రశాంతమైన ప్రాణ పక్షుల
గొంతు నులుముతున్నారు
పోగు చేయాల్సిందాన్ని పొక్కిలి చేసి
ప్రోది చేయాల్సిందాన్ని పాతరేసి
ఆయుధంగా అందివ్వాల్సిందాన్ని పక్కనపెట్టి
భయంతో బతుకీడ్వమని
అవాకులు చవాకులు పేలుతున్నారు
అదే ఇప్పుడు లోపించింది
అదే ఇప్పుడు దుర్భిణీ వేసి వెతికినా
ఎక్కడా కనిపించంది



- చిత్తలూరి
9133832246

## ఓ మానవా ! మారవా !!

మీ ప్రగతికి మెట్లు వేశాను
నా మూలాలను తుంచివేశారు ఔషధాన్నిచ్చి మీ ఆయవు పెంచాను
మీ ప్రాణానికి నా ఊపిరి పోశాను
ప్రపంచీకరణ మాయలో కాలుష్యపు కాట్లు వేసారే!
ప్రాణవాయువునిచ్చి చల్లగా బ్రతకమని దీవించాను
నీడనిచ్చిన నన్ను నిలువునా చీల్చేసారే ! నా చావు కై పూనుకున్నారే!
జీవ వైవిధ్యానికి జీవంపోసాను ఎండకు వానకు ఓర్చి మీ సంరక్షణ చేశాను
అయినా నాకు క్షామమే మిగిల్చారు కదా!
తల్లినై పోషించి శక్తినిచ్చాను నేను
పచ్చ కాగితపు మోజులో మీకు కనుమరుగైపోయానా ?
ఓయ్ మానవా! నువ్వింకా మారవా ??

-బొప్పెన వెంకటేష్
9866584062

## ఓ మనిషి

ఓ మనిషి
నీవు లింగాన్ని ఆలింగనం
చేసుకొని ఫోటో దిగినా
సంగమేశ్వరునికి
స్నేహితుడు గావు
సుర పతికి వారసుడు కాదు
గొప్ప వారితో సన్నిహితంగా
మసలి నంత మాత్రాన
వారి కీర్తి ప్రతిష్టలు నీకు రావు
కానీ.... నీవు...
ఈర్ష్యా ద్వేషాలు లేనివానిగా
శుద్ధ శౌర్యం గలవానిగా
కల్లాకపటం లేని వానిగా
కల్మషం కానరాని వానిగా
కలిమి లోనైనా లేమి లోనైనా
సహనం గల వానిగా
శాంతం గలవానిగా
సంపాదించిన దానిలో
సంతృప్తి పడేవానిగా
గొప్పలకు పోకుండా
అప్పులు చేయకుండా
జీవితం గడిపిన నాడే
నీవు గొప్పవానిగా రాణిస్తావు
లోకంలో జనం నిన్ను గౌరవిస్తారు.

-రసస్రవంతి " & " కావ్యసుధ"
9247313488

## నిప్పుల కొలిమి

రెక్కలు కష్టాన్ని నమ్ముకొని
రేపటి వెలుగు కోసం బతుకుతున్న
బడుగు జీవుల భరతావనికి
ఇప్పుడు అన్నంతో పాటు
ఆక్సీజన్ కూడా కరువై సంతలో సరుకై
శ్వాస ను కబళిస్తున్నది
ఏడు పదులు దాటిన స్వతంత్రంలో
ఎంతగా ఎదిగిపోయాము!

పంచభూతాలను కూడా బంధించి
సంపదను వశము చేసుకుంటున్న స్వార్థపరులు

గోస పడుతున్న జనం పట్ల జ్యాస మరిసి
గుండెకాయ లాంటి దండకారుణ్య సిరుల
గుట్టు చప్పుడు కాకుండా కొల్లేయాలని చూసే
కొంటె పనుల్లో ఆరితేరిన అపర దేశభక్తులున్న నేల కదా!

స్కాముల్లో గడ్డివాముల్లో కోట్లు గడించిన వంచకులు
ఈ దేశపు శ్రమ సౌందర్యపు మూలాలను
చితి మంటల్లోకి విసిరి
చలి కాచుకుంటున్న నీచత్వం నీడలో
పడకేసిన ప్రజాస్వామ్యపు ఆకాంక్షలు
ఎట్లా మొలకెత్తుతాయి!

తాకట్టు పడ్డ తలలతో
కాసులున్న దేశాల ముందు దాసోహమయ్యే
బానిసత్వానికి ఇంకా మెరుగులు దిద్దుతూ
దేశం మెరిసిపోతుందంటు మురిసిపోతున్న
ధృతరాష్ట్రులను ఏమనాలి!

స్వేదం పిండుకొని మోదంతో బతికేస్తున్న
జల్సా జలగలు
సామాన్యులే సమిధలుగా చావు డప్పులే సంగీతమై
శ్మశానాలను హోరెత్తిస్తుంటే
మొద్దు నిద్ర నటిస్తున్నయ్.

కుళ్ళును కడుగెయ్యడానికి కళ్ళు తెరువనివ్వని
కుట్రల పర్వాలు ఆశ్వాసాలుగా అల్లబడుతున్నను
ఒళ్ళు మరిచి నిదురోతున్న సోమరి తనానికి
చెల్లించుకుంటున్న మూల్యమని ఇంకా అర్థమైతే కదా

నిప్పుల కొలిమి లా రగులుతున్న
అగ్నిపర్వతాలు ఉప్పెనలా ఎగసే దాకా
ఈ ఉన్మాదాలను భరించాల్సిందేనా?

-గన్ రెడ్డి ఆదిరెడ్డి
9494789731

## రెండు కన్నీటిచుక్కలు

ఒక్కోసారి నువ్వు గుర్తొస్తే
ఊపిరాడదు
అప్పుడు నీ గర్భాన్ని
నా పసికాళ్ళతో తట్టినప్పుడు
నువ్వెన్ని పూలతోటలై నవ్వేవో
తెలీదు కానీ
ఇప్పుడు నీ జ్ఞాపకాలు
నా గుండెల్ని తడుతుంటే
కన్నీటి మేఘాన్నవుతున్నాను

చూస్తుండగానే
ఎంత దూరం వెళ్లిపోయావో
రుతువులు దాటి
కాలాలు దాటి
దేహాలు దాటి జ్ఞాపకాల్లోకి...

ఒక్కోసారి చాలా ఆకలవుతుంటుంది
ఎంత ప్రేమను వడ్డించి
నా ఆకలి తీర్చేవో
చెప్పకుండానే వెళ్లిపోయావు.

ఒక్కోసారి ఒంటరితనం
భయపెడుతుంటుంది
చీకట్లో పీడకలలు చుట్టుముడతాయి
ఎవరైనా నన్నీ చీకట్లోంచి లాగి
అవతలి ఒడ్డుకు చేరిస్తే
బాగుండనిపిస్తుంది
ఒక్క తడిస్పర్శ కోసం
నుదురు ఆకాశమంత కళ్ళతో ఎదురుచూస్తుంది

అప్పుడెప్పుడో డైరీలో రాసుకున్నాను
అమ్మంటే రెండక్షరాలు కాదు
రెండు సముద్రాలని.
ఇప్పుడు?
అమ్మంటే రెండు కన్నీటిచుక్కలనిపిస్తుంది.

-సాంబమూర్తి లండ.
9642732008

# నిను.. మరువబోము..!!

నువ్వెంత సరి సమాన సంఖ్యవో.. అంతే అసమాన కల్లోలాల విపత్తువి!
మా దేహాలనే కాదు.. దేశదేశాలను నీ అదృశ్యపు కరోనా కౌగిలిలో బంధించిన..
ట్వంటీ ( 2020)ట్వంటీ.. నిను మరువబోము!!
భూగోళం మీది మనిషి అజ్ఞానాన్ని.. ప్రకృతి ప్రకోపంతో పాతాళంలోకి తొక్కి.. కోవిడ్ కోరలతో మా ఉచ్ఛ్వాస నిశ్వాసలలో అనుక్షణం మరణ మృదంగాన్ని మోగించి ప్రపంచ చరిత్రపుటల్లో కోవిడ్ పాఠమై నిలిచావు..
2020 నిను మరువబోము..
కరచాలనాలతో.. హృదయాలకు హత్తుకు ఉంటే.. తప్పు తనివితీరని మా దేహాలను 'దూరం' చేశావు.. మూతులను మాస్క్‌లతో మూసేసి.. మనుషుల్ని అంటరాని చేతులతో.. ఐసోలేషన్‌కు నెట్టేసి.. ఇళ్లను 'స్టే హోమ్' క్వారంటైన్లుగా మార్చి.. దేశాన్ని లాక్ డౌన్ చేసిన కోవిడ్ విపత్తుకు సాక్ష్యమైన ట్వంటీ ట్వంటీ నిను మరువ బోము.!
దేశంలోకి చొర పడుతున్నా
కోవిడ్ ని నిలువరించ లేకపోయిన మా అజ్ఞానానికి గంటలు గరిటెలతో దివ్వెలు దీపార్చనలతో స్వాగతం పలికాం.
అందుకే ఆరడుగుల నేల మీద పేదరికం గోడల నడుమ వలస దుఃఖం మూటగట్టుకుంది.
దేశం నలుమూలల పుట్ట పగిలిన చీమల్లా.. అఖండ భారత్ అభివృద్ధి రేఖల్ని తమ నెత్తుటి చారలతో తుడిచేసిన ట్వంటీ ట్వంటీ
నిన్ను.. మరువ బోము!!
సమస్త వృత్తుల సహస్ర శక్తులపై విసిరిన పంజాకు శవాలు అయినవాళ్లు.. ప్రొక్లిన్‌లతో పాత రేయబడితే.. రైల్లు విమానాలు ఎల్ ఐ సి లు కంపెనీలు విద్య వైద్య వ్యవసాయ రంగాలను కార్పొ'రేటు'కు కట్ట పెడుతుంటే.. మేము ఇప్పుడు జీవత్సవాలమై వ్యాక్సిన్‌ల కోసం ఎదురు చూస్తున్నాం..
అయినా ఎముకలు కొరికే చలిలో దేశ వెన్నెముకలు ఢిల్లీని ముట్టడించిన సాహస పోరును మాకు అందించిన
'ట్వంటీ ట్వంటీ'..
నిను... మరువబోము!

-సహచరి,
9440970454

## సు(ము)ద్దులు రద్దు చేసి

ఈదురు గాలులు లేవు
బాటసారుల పాదచారుల రాళ్ళదెబ్బలు లేవు
కానీ ఇప్పుడన్నీ టపటపా-
తెల్లారి తోటలోకెళ్తే
కాయలు పిందెల్తోసహా చెట్లచుట్టూరా రాలి-
మృత్యుఘంటికలు మ్రోగిస్తూ
మహావిషాదం ఆవిష్కరణ
కష్టాల కాష్టాల్ని ఎగదోస్తూ
మడమ తిప్పని విజృంభణ-
నిజం నిగ్గుతేలదా?
రహస్యం బైటపడదా?
మొల్కకి చెట్టుకి వృక్షానికి మధ్య
పరదాలు కట్టాలి
ఒకదానితో ఒకటి రాసుకొని పూసుకొని
సుద్దులు ముద్దులు రద్దుచేసి
సరిహద్దులు పెట్టాలి-
మానువేరు తరువువేరు
అన్నీ వేరు ఇదిప్పటి తీరు-
పుటమేసిన కదుద్దైన్యస్థితి
పటమేసి గుణపాఠం చెప్పిన విపత్కరపరిస్థితి-
పొత్తుల్లో చురకత్తులు;
విడిలో పూలగుత్తులు-
దగ్గరైె మరణం దూరమే శరణం-

-కోటం చంద్రశేఖర్
9492043348

## భరోసా

ఇకచాలు
ఇకచాలు కరోన భయాలు
ఇకచాలు కరోన కల్లోలాలు
ఇక చాలు కరోన మృత్యుఘంటికలు
ఇకచాలు కరోన విలయాలు
ఇక చాలు కరోన మరణాలు
ఆదిలో కరోన రేపింది భయాన్ని
ఇప్పుడు తెల్సుకున్నాం దాని నిజాన్ని
అది ఒక అల్ప ప్రాణి యని
భయమేమీ పడవద్దని
అంచనాకు బలం చిన్నదని
నా దేశ ప్రజలారా
పొరుగుదేశ నాయకులారా
ప్రజల్లో ధైర్యాన్ని నింపండి
కరోన రక్కసిని పారద్రోలండి
తోబుట్టువులారా
అక్కాచెల్లెల్లారా
అమ్మల్లారా
భయపడకండి
అది ఏమీ చేయదు
మిత్రులారా
సన్నిహితులారా
దేశ పాలకులారా
ప్రజల్లో ధైర్యాన్ని నింపండి
భయాన్ని పారద్రోలండి
పారిశుద్ధ శ్రామికులారా
దైవ సమానులు వైద్యుల్లారా నర్సుల్లారా
పురపాలక సేవకుల్లారా
మీకు చేతులెత్తి దండం పెడుతున్నా
మీ సేవకు ప్రశంసిస్తున్నా
నిజానికి మీరే మాదేవుళ్ళు
మీరే జగద్రక్షకులు
వైద్యుల పలకరింపే సగంబలం
మనమిచ్చే చేయూతే కొండంతబలం
మాస్కులు ధరిద్దాం
చేతులు కడుక్కుందాం
ప్రభుత సూచనలు పాటిస్తూ
సామాజిక దూరం పాటిద్దాం
కొద్దిరోజుల్లో అంతమైపోతుంది
ఈ కరోన!

-ఎలగందుల లింబాద్రి
7659834393

## కాలాగ్ని!

కాలం ఇప్పుడు కమనీయం కాదు
కర్కశంగా తన ప్రతాపం చూపిస్తోంది
కాపురుషుల దురాగతాలతో విసిగిపోయిందో
కూడని దారులలో నడతకు కన్నెర్ర చేసిందో?
మహానుభావులు అవతరించిన అవని
మహావిష్కరణలు జరిగిన ధరణి
మేలైన దిశగా దేశాలను పురోగమింపచేయాలని
మహోన్నత సంస్కరణల అమలుకు చేస్తూన్న కృషి!
మూలాన్ని సరిచూసుకోకుండా
ముందుకెళ్ళాలన్న తాపత్రయం
మంది విపరీతమై చాలని వనరులు
మితమే హితమని మరచి పెట్రేగిపోతూన్న కాంక్షలు!
మాలిన్యం పెరిగిపోయిన పర్యావరణంలో
మహావిషాన్ని చిమ్ముతోన్న కాలుష్యం
మృత్యుఘంటికలు మ్రోగిస్తూన్న వైరస్ భూతం
మరునాటికి ఏమవుతుందోనని వెంటాడేభయం!
ముదిమి యువత బీదలు ధనికులు
ముక్కుపచ్చలారని పాపలు
మనోహర గాయకులు నటులు రాజనీతిజ్ఞులు
ముదనష్టపు కాటుకు కారెవరూ అనర్హులు!

-అన్నంరాజువేణుగోపాలశ్రీనివాసమూర్తి
9014463489.

## మేలుకో...

ఏ టీవీలో చూసినా
ఏ పేపర్లో చూసినా
ఎవ్వరితో మాట్లాడినా
ఇదే కరోనా ముచ్చట్లే.. కానీ..
చెడుగా ఆలోచిస్తే
చెత్త ఊహలే మొలుస్తయ్
చితిమంటలే మెదుల్తయ్
మితి మీరి
ఆలోచనలొద్దంటారందుకే..
మంచి ఆలోచనా గుండెతో
మంచు కొండంత మనసు అండై
కంచుకోటలా ధైర్యం తోడైతే
కరోనా ముత్తాతొచ్చినా...
గిర గిరా గిరికీలు కొట్టించి
సర్కస్ చేయిస్తరు ప్రయోగశాలలో...
సర్వోన్నత వైద్య చరకులు....
తప్పు చేస్తే తడబడు
తపపటాయించు కానీ..
ఉట్టి దానికే భయమెందుకు
ఊరికే గుబులెందుకూ
అన్నీ ఉన్న మనుషులం
అనంత ధైర్య మనసున్న
మానసికానంద అనుభూతులం
మానుకో కరోనా ఆలోచనలు
మేలుకో తెలివైన మనిషిగా..

-కొక్కె రాములు
9985341992

## సెల్ఫ్ కర్ఫ్యూను విధించుకుందాం

ఇప్పుడు దేశం కష్ట కాలం ఎదుర్కొంటుంది
మొదనట్టపు రోగం మోపై
పురిటి నొప్పులను తీస్తుంది
విష పురుగు పడగ విప్పి బుస కొడుతూ
మానవ మనుగడకు ముప్పు తెస్తుంది.
మనిషి పుడమి పై తరువులన్నీ తరిగి
ఎండిన ఎడారి గా మార్చాడు
పచ్చ దనాన్ని హత్య చేసి
కాలుష్య తరంగాలను వెదజల్లాడు
భూమి భూషణలను బుగ్గి పాల్జేసి
విలాసాల ఊయలలో ఊరేగితున్నాడు.
మనిషి అకృత్యాలతో విసుగు చెందిన
పుడమి తన అమ్ములపొదిలో నుండి
విసిరిన కరోనా ఈటె తో
మనిషి పునాదులు కదులుతున్నయ్
ఆశల స్తంభాలు కూలుతున్నయ్
ప్రగతంతా ప్రశ్నార్థక మౌవుతుంది.
విష పురుగు వీరంగం తోటి
ఆస్పత్రుల న్నీ మరు భూమిగా మారి
శవాల బూడిద పోగు పడుతుంది
కుటుంబాలన్నీ కుప్ప కూలి
పేగు బంధాలన్నీ తెగిపోతున్నయ్
శ్మశానాలన్నీ కన్నీళ్ళు కారుస్తూ
కాటి కాపర్ల తోటి లడాయి జేస్తున్నయ్.
కరోనా గాలి గట్టిగా వీస్తుంది
మన ఇళ్ళచుట్టూ లక్ష్మణరేఖ గీసుకుందాం
నాలుగు గోడలే స్వర్గంగా భావిద్దాం
మాస్క్ లు ,శానిటైజర్‌లు,
సామాజిక దూరాలే మనకు శరణ్యం.
సెల్ఫ్ కర్ఫ్యూను విధించుకుందాం
కరోనా పై విజయ కపోతాన్ని ఎగరేద్దాం

-తాటిపాముల రమేష్
7981566031

## కాదు కదూ !

భయపడకుంటే
పలకరించిపోయే జలుబది
భయపడితే
నిన్నూ నీవాళ్ళనూ కబళించే మృత్యువది
భూతంలా నీ అస్తిత్వాన్నిపెకిలించిన
ప్లేగును జయించావు
నీ మరణమే తన లక్ష్యంగా మార్చుకున్న
మశూచిని జయించావు
నీకై చావు గీతాలను ఆలపించిన
సార్స్ ను జయించావు
ఇప్పుడు
నీ కలల తీరంపై కరాళనృత్యం చేస్తున్న
కరోనాను కూడా జయిస్తావు
అయితే దీనికి
కత్తులు పట్టి యుద్ధం చేయక్కరలేదు
కాస్త ధైర్యపు కవచం తొడుక్కుంటే చాలు
శత్రువు నీ కాళ్ళపై మోకరిల్లుతుంది
ఆదిమకాలపు గుహలనుండి
నీ తెలివిని
అంతరిక్షందాకా తీసుకెళ్ళినవాడివి
సునామీలు విరుచుకుపడి
జీవన చిత్రాన్ని తలకిందులు చేసినా
ఆశల పడవనెక్కి
అవతలితీరం చేరినవాడివి
భూకంపాలు నిన్ను భూస్థాపితం చేసినా
మట్టిపొరల్లోంచి మొక్కలేచి
భూమండలమంతా వనమైనవాడివి
ప్రకృతి విపత్తులన్నీ మూకుమ్మడి దాడిచేసినా
ధైర్యపు కవచం ధరించి
నిలిచి గెలిచినవాడివి
గెలిచి నిలిచినవాడివి
నీ ఉక్కు సంకల్పం ముందు
కరోనాకు నిలిచిగెలవడం సాధ్యమా!
కాదుకదూ!

-ఎన్.నరేశ్ చారి
9701334516

## పల్లెల జీవితాలు

కోడికూతతో నిద్ర లేచే పల్లెలు
దంతధావనానికి వేప పుల్లలు
శుభ్రతకై పరుగులు పెట్టే పొరకలు
గోపేడతో కళ్ళాపి చల్లిన వాకిళ్లు
వాకిలి ముందు వాలిన రంగవల్లులు
కుంకుడుకాయలతో తలంటు స్నానాలు
లోగిళ్లన్నీ గోపిడకలతో ధూపాలు
ఇలవేల్పులకు నమస్కారాలు
పొయ్యిలపై వంటల కుతకుతలు
అరిటాకుల్లో పసందైన భోజనాలు
నిండుకుండలా ఊరి చెరువులు
సంధ్య సమయాన పక్షుల కిలకిలలు
పచ్చని పాన్పులవలె పైరులు
రైతుల స్వేదంతో మొలిచిన
పల్లెల జీవితాలుపాడి పంటలు
తొలి పంటలకు, గోమాతలకు
భక్తి శ్రద్ధలతో పూజలు
పిల్లాపాపలతో ఆనందాల సందళ్ళు
పల్లెల్లో పండగ తిరునాళ్ళు
ఎడ్ల బండ్లతో గుడిసుట్టూ ప్రదక్షణలు
అమ్మవారికి చెల్లించే మొక్కులు
పల్లెలే సంస్కృతి, సాంప్రదాయాలకు ఆనవాళ్ళు
పల్లెలే దేశానికి పట్టు కొమ్మలు

-బోనగిరి. పాండు రంగ
8341212132

## అక్షరమే ఆయుధం

స్త్రీలపై అకృత్యాలకు పాల్పడుతున్న
కామాంధుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా
అక్షరమునే ఆయుధంగా మలచి
స్త్రీలకు స్వాంతన చేకూర్చుదాం..!
ఆరుగాలం కష్టపడి పండించిన
అప్పుల ఊబిలో కూరుకుపోతున్న
రైతన్నల కన్నీటి గాథలను
అక్షరాలతో తర్పణం గావిద్దాం..!.
కష్టాలకోర్చి డిగ్రీలు అందుకున్న
ఉపాధి దొరకక అల్లాడుతున్న
యువత చేసే ఆర్తనాదాలను
అక్షరాలతో ప్రభుత్వాల చెవికెక్కిద్దాం..!
రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసినా
నాలుగేళ్ళు నోట్లోకి వెళ్ళని
పేదరికపు పురిటి నొప్పులను
అక్షరమనే అగ్నికణంతో ప్రశ్నిద్దాం..!
కరోనాతో కుదేలైన
అభాగ్యుల కుటుంబాలలోని
నిరాశ నిస్పృహలను
మనోధైర్యమనే మందుతో పారద్రోలి
అక్షరాలతో సవాళ్లను ఛేదిద్దాం..!

-పిల్లి. హజరత్తయ్య,
9848606573

## కరోనా....!

సీసము!
విజ్ఞతనొదిలేసి వీధి గుమ్మము కాడ
మొగసాలకెక్కెనామొండి కణము
కంటి కాననిదయ్యి కష్టాలబెట్టుచు
కన్నీటి కైనను కరుగకుండె
అర్థాంతరమ్ముగ నాయువున్ గొనిపోయి
చిన్న పిల్లలకేమొ చింతబెట్టె
చిరుత ప్రాయమ్మున చెరగని బాధలన్
చూడలేకుంటిమే సుప్పనాతి
తే.గీ!
తల్లి దండ్రుల గొంపోవ తగునెనీకు
పిల్లకాయల నెవ్వరు ప్రేమ మీర
చూడ నెవ్వరు లేరైరి సుంతయైన
కనికరమ్మెంత లేనట్టి కరొన నీవు!!
సీసము!
టీక మందుల దెచ్చి చక్కగా వేయించ
తగుదునమ్మా యంచు తగవు బెట్టె
నాకు ముందరనగ నాకె యనంగను
తొందరాయెగదమ్మ ధూర్తురాల
ఆగవైతివి కొంత యార్తుల జూచైన
పంజ విసిరితీవె పంతమూని
జనసాంద్రతెక్కువై జనమందరకు టీక
వేయించ లేకుండ్రి వేగముగను
ఆ.వె!
మందు దొరకదాయె మహిమ జూపకనుండె
మందుటెండ లైన మనుజుడోర్చి
మూకగా నిలబడ ముందు నీవైతివి
కనికరమ్ము లేక కరొన నీవు!!

-యెనిశెట్టి గంగా ప్రసాద్
సెల్: 9866447234

## మనిషి మారాలె !

కరోనా మహమ్మారి తో
విశ్వమంతా అతలాకుతలమవుతోంది
కఠినమైన అగ్ని పరీక్ష ఎదుర్కొంటున్నది
ఇది ఆఖరి చూపు అవుతుందేమోనని
అవని అంతా కలవరపడుతోంది
ఇప్పటికే ప్రపంచం
బోలెడన్ని పరీక్షలు రాసి పాస్ అయింది
కానీ ఇప్పుడీపరీక్షలో
ఎక్కడో లెక్క తప్పినట్లుంది
విషాదాన్ని గుణపాఠంగా పొంది
కొత్త పాఠం నేర్వాలె
మనషి తన మూలాల్ని వెతకాలె
స్వార్థం కొంతైనా విడనాడాలె
ప్రకృతిని పాడు చేసే
బుద్దిని శుద్ధి చేసుకోవాలె
చేసిన తప్పుల్ని సరిదిద్దుకుని
మనిషితనాన్ని ప్రదర్శించాలె
ఇకనైనా
మనిషి గుణం మారాలే

-కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి
9441561655

## కరుణ లేని కరోనా

కరోనా భూతం కరాళ నృత్యానికి
మానవత్వం మంటగలిసి పోయింది
బంధాలను చంపేసిన టెర్రర్ కరోనా !
కష్టకాలంలో మానవత్వాన్ని మరిచి
మాయమై మనీ వెంట తిరుగుతున్నారు
కాసుల బంధాలను తెలిపిన భవిష్యవాణి కరోనా !
మనుషుల్లో ఇసుమంతైనా జాలి లేకుండా
కఠిన మనసులై వ్యవహరిస్తున్నారు
బంధాలన్నీ నీటి బుడగలేనన్న నిజం చెప్పిన కరోనా!
విపత్కరమైన విష పరిస్థితుల్లో కూడా
నిర్లక్ష్యంగా జనం మూగుతున్న వైనం
క్షణాల్లో అందర్నీ మాయంచేసే మహమ్మారి కరోనా !
కంటికి కనిపించని అంతుపట్టని శత్రువై
కళ్ళ ముందే విపత్తునుసృష్టించింది
కనిపించని కరాళ భూతం కరోనా !
పరమాణువులా విశ్వవ్యాప్తంగా వ్యాప్తిచెంది
ప్రపంచ జనాన్ని కకావికలం చేస్తుంది
కరుణలేని కర్కోటకమైన కాలాంతకి కరోనా!
అగ్రరాజ్యాల దేశాధి నేతలను సైతం
ఆకస్మికంగా దాడి చేసి కబలించింది
ఎవ్వరినీ వదిలిపెట్టని బాహుబలి కరోనా!
విశ్వమంత మార్మోగుతున్న మరణమృదంగానికి
చిగురుటాకులా రాలుతున్న సామాన్య జనం
అందరిని మాయం చేసే మాయావి కరోనా!
అపర కుబేరులనైనా అవస్థల పాలుచేస్తూ
అనాధలా పడేసి అంత్యక్రియలు లేకుండా చేస్తుంది
జాలిలేని కఠినరాలు కరోనా !

- సునీత బండారు
9440671530

## నేను..

చుట్టూ చీకటి
ఎక్కడిదో
ఎలా ఆవహించిదో
కాలికో చేతికో
మనసు కో
మమతలకో
అడుగు తీసి
అడుగేస్తే
చీకటే...
కళ్ళ నిండా
గుండె నిండా
శ్వాసలోనూ
మాటలోనూ చీకటే
ఎందుకిలా అంటిందో
ఏమని ఇలా తాకిందో
అణువణువునా
భయం తో
వణికిస్తూ
తనలో కలుపుకోడానికో
తనను అంతటా
పులముకోడానికో
వెంటాడుతోంది
చీకటి..
అయినా..
ఏదో ఆలోచన,
ప్రాణభయం లేకుండా సైనికుడు
దేశాన్ని ఎలా కాపు కాస్తున్నాడో..
చీకటి శత్రువుని ఎలా
తుదముట్టిస్తున్నాడో...
చుట్టూ చీకట్లు ఉన్నా
వెలుగై అంబేడ్కర్
ముందుకెల నడవగలిగాడో..
కత్తి అయ్యి శివాజీ
చీకట్ల నెలా చీల్చివేశాడో...
చుట్టూ మార్గం లేకున్నా,
మార్గదర్శై వివేకానందుడు
ఆత్మానందాన్ని ఎలా పంచగలిగాడో..
అంతరంగాన్ని తట్టి,
కొట్టి లేపుతున్న ప్రశ్నలు..
చాలిక..
నేను
దృఢమైన మనసు
తుపాకీ లోంచి వచ్చే
ధైర్యపు తూటానవుతాను,
భవితల్ని దిద్దే
రాజ్యాంగ శాసనాన్నవుతాను..
ప్రాణ రక్షణ చేసే
కత్తి అంచున పదునవుతాను
జీవన విలువల్ని నేర్పే
కొత్త పాఠాన్ని అవుతాను..
నచ్చిన దేవుడి నో,
నచ్చిన వ్యక్తి నో,
నచ్చిన పాటలనో
కీర్తన లనో
తలుచుకుంటూ
కొలుచుకుంటూ
నన్ను నేను
మలుచుకుంటూ..
భగభగ మండే
వెలుగు కాగడానవుతాను
చీకట్లను కాల్చివేస్తాను.
మాస్కు సానిటైజరు
టీకా వేసుకుని
కరోనా చీకటిపై
బ్రహ్మాస్త్రాన్ని సంధిస్తాను.
ఆవిరినో వేడి నీటినో
సేవిస్తూ
చైతన్యమై ప్రసరిస్తాను.
మాటల్లో
మమతల్లో
మనుషుల్లో
మనసుల్లో
చుట్టుకున్న చీకటిని
ధైర్యంతో తిప్పికొడుతూ
ఊపిరికి ఊపిరి ఊదుకుంటూ లేచి
నలుగురికి ధైర్యమై బ్రతుకుతాను....
నేను
బతుకు మార్గ దర్శినవుతాను..

-దీక్షిత్ కుమార్ మల్లెల
9063699731

## ఒక్కసారి ఆలోచించు

దేశ స్వాతంత్ర్య పోరాటాల్లో
సాలిటరీ శిక్షలు పడి
కాళ్ళు చాపుకోను స్థలం లేక
జీవితకాలం జైళ్ళ లో మగ్గిన
వీరుల గాథలు చదివితే
లాక్ డౌనంటే విసుగు పుట్టదు!
సునామీ సమయంలో
కుటుంబాన్నంతా కోల్పోయి
అనాథై మిగిలిన పసిగుడ్డు
సహాయక శిబిరాల్లో ఉన్న
దయనీయస్థితి గుర్తు తెచ్చుకుంటే
లాక్ డౌనంటే విసుగు పుట్టదు!
కార్గిల్ యుద్ధరంగంలో
శత్రుదేశానికి చిక్కిన
జవాన్లు చిత్రహింసలకు గురై
మరణించిన తీరుతెన్నులు
మనసులో జ్ఞప్తికి తెచ్చుకుంటే
లాక్ డౌనంటే విసుగు పుట్టదు!
పెను తుఫాన్లలో
పడిపోయే ఇంట్లో ఉండలేక
బయటకు వెళ్ళలేక
పడే బతుకు భయాన్ని
సందిగ్ధతను తలుచుకుంటే
లాక్ డౌనంటే విసుగుపుట్టదు!
ఉధృతమైన వరదల్లో
ఊరంతా కొట్టుకుపోగా
చెట్టు కొమ్మ మీద కూర్చుని
ఆకలికేడ్వాల ప్రాణానికేడ్వాల అని
కొట్టుమిట్టాడే స్థితి తెలుసుకుంటే
లాక్ డౌనంటే విసుగు పుట్టదు!
లతూర్ గుజరాత్‌లలోని
భూకంపాలు గుర్తు చేసుకో
వీరుల గాథలు చదువు
రామాయణ మహాభారత,ఇతిహాసాల
సారం నేర్చుకో
ఆశావహ దృక్పథంతో సాగు
రేపు అవును నీ సొంతం ఆసాంతం

-వి.శేషారావు
9440408080

## జన సంహారానికి ఆజ్యం పోయకు

అయినవారు మరణిస్తే
కర్మకాండలకోసం క్యూ లైన్లో నిలబడి
చితి కోసం
స్లాట్ బుక్ చేసుకుని నిరీక్షిస్తుంటే.
ఎదురుగా అంగుళం కూడా ఖాళీ లేకుండా
చితి మంటలు ఎగిసి ఎగిసి పడుతుంటే
గుండెల్లో ఆరని మంటలు
కన్నీటితో ఆర్పగలమా.
కాలమా.. ఏమిటిది
కరోనా చేస్తున్న మారణ హోమమా ఇది
మన నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం కాదా ఇది.
టీవీల్లో రేడియోలో పేపర్లలో
పదే పదే చెప్తున్నారే
జాగ్రత్తగా ఉండమని
అన్ని జాగ్రతలు తీసుకోమని
వాళ్ళు చెప్పేవన్నీ
చెవిటోడి ముందు
శంఖం ఊదిన చందంగా మారాయి.
ఎవరికి వారు మాస్కులు లేకుండా
రోడ్లపై తిరుగుతూ
లక్షణాలు ఉన్న వాళ్ళు సైతం
జనసంచారంలో కలిసి పోయి
కరోనాతో సహజీవనానికి
సహకారం అందిస్తూ
జన సంహారానికి ఆజ్యం పోస్తున్నారు.
ఎందుకిలా..
ఎవరికి బాధ్యతలేదా..
బంధాలన్నీ తెగిపోతున్నాయి
బంధువులంతా దూరం అయ్యారు.
చస్తే సంపాదించినదేది
మనతో రాదని తెలుసు
కానీ ఇపుడు చావు వస్తే
అయినవాల్లెవరు దగ్గరకి కూడా రారు
కాల్చడానికి శ్మశానంలో
చోటు కూడా దొరకదు.
ఓ మనిషీ కాస్త ఆలోచించు
బాధ్యతనెరిగి మసలుకో
కరోనాను తరిమే పోరాటంలో
సైనికుడవై ముందడుగువెయ్యి.
నీ రక్షక కవచాలే మాస్కులు అని గుర్తించు
ఆరడుగులు దూరంగా ఉంటేనే
పదికాలాలు బతికుంటావాని తెలుసుకో
తెలుసుకుంటే బతికుంటావ్
లేదంటే.....

-దేవలపల్లి సునంద
8297744716

## కరోనా దేశ పొలిమేర దాటి పో

కరోనా..... కరోనా.... కరోనా...
ప్రపంచ దేశ దేశాలలో
ప్రజలంతా వణికిపోతున్నారు
అల్లాడి పోతున్నారు
కరోనా మానవజాతి చరిత్రలో
మహోజ్వల ఘట్టమయ్యింది .
కరోనా కోరల్లో చిక్కుకొని
అల్లాడుతున్న అభాగ్యులేందరో
ఎండలు మండిపోతున్నాయి
కరోనా రోగులతో
ఆస్పత్రులు నిండిపోతున్నాయి.....
వలస జీవులు ప్రాణాలు చేతబట్టుకొని....
దిక్కులు చూస్తున్నారు దీనంగా.
మానవ సంబంధాలు
బంధాలు అనుబంధాలు
దూరమవుతున్నాయి
ఆత్మీయతలు అడుగంటుతున్నాయి
భార్యకు భర్త భర్తకు భార్య
కన్నవాళ్లకు ఉన్న వాళ్ళు
ఉన్నవారికి కన్న వాళ్ళు
హితులకు సన్నిహితులకు
బంధాలకు బంధుత్వాలకు
దూరమవుతున్నారు.
కరోనా కనిపించని మాయా పిశాచివై
ప్రజలను పీడించుక తింటున్నావు
ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న రక్కసి
మమ్మల్ని వదిలి దూరంగా
వచ్చిన మార్గములో తరలిపో..
లేదా ఘోరమైన చావు చస్తావు
తపోధనులు ధారపోసిన శక్తితో
నీ శక్తులను నిర్వీర్యం చేస్తాం .
ఇప్పటికైనా మించిపోయింది లేదు
క్షమాగుణం భారతీయుల ధర్మం
తస్మాత్ జాగ్రత్త
మంచితనముతో దేశ పొలిమేర దాటిపో
నీ ప్రాణాలు కాపాడుకో......
లేదా ప్రజా శక్తులతో దగ్ధమై పోతావ్..
తస్మాన్ జాగ్రత్త...
మానవుల హెచ్చరిక.


-రసస్రవంతి & కావ్యసుధ
9247313488.

## ప్రాణ నేస్తాలు

కరోనా కాలంలో
బతుకు పోరాటం
ఎటుచూసినాఏడ విన్న
గాలి లేక ప్రాణాలు
గాల్లో కలువ వట్టే
లోకమంతా గాలి భయం
అయినా
గాలి లేక చచ్చుడెంది.
ప్రకృతి బతకనిస్తే
మనిషి చేసే పాడు పనులతో
ఉర్విక ఉచ్చు బిగుస్తోంది
అందుకేనేమో
ప్రకృతి పగతో
గాలినే పాశంగా మార్చి
కరోనాకాలుడై కబలిస్తుంది
మనిషి ప్రాణాలు.
అందాల అవనిలో
కనీస అవసరాల కల్పన
ప్రకృతి సహజ ప్రసాదం
పైసలే అసహజ ప్రాపకం
ప్రాపకంతో ప్రసాదం మెక్కి
నిత్య అసంతృప్తితో
జీవిత ఆస్వాదన కోల్పోయి
"అర్థ"ఆకలితో
అనుక్షణం హారతయ్యే
మనిషితత్వ హీనుడిపై
మనీతత్వ మోహుడిపై
అవని ఆగ్రహించింది
ఈ ఆగ్రహంతో
మనిషి ఏగ్రహానికో పలాయనం చెందాలి
అందుకే
పాడురోగం చంపుతుంది
చావు భీతితోనైనా చలించిపోయి
చెదిరిన జీవితాన్ని చక్కదిద్దుకోవాలి
చిక్కనైన దారిలో నడవాలి.
పంచభూతాలు
మనిషి ప్రాణ నేస్తాలు
స్వచ్ఛమైన స్నేహహస్తాలు
అందుకో మానవుడా
అందుకొని స్వేచ్ఛగా జీవించు
కరోనామహమ్మారిని జయించు

-జినుకల వెంకటేష్
9652092120

## హెచ్చరిక

హెచ్చరిక హెచ్చరిక
కరోనతో కాలం కలిసి రాని
నేటి రోజుల్లో పెళ్ళికొడుకు
ఎగబడి తినడానికి పోతే
నీ పిండకుడు ఎవరో తినాలి
మాస్కు తో ముసుకు వేసుకోకపోతే
ఇంటి గోడ మీద
నీ ఫోటో కో దండ
ఎవరి కైనా ముక్కు మూతి
మూసుకొని గుడ్ మార్నింగ్ చెప్పండి
కరోన నీకు చావు
వార్నింగ్ ఇస్తూ వస్తుంది నేడు
అందుకే కాలానుగుణంగా
మార్చుకోవాలి నడవడి
లేదంటే అది మోగిస్తూనే
ఉంటుంది చావుల సైరన్
అందుకే మాస్కు ధరించు
భౌతిక దూరం పాటించు
శానిటేషన్ చేసుకో
రోగ నిరోధక శక్తి పెంచుకో
పుకార్లు నమ్మకు
టీకా ను నిర్భయంగా తీసుకో
రేపటి భవిత నీ శ్వాశ ఉంచుకో

-వైద్య శేషారావు
9440408080

## ఖబర్దార్ కరోన

పాట.
మాదిరి'బండెన్కబండిగట్టి'
పల్లవి. చిన్నపెద్ద గల్సీ ఇంటందు మేమునిల్చీ
మాస్కుధరిస్తాములే మాయదారికరోన
చేతూలుగడ్గుతాములే మాయదారి కరోన(చిన్నపెద్ద)
చరణం.వాక్సీను వచ్చినాదె టీకాలుదింపుతారె
డాక్టర్లు అంతగల్సీ దమ్మెల్లకుండజేసి ।2। సార్లు
దుమ్ముదుల్పుతారె ఓ మయదారికరోన
నీ దిమ్మదిర్గుతాదే ఓ మాయదారి కరోన" (చిన్నపెద్ద)
చరణం।।నీ కండ్లు మసకలేసే ఇంకేమిగానరాదే
నినుకదలనివ్వబోమే నీబత్కుఒడ్సినాదే।2। సార్లు
మాయదారి కరోన
ఇక మెత్కుబాకిలేదులే మాయదారికరోన(చిన్నపెద్ద).
చరణం।।మా ముక్కు పుటాలల్ల నువు పొంచి మాటువేసి
మా శ్వాసనాపుతావా విశ్వాసమింతలేదా ।2। సార్లు
గుడ్లల్లవొడుస్తామే ఓ మాయదారికరోన
గుండెల్నుజీల్చుతామె ఓ మాయదారికరోన(చిన్నపెద్ద).
చరణం।। ఇంగిలీషుమందుల్ మరి మూలికాలమందుల్
నువ్వుండేదెక్కడైనా నీదెంతసత్తువైనా ।2। సార్లు
నూకలింకచెల్లేనే మాయదారికరోన
నీ దూకుడింకచాలులే మయదారి కరోన (చిన్నపెద్ద).
చరణం।। ఓము జీలకర్ర లవంగాలుగల్పిదంచీ
కర్పూరమందు నుంచి ఓ బట్టలోనగట్టీ ×2×సార్లు
నీ నోటకళ్ళేమేసి ఓ మయదారికరోనా
క్రిజనుపెంచుతామే ఓ మాయదారికరోన (చిన్నపెద్ద).
చరణం।। పుణ్యంపుభూమి మాదీ ధర్మంపు భూమిమాదీ
దేశదేశాలెల్లమైత్రి
మేలైనదేశరత్నం ।2। సార్లు
ఇకనీ చావుదప్పదమ్మా ఓ మాయదారికరోన
పరుగులెట్టవమ్మా ఓ మాయదారి కరోన(చిన్నపెద్ద).

-ఎలగందుల లింబాద్రి
7659834393

## మృత్యుగుహ నుంచి మల్లెల పొదలోకి"

ఇప్పుడంతా.. ఒకటే భయం
దిట్టమైన గుండెని కలచివేసే దృశ్యం
కొండలాంటి గుండెలయినా కదిలిపోవల్సిందే
ఒకరికి ఒకరు తోడురారు
ఒకరితో ఒకరు దిగులును పంచుకోరు
పంచదార చిలకైనా,
పసిడి రేకుల పువ్వైనా,
ఒకసారి అది సోకిందా...అంతేమరి..
మృత్యు గుహలోకి,
మరణపు తలలోకి వెల్లవల్సిందే.
ఎన్ని శవాలు గుట్టలు గుట్టలుగా
దిగులు దిబ్బలుగా మేటు వేయడము లేదు
ఎంతమంది కళ్లెదుటే కాటికి వెళ్లడము లేదు
ప్రాణవాయువుకు పోరాటము చేయవలిసివస్తోంది.
ఇప్పుడు శ్మశానాలకు గిరాకీ పెరిగింది
కాపర్లే అక్కర్లేదు.. మానవత్వము నిండినవారే
శవాలను మోసేవారయ్యారు
రక్తసంబంధీకులు రాకవరకు వేచే సమయము లేదు..
వారు వచ్చినా చేసేదేమిలేదు..
కరోనా మహమ్మారి సోకిన వారి గతి అంతే
కడ చూపుకు అవకాశము వుండదు
గుడ్డలు చుట్టి శవదహనాలు
నాకు తిరుగులేదు,ఎదురులేదన్నవారే
ఆసుపత్రిపాలై లక్షలకు లక్షలు కుమ్మరిస్తున్నారు
చెబితే వినినివారు చతికిలపడుతున్నారు
మనుష్యుల్లారా మారండి
"మృత్యుగుహ నుండి మల్లెలపొదల్లోకి"దారిని వెతకండి
మనోధైర్యముతో కరోనాపై పోరాడి
సంకల్పబలముతో కరోనాను తరిమికొట్టి
మనిషి తల్చుకుంటే
మదగజము కరోనా పారిపోవల్సిందే అనిచాటండి
విశ్వశాంతిని పంచండి

-విశ్వనాథ నరసింహం
9490971589

# మానవాళి కనురెప్పలు...14 కవితలు

ప్రస్తుతం ప్రపంచాన్ని ఇంటికి పరిమితం చేసి,లక్షన్నర మందికి పైగా ప్రజలను పొట్టన పెట్టుకున్న కనిపించని కరోనా క్రిమి రక్కసి బారి నుండి ప్రజానీకాన్ని రక్షించడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టి బాధితులకు చికిత్స చేస్తున్న వైద్య బృందాలు, లాక్ డౌన్ కోసం నిరంతరం శ్రమిస్తున్న రక్షణ యంత్రాంగం, ఎప్పటికప్పుడు పరిశుభ్రత సేవలు అందిస్తున్న సఫాయి కార్మికులు, ఆపద సమయంలో మానవత్వం తో పేద వారికి చేయూత నిస్తున్న దాతలు, ప్రజలకు కొండంత అండగా నిలుస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు,స్వచ్ఛంద సంస్థలు ,ఇలా అందరు ఏకమై మానవత్వాన్ని చాటుతున్నారు. ఈ సందర్భంగా ప్రజలలో చైతన్యం కలిగించడానికి నా వంతు చిరు ప్రయత్నం గా 14 కవితల సమాహారాన్ని "మానవాళి కనురెప్పలు "పేరుతో అందిస్తున్నాను.

–దుర్గమ్ భైతి,
సెల్:9959007914.

## దైవం వైద్యుని రూపేణా ...

ప్రపంచమంతా కుటుంబ సమేతంగా
ఇంటి పట్టున ఖైదీ గా మారితే
తను నిత్యం కనిపించని
కోరలు చాచిన కరోనా తో
యుద్ధం చేస్తూనే ఉన్నాడు
ఆ రాక్షసి ఏ వైపు నుండి
దాడి చేస్తుందో తెలియదు
ఎవరి రూపంలో తన దరికి
చేరనుందో తనకు అనవసరం
చేతనైనంత మంది బాధితులను
కాపాడడమే తన కర్తవ్యం
వృధ్యాప్యంలో తమకు ఆసరా గా
ఉంటాడని ఎదురుచూసే
తల్లిదండ్రులు తనకు గుర్తుకు రారు
జీవితాన్ని పంచుకున్న సహచరి పై
తనకిప్పుడు ధ్యాస లేదు
అల్లారుముద్దుగా కని పెంచిన
పిల్లల ప్రేమ కనపడుట లేదు
బాధిత కరోనాగ్రస్తులే తన
ఆత్మ బంధువులు
వారిని బతికించడమే తన విధి
ఇంట్లో కాంతి రేఖలు వెలిగిస్తాడో
తెలియదు కాని
ఆసుపత్రి లో జీవన రేఖలు
ప్రసాదించే ప్రాణదత తను
వృత్తి ధర్మాన్ని పాటించే
మానుష దైవం తను
కరోనా ను జయించి ఆ దైవం
తమ దరి చేరుతుందని
ఎదురు చూస్తోంది ఇంటి గుమ్మం

## ఇక నైనా శాంతించు

కరోనా నీకిది తగునా
నిత్యం రెక్కల కష్టం తో కడుపు నింపుకునే
కార్మికుల కూటిలో రాళ్లు వేసావు
పనిగంటలు తెలియని అన్నదాతల
వెన్ను విరిచి మూలన పడేసావు
గూడు చెదిరిన గువ్వ పిట్టల వలె
మానవ జీవితాలను ఆగమాగం
చేసి ఎగిరెగిరి పడుతున్నావు
గాలి మోటార్లు మూయించి సుడిగాలి లా
స్వైరవిహారం చేస్తూ భయపెడుతున్నావు
ఈ మానవాళి చేసిన నేరమేమి
ప్రకృతి వైపరీత్యాలే అప్పుడప్పుడు
ప్రపంచం పై కక్ష కట్టి
ప్రతీకారం తో పగ తీర్చుకున్నాయి
ఒకరికి ఒకరు తోడు నీడగా
అభయ హస్తం ఇచ్చు కోకుండా
ప్రపంచాన్నే చాపలా చుట్టావు కదా
దేశాల మధ్య దూరాన్ని పెంచావు
బంధాల అంతరాన్ని తగ్గించావు
భారతీయ సంస్కృతి సంప్రదాయాన్ని
విశ్వ వ్యాప్తం చేసి
నమస్కార సంస్కారం నేర్పావు
నువు మేలు చేసావో
కీడు చేసావో తెలియదు కాని
ప్రాణాలతో చెలగాటం సరి కాదుగా
ఎన్నాళ్ళు మాకి జైలు శిక్ష
నరక యాతన
ఎవరో ఆడుతున్న చదరంగంలో
పావులు బలవుతున్నాయే
నివారణ లేదని యుద్ధం చేయకు
నిండు మనసుతో ఆలోచించు
ఇక నైనా కరుణ తో శాంతించు
మాపై కనికరం చూపించు
నీ పాత్ర ముగిసాకా మా బతుకు
ఎంత దారుణమో నీకు తెల్వదు
భూమి ఉన్నంతవరకు నువు విడిచిన
విషాదాలు మదిని చీలుస్తాయిలే !

## సమర భేరి మ్రోగించు

శత్రువు యాడుంటాడో
యెవ్వరికీ తెల్వదు
యుద్ధం మాత్రం
తప్పక సెయ్యాలా

ఏ దిక్కునుంచి పెమాదం
ముంచు క్రొత్తదో పసిగట్టలేక
పజల పానాలు నీటి బుగ్గలోలే
నింగిలో కలిసిపాయే

కత్తులతో నరికి చంపుదామంటే
కనబడేటోడు కాదాయే
తుపాకీ తూటాలతో కాల్చుదానికి
వాడు సరిహద్దు శత్రువు కాదు.

పరదేశంలో పుట్టి
ప్రపంచాన్ని వణికించి
మనదేశంలో కి వచ్చే
మాయదారి గాలి రోగం .

ఒంటరి తనమే రోగానికి
మందని ఎంత చెప్పినా
వినని వారినేమి సెయ్యాలా
సోయి లేనోళ్ళకు బుద్ధి రావాలా.

అంతు చిక్కని ఈ అంటు రోగాన్ని
అదుపు చేసేలా అందరు ఏకమై
విడివిడిగా ఉంటూనే
ఒక్క మాటపై నిలబడాలే.

శత్రువు బలం పెద్దగున్నప్పుడు
ఓర్పుతో రెండడుగులు వెనకేసినా
తప్పుకాదది రేపటి గెలుపుకు
మొదటి అడుగు.

నీ ఇంటినుండే సమరభేరీ
ధైర్యంగా మోగించు
దేశ పౌరునిగా నీ కర్తవ్యాన్ని
గర్వంగా నిరూపించు

## గాంధీ ఆసుపత్రి

పరిమళించిన మానవత్వానికి
నిలువెత్తు నిదర్శనం
నిరంతరం నిస్వార్థ సేవకే
అంకితమైన ఉద్యోగుల వేదిక
గాంధీ ఆసుపత్రి
రాత్రి పగలు తేడా లేదు
ఎటు చూసినా కరోనా
లక్షణాల బాధితులే
ఏ వైపు నుండి ప్రమాదం
వస్తుందో తెలియదు
అసలు ప్రాణాలతో ఇంటికి
చేరుకుంటామో తెలియదు
బాధితుల ప్రాణాలు కాపాడడమే
తమకున్న ఏకైక లక్ష్యం
కరోనాను జయించిన వారి
కళ్ల లో కనపడే ఆనందమైనా
కరోనా బారిన పడి కన్ను
మూసే వారి బాధలైనా
సడలని తెగింపుకు వారసులు
మహమ్మారి క్రిమి రక్కసి
వికృత విలయ తాండవాన్ని
తిలకిస్తున్న ప్రత్యక్ష సాక్షులు
కుటుంబ బంధాలు కాన రావు
పిల్లల మమకారం మరిచారు
ఆసుపత్రి నే ఇంటిగా మార్చుకుని
అలుపెరుగని సేవలందిస్తున్న
మీకు శతకోటి వందనాలు
సహకరించని వారితో సైతం
సౌమ్యంగా పలకరిస్తూ
రోగుల చికిత్స కొరకు
సర్వశక్తులు ధార పోస్తున్న
వైద్య సిబ్బంది త్యాగనిరతి
అంతరించిపోతున్న మనిషితత్వానికి
ఊపిరి పోసిన సేవా భావన

## రక్షణ కవచాలు

ఉపద్రవాలు ఉప్పెనలు
మనకు కొత్తేమి కాదు
నిద్రాణమైన జాతిని
సంఘటిత పరిచే శక్తి అండతో
కరోనా రక్కసి ప్రవాహానికి
అనకట్టలతో అరికట్టుదాము
సామ్రాజ్యవాద పునాదులను
జాతి ఏకమై పెకిలించిన
చరిత్రకు వారసత్వ ప్రతీకలం
నాడు గొంతెత్తిన నినాదాలతో
ఐక్యతతో వీధుల్లోకి వచ్చి
స్వరాజ్య సాధనే లక్ష్యంతో
సాగించిన పోరు మరిచామా !
నేడు స్వీయ నియంత్రణ తో
ఇంట్లోనే విడిగా ఉంటూ
కరోనా ను అదుపు చేయలేమా ?
ప్రాచీనంలోనే ప్రపంచానికి
వైద్య పాఠాలు బోధించిన
మన దేశ సంస్కృతే
నేడు రక్షణ కవచమై
రగిలే నిప్పు కణికలపై
రణం చేస్తూనే ఉంది
దైవ దూతలకు తోడుగా
రక్షక యంత్రాలకు బాసటగా
సఫాయి సిపాయిలకు చేయూత గా
మనం సాగించాలి
మరో సమర పోరు
మహమ్మారి నిర్మూలన కై
సమరశంఖం పూరించిన
సేవా మూర్తుల త్యాగనిరతిని
కోటి దీపాల కాంతులతో
కరతాళ ధ్వనుల సవ్వడితో
విశ్వవ్యాప్తం చేయాలి.

## మనిషి వాసన

ఎప్పుడైనా అనుకున్నామా
మనిషి వాసన చూసి మనిషి
భయపడుతాడని తుపాకి తూటాలకు
ఎదురొడ్డి నిలిచిన గుండెలు
బీటలు వారుతున్నాయి
పదునైన కత్తులకు సైతం
తలవంచని తెగింపు
నిర్వీర్యమై వెన్ను చూపే
కరుణించని కరోనా రక్కసి
ప్రళయ తాండవానికి
బలి పశువుగా మారిన ప్రపంచం
అంతుచిక్కని మహమ్మారి భూతానికి
మరుభూమిని తలపించే దృశ్యాలు కోకొల్లలు
నీడ ను చూసి నింగే కుంగిన తరుణంలో....
పరిమళించిన మానవత్వానికి
ప్రతిరూపం వైద్యుల సేవలు
ప్రాణాలకు తెగించి పనిచేసే
పారిశుద్ధ్య కార్మికలోకం
నివారణ లేని కరోనా వ్యాప్తి
నియంత్రణ కై నిరంతరం
శ్రమిస్తున్న రక్షణయంత్రాంగం
అంధకారం చుట్టుముట్టిన వేళ
జీవన రేఖలై వెలిగే వారికి
చేయూత నే మనిషితత్వం
స్వీయ నియంత్రణ విధి ధర్మమే
నీ మాతృభూమి కిచ్చే రక్షణ

## జర పయిలంగా ఉండు

ఇదిగో తాతయ్యా
జర చెప్పింది మంచిగ విను
మన కాడికి కరోనా బూచి వచ్చింది
ఇంటి నుండి బయటకు వెళ్లకుమా
మస్తు మందిని చంపుకు తిన్నదది
నువ్వు ఎన్నో కథలు చెప్పినవు
కరోనా రాక్షసుని కథ
చెప్పలేదెందుకు తాత
మా బడి బందు పెట్టినరు
పరీక్షలు సూత ఆగిపోయినవి
దోస్తులతో అడుకుందామంటే
ఎవ్వరిండ్లల్ల వాళ్ళే ఉండవట్టిరి
అమ్మ నాన్న అన్నలతో
అష్టచెమ్మ కైలాసం పచ్చీస్
ఆటలు ఆడుకుంటున్న
బుద్ధిపుట్టినప్పుడు బడి పుస్తకాలు
మంచిగానే చదువుతున్న
రాధ వాళ్ళ అమ్మ ను చూడక
వారం రోజులయిందట
నర్సు నౌకరు చేస్తుందని చెప్పింది
దవాఖానలో కరోనా రోగులకు
భయపడకుండా గొప్ప సేవ చేస్తుంది
రాము నాన్నైతే తను ఇంటికి రాకుండా
అందరు ఇంటి నుండి బయటకు రాకుండా
కరోనా మనకు అంటుకోకుండా
గొప్ప పనే చేస్తున్నాడు తాత
డాక్టర్లకు సపోటు గా నువ్వు
చప్పట్లు కొట్టావట గదా
నానమ్మ చెప్పిందిలే
దీపాలు కూడా వెలిగించిందట
దూరం దూరంగా ఉండమని
ఇంటి నుంచి బయటకు రాకుమని
మన వాడకట్టోళ్ళకి నేను చెప్పానులే
గల్ల గురిగిలో నేను దాచుకున్న
రెండొందల రూపాయలు
మా గల్లీలో పేదోళ్లకు
అన్నదానం చేస్తున్న సంఘానికి
విరాళం గా ఇచ్చిన
నువ్వు కూడా నీ పింఛను ఇయ్యి



## కరోనా రాగ గీతి పద్యాలు

పనిగట్టుక వచ్చె పాడుకరోన
చైన నుంచి యదుగిడె చల్లగా చంప
మాయ చేయగ వచ్చి మనుషుల జంపె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

పదిలమెంతగానున్న పదిలక్షలాయె
కాటు వేసెగ నేడు కర్కశ జీవి
రోజు రోజుకు పెరిగె రోదనే మిగిలె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

సూక్ష్మజీవి దేశముకు సులువుగావచ్చె
మనిషి బతుకుట నరక మాయెగ నేడు
దుర్భరంబుగ చేసె దయనేది లేక
రమ్యమైనది చూడు రాగగీతికను.!

పరుగు పరుగున వచ్చె పాడు కరోన
కనికరము లేకపాయె కఠిన కరొనకు
కాటువేసెగ జీవి కడుపును మాడ్చె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

పెరిగె కేసులు రోజు: పేదల కింక
నరక మాయెగ బతుకు నానాటికింక
దాపు రించెను జీవి దయనేది లేక
రమ్యమైనది చూడు రాగగీతికను.!

వలస జీవుల బతుకు వడిదుడు కాయె
పట్టు వదలక జీవి పగతీర్చ వచ్చె
తేలలేదింక లెక్క తెలవక పాయె
రమ్యమైనది చూడు రాగగీతికను.! .

భయముతోడ మనుగడ భారతావనిన
లక్ష దాటించె నేడు లక్షణము మార్చె
మందు లేక మనుషుల మరణాలుపెరిగె.
రమ్యమైనది చూడు రాగగీతికను.!

ఆస్పత్రులలోన చేర యాపద పెరిగె
గృహము లోపల నీవు గట్టిగనుండు
వీడి కదలగ వస్తె వేసెగా కాటు
రమ్యమైనది చూడు రాగగీతికను.!

గుండె లోన పుట్టించె గుబులును కరొన
కోవిడొచ్చిజనాల కునుకును తీసె
వైరి చేయగ వచ్చె వైరసు నేడు
రమ్యమైనది చూడు రాగగీతికను.! .

విషము జిమ్ముతు తిరిగె విశ్వమంతాను
మార్గమేమియులేక మనుషులకింక
భయము తోడ మనుషులు బతుకునీ ధృగను
రమ్యమైనది చూడు రాగగీతికను.!

జీవి బారిన పడుతు జీవము కొరకు
తల్ల డిల్లుతూ. జనము తగ్గని కరొన
భయము తోడను యంత బతుకునిద్భగను
రమ్యమైనది చూడు రాగగీతికను.!

గాలి లోనుంచి వచ్చె :గాబరా పుట్టె
తాకినంతనే వచ్చె :తగ్గదా కరొన
జీవితము పైన యాశ జీర్ణము చేయ
రమ్యమైనది చూడు రాగగీతికను.!

పరుగు పరుగున వచ్చె పాడుజీవింక
ప్రకృతి నాశనమొసగిన: ఫలితముగాను
మృత్యు ఘంటికలిపుడు మార్మోగె రోజు.
రమ్యమైనది చూడు రాగగీతికను.!

దరికిరానీయబోకు దయలేని క్రిమిని
అన్ని వైపుల వచ్చె యవని నాశముకు
కాటు వేయుట కొరకు కాచుకొనుండు
రమ్యమైనది చూడు రాగగీతికను.!

వ్యాక్సినే లేక జబ్బు వరదలా పెరిగె
కొత్తగా పుట్టుకొచ్చెనుగ కొరొన మరింత
కేసులు పెరిగె మనకు కీలక మాయె
రమ్యమైనది చూడు రాగగీతికను.! ..

వైరసు నలుదిక్కులకు వ్యాపించెనిపుడు
గుబులురేపెను జీవి గుండె జారెనుగ
జాగరూకులై వుండు జాతికోసంబు
రమ్యమైనది చూడు రాగగీతికను.! .

అంతట విషపు దాడి హద్దులేదాయె
ఆపుట తరము కాక యందరు చూడ
చిన్న జీవి చేసేటి చిత్రమును చూడు
రమ్యమైనది చూడు రాగగీతికను.! .

వ్యాధిసోకనీ కుండ వైదొలుగింక
కఠిన కర్కశ జీవి కాలయముడిగను
మారి మనలను చంప మహిన యడుగిడె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

తరలి వూరును చేర తాపత్రమాయె
లాకుడౌనుతో మరల :రావడమాగె
తిరుగుటను మాని వేయు: తిప్పలు పడకు
రమ్యమైనది చూడు రాగగీతికను.!

మంచిగుణము నెపుడు :మహిలోన మిన్న
డబ్బు లేకను జనులు :జబ్బులు పడిరి
కరోన కాలము లోన కఠినమే యన్ని
రమ్యమైనది చూడు రాగగీతికను.!

మంచి పనులను నీవు మానక చేయు
ఆస నములను వేయు: అధికముగాను
ఒప్పు చుండు నదియు యుక్తము గాను
రమ్యమైనది చూడు రాగగీతికను.!

శుభ్రత పాటించ వలెను శుచిగాను యెపుడు
దరికి వచ్చును కరొన: దాడి చేయ
పసుపు నీరును తాగు:పదిలమే యింక
రమ్యమైనది చూడు రాగగీతికను.!

తరుచు యావిరి పట్టు : తాగువేడిగను
సూక్ష్మ జీవి చచ్చె:సులువు గాను
పదిలముండుటే మందు పౌరుషంబొలదు
రమ్యమైనది చూడు రాగగీతికను.!

జనుల జీవితమంత జాతర చేసె
గుబులుపుట్టించె నిపుడు గుండె జారెనుగ
బయట తిరుగవలదుగ భాధ్యత మరచి
రమ్యమైనది చూడు రాగగీతికను.!

మరణముల రేటు నేడు మరి కాస్త పెరిగె
కోవిడొచ్చిమనలను కుదేలుచేసె
నష్టమేయన్ని దిశల నరకమే బతుకు
రమ్యమైనది చూడు రాగగీతికను.!

వ్యాదు లన్నియు పోవు వరుసగానిపుడు
చేయు ధ్యానమెల్లరును మేలునిచ్చునుగ
శుభము నిచ్చును యోగ :సుఖము గాను
రమ్యమైనది చూడు రాగగీతికను.!

ఆసనములన్నియు వేయు: యధిక ముగాను
ఒప్పు చుండును మనకు యుక్తమవగ
దరికి రాదు కరోన: దాడిని చేయ
రమ్యమైనది చూడు రాగగీతికను.!

కక్ష గట్టియు వచ్చె:కామినాలకరొన
అడుగుబెట్టెను కాద:యవనియందు
కలిమిలేములుయనక:కాటికిజనులను
రమ్యమైనది చూడు రాగగీతికను.!

చేటును తెచ్చెగ మనకు:చేసిన కీడు
ఇష్ట మొచ్చిన తీరు:నీచపు పనులు
పాప మనకజే సితివి పాడు పనులను
రమ్యమైనది చూడు రాగగీతికను.! ఔ

విషమ సమయము వచ్చె విపరీత మాయె
చేయుటకు పని లేక చేతులు ముడియ
వలసవచ్చిన బ్రతుకు:వడిదుడుకాయె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

కరుణ లేని కరోన కాటికి తోడు
లేక మరింత గుబులు రేపె జనులకు
చిద్విలాసము చేసె చివరకిదనియె.
రమ్యమైనది చూడు రాగగీతికను.

ఊరుకానిస్థలమున :ఉనికిలేదాయె
పుట్టు కొచ్చెను జీవి పుడమిలో నుండి
జాతినంతయు భ్రష్టు సలపగా వచ్చె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

కరోనతో వచ్చు ముప్పు కఠినమై నిలిచె
బయట పడునట్టి దారి:బాగుగ నెతిగి
జాతి నంతయురక్ష:జాగ్రత్త తెలిసి
రమ్యమైనది చూడు రాగగీతికను.!

కాలమే చెప్పు బదులు కరోన రాక్షసికి
సూక్ష్మజీవియు నుండి:సులభము గాను
బయటపడుదారిలేక భయమెక్కువాయె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

మనిషి చేసెడి పనులు: మంచిగ లేక
ఎంచ రానివి పనులు: ఎన్నియొ చేసి
వగచి విలపించ గాను :వచ్చెను నేడు
రమ్యమైనది చూడు రాగగీతికను.!

రైలు బండియు వచ్చె:రాకలు పెంచె
వలసజీవుల కింక:వనరులు కుదిరె!
లాకు డౌనిక తగ్గ:లక్షణ మెచ్చె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

శ్వాస మీదనె ధ్యాస:శాకహా రంబు
ఆర గించిన యెడల:హాయిగ నుండు
యోగ సాధన సేయ :యోగదా యకము
రమ్యమైనది చూడు రాగగీతికను.

అవని నాశము చేయ యాపద వచ్చె తనను
కాపాడ తలిచి తల్లి భూమాత
కరోన రూపము లోన కాటును వేసె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

దిక్కు మొక్కుయు లేక:నీరసమాయె
కరోన మనుషులనంత కదలకుండ చెసె
మనము చేయు పనియు మనల ముంచె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

ఆసుపత్రులన్ని నిండె యాపద పెరిగె
మరల లక్షణమింక మార్చెగ కరొన
అంతు చిక్కక పోయె యంతమే చేసె
రమ్యమైనది చూడు రాగగీతికను.

కరోన తెచ్చెగ నేడు కష్టకాలంబు
బ్రతుకుబండిని లాగ భారమాయింక
గమ్యస్థానము చేర గతులకోసంబు
రమ్యమైనది చూడు రాగగీతికను...!

కరోన తొలిగిన నాడు కష్టము తొలుగు
జీవనచక్రముసాగు శుభ్రముగానిపుడు
పేద వారి బతుకులు బాగయ్యె నేడు
రమ్యమైనది చూడు రాగగీతికను...!

మనుజజాతికి నేడు:మరణభీతింక
కంటి మీద కునుకును :మంట కలిపె
విస్మృతము చేసె జీవి విషము గుప్పించె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

పారదోలగ రండి పాడు కరొనను
మాస్కుధరించు యెపుడు మంచిగా నుండు
దరికి రాదుగ కరొన తరలిపోయెనుగ
రమ్యమైనది చూడు రాగగీతికను...!

బీద ధనికను లేక:బిర్రుగా తిరిగి
చంపుచుంటివి నీవు:చల్లగానిపుడు
కరుణరహితము జీవి :కఠినము కరొన
రమ్యమైనది చూడు రాగగీతికను.

తమకు తామెమనుషులు:త్రవ్విరి గోతి
పుట్టు కొచ్చెగ కరొన పుడమి నుండి
జాతినంత భ్రష్టు సలపగా వచ్చె
రమ్యమైనది చూడు రాగగీతికను.

ఆరు గాలముచేసె యన్నదాత శ్రమ
కరోన తోడ వానొచ్చి కష్టంబు చేసె
రైతు బతుకింక మునిగె :పైరు పాడాయె.
రమ్యమైనది చూడు రాగగీతికను.

అరకొరవసతి తోడ :యాగమాగంబు
వలస జీవుల బతుకు వ్యథలాయింక
బాటసాగకపాయె :భయమింక పెరిగె
రమ్యమైనది చూడు రాగగీతికను.!

గుంపుకూడ వలదు:గుర్తుకొని నడువు
కరోన తోడ కలదు:కఠిన హాని
దూరదూరమున్న:దురితంబుతొలిగి
రమ్యమైనది చూడు రాగగీతికను.

దూరదూరమున్న:దురితంబుతొలిగి
విషముజిమ్ముపురుగు:విరుగుడు యగును
వలసజీవికి నేడు:వనరు దొరికెను
రమ్యమైనది చూడు రాగగీతికను.

– బండారు సునిత
9440671530

## ఇల్లాలు , నీకు జోహార్లు

కరోనా భయం తో ప్రపంచమే
ఇంటిలో బందీ అయిన వేళ
అందరి అలకలు మోసేది నువ్వే
కోపాలకు బలయ్యేది నీ మనసే
అయినా
ఇంటికి ఓదార్పు నువ్వే
కల్లోల ప్రపంచంలో కాంతులనిచ్చే
వెలుగువి నువ్వే
దేవత నువ్వే
బాధిత రోగులకు బాసట గా
నిలిచే భరోసా నువ్వే
తీర్చలేని రుణం నీది
విడదీయలేనిఅనుబంధమిది
ప్రేమతో పలకరిస్తావు
స్నేహం తో చేరదీస్తావు
తప్పులెన్ని చేసినా
కోడి కూత కూయక ముందే నిద్రలేచి
ఇంటి పనులన్ని చక్కబెట్టి
వంటలన్నీయు ఓర్పుతో చేసి
పిల్లలను లాలించి బుజ్జగించి
అయ్యవారికి మర్యాదలు చేసి
బండెడు చాకిరి భారమనక
ఇంటిల్లిపాదికి సేవలు చేస్తూ
సగం రోజు గడిచినా
తినడానికి తీరికలేని
నిరంతర ఉద్యోగైన ఇల్లాలా
నీకు జోహార్లు
కాలంతో నీకు పని లేదు
కరోనా సంగతులు అక్కర్లేదు
రవి చంద్రులవలె నీ గమనం
అలుపెరగని పయనం
విశ్వానికి విశ్రాంతి దొరికినా
నీకు పని భారం తగ్గలేదు
మనిషి గా మన్నిస్తావు
మహాత్మునిగా మారుస్తావు
కరోనా అంతానికి పోరాడే
కదన వీరులకు చేయూతనిచ్చే
ఆది పరాశక్తి వి నువ్వే

## మీ నడక ఆగలేదు

నిత్యం కాలంతో పోటీపడి
పరుగులు తీసే మానవ యంత్రాలు
దిగుమతి చేసుకున్న కరోనా గాయానికి
కుదేలై ఇంటికే పరిమితవగా
మీ నడక మాత్రం ఆగలేదు
అంటు వ్యాధితో ముప్పని తెలిసినా
రోగులనే ఆత్మీయులు గా భావించి
కొన ఊపిరి ప్రాణాలను నిలబెట్టే
మీ కొండంత తెగువకు వందనం
విశ్వ విపత్తు కు తలవంచి
భూజల గాలి మార్గాలు
మూగబోయిన వేళ
చెరగని సరిహద్దు బంధనాలు
మూతపడి ఊపిరి పీల్చుకున్నా
గస్తీ తిరుగుతూ నియంత్రించే
విరామ మెరుగని రక్షక దళాలు
మీ నడక కు విశ్రాంతి లేదు
ప్రపంచమంతా పనులు మాని
ఇంటి పట్టున సేదతీరగా
చెత్తా చెదారాన్ని తొలగించి
మురికి కాల్వలను శుద్ధి చేసే
సఫాయి కార్మికుల సేవానిరతి కి
ఏమిచ్చి రుణం తీర్చుకోవాలి
దేశానికి గ్రహణం పట్టిన సమయాన
తేజోమూర్తులై బాసటగా నిలిచిన
మీ త్యాగఫలమే మాకు రక్ష
కరకు కరోనా అంతం కోసం
మీ నడక మాత్రం ఆగదు

## పక్షుల ముచ్చట

ఈ మనుషులు ఉన్నారే
మనలాంటి బలహీనులనే నిర్దాక్షిణ్యంగా
తరిమి తరిమి వెంట బడి కొడుతారు
వారి కంటే బలవంతుడు ఎదురు పడితే
తోక ముడిచి ఇంట్లో పడుంటారు
సమస్త ప్రకృతి సౌకర్యాలను సర్వం దోచేస్తూ
కృతజ్ఞతా హీనులుగా మారిపోయి
వాతావరణాన్ని విషతుల్యం చేసేస్తున్నారు
సాటి జీవులపై కనికరం లేకుండా
రాక్షసుల వలె చంపి తింటున్నారు
ఉపద్రవాలు వస్తే ఉక్కిరిబిక్కిరి అయ్యారు
అసలు దోషులం తామే నని ఏనాడు
ఆత్మవిమర్శ దిశలో పయనించలేదు
ఆకాశానికి నిచ్చేన లేసామని గర్వంగా
చెప్పుకునే మానవ మేధస్సు
నేడు అయోమయంలో మునిగిపోయింది
ఇంటి పైకప్పులపై అందంగా ముచ్చటించే
మన జాతిని విధ్వంసం చేశారు
శిథిలమైన స్వార్థపు పునాది గోడలపై
అతికించుకున్న మానవ సంబంధాలతో
నిత్యం బేరసారాలు కొనసాగించే
ఈ మనుషులు ఏనాటికి మారరు కదా
ఆశ్రయమిచ్చే అడవులను వదలక
ఆటవీ జంతువులను వేటాడిరి
పరిశ్రమల పుట్టుక తో అంతరించే అడవులు
కాలుష్యకోరల్లో చిక్కిన కాలచక్రం
గతి తప్పి విధులు నిర్వర్తించగా
చోద్యం చూస్తున్న ఈ లోకానికి
ప్రకృతి విలువ ఎలా తెలియాలి
అదేదో మాయరోగం వచ్చిందని
మన లాంటోళ్ల జోలికి రావడం లేదు
ఇప్పుడైనా అడవి తల్లి ఒడిలో
ఆడుతూ పాడుతూ హాయిగా
చిందులేసి కేరింతలు కొట్టుదామా
మన జాతి సంబరాలు
మనిషి కడప దాటే వరకే

## ఇప్పుడు ఏమి నేర్చుకున్నాము ?

కాసుల వేట కోసం కాలంతో పోటీపడి
మానవీయ మూలలను మరిచి
మర యంత్రాలు గా మిగిలిన మనం
ఇప్పుడేమి నేర్చుకున్నాము
ధర్మాసుపత్రి అంటేనే చీదరించుకునే మనకు
దేవాలయమై ఊపిరి పోస్తుందిప్పుడు
మాసి పోయిన కుటుంబ బంధాల
మాధుర్యాన్ని రుచి చూస్తున్నాము
ఇంటి బరువుని మోసే ఇల్లాలి
అద్వితీయ సేవలను గుర్తిస్తున్నాము
డబ్బే ప్రధానమని విర్రవీగే వారికి
అవి కాగితపు కట్టలని తెలిసింది
కోరలు చాచిన కరోనా విశ్వరూపానికి
ప్రాణాలపై తీపి పుట్టింది
విచ్చలవిడి తనం ఎంత ప్రమాదమో
పాశ్చాత్య దేశాలందించిన సంస్కృతి
మనకెన్నో గుణ పాఠాలు నేర్పింది
తల్లి లాంటి ప్రకృతి ఒడి
ఎంత కమ్మనిదో
ప్రపంచానికి ఇప్పుడు తెలిసింది
మనం మరచిన బాల్య స్మృతులు
మళ్ళీ యాది కొచ్చాయి
అంతరిక్షము లో అడుగు పెట్టిన
మానవ మేధస్సు ఇంకను నేలపైనే
ఉన్నదని కరోనా నిరూపించింది
సైనిక బలగాలు పెంచుకోవడం కాదు
శాస్త్ర పరిజ్ఞానం నేర్చుకోవాలని
దేశాలన్నింటికి జ్ఞానోదమైంది
కత్తి కంటే కలం ఎప్పుడైనా గొప్పదేనని
చిన్నప్పుడు గురువు చెప్పిన సూక్తి కి
శాస్త్రవేత్తలే సరైన ఉదాహరణ అని
అధినేతలకు అర్థం కావచ్చు
పెద్దలు చెప్పిన చాదస్తపు నిజాలే
మనకిప్పుడు బంగారు బాటలయ్యాయి
సాటి మనుషులకు సహాయమందించే
మానవత్వ గుణాన్ని నేర్చుకున్నాము
మనిషిగా ఇక నుండి ఎలా బతకాలో
కరోనా చక్కని దిశని చూపింది.

## ముసలవ్వ కడుపు తీపి

కరోనా కవిత వ్రాద్దామని కలం తీసుకుని
రాయడం మొదలు వెట్టిన
ఇంటి ముందు ఏదో అలికిడి
ఏమిటా అని బయటకి తొంగి చూసా
మూతికి బట్ట కట్టుకున్న ముసలవ్వ
అడగటానికేదో వచ్చినట్లుంది
కవిత ని పక్కనపెట్టి వెళ్ళిన
కను సైగ తోనే ఏమిటని అడిగిన
ముఖానికి మాస్కు తొడుగుకున్న నన్ను
మంచిగనే గుర్తువట్టింది ఐలమ్మ
సంటి పిల్లలు కండ్లల్ల ఉన్నరని
బస్సులెప్పుడు కుల్ల ఐతయని అడిగింది
బిడ్డ పిల్లలను ఆమె చూసి రావాలంటే
మూడు బస్సులు ఎక్కి దిగి రావాలే
ఇప్పట్లో కుదరదని సర్ది చెప్పి పంపిన
కాసేపు కండ్ల నిండ నీళ్లు తీసుకుని
కర్న కు అగ్గిబెట్ట అని తిట్టుకుంటూ
ముసలవ్వ ఏడ్సుకుంటనే వెళ్ళిపోయింది
సంటి పిల్లల్ని కనులార చూసేందుకు
ముసలి పానం రోజులు లెక్కపెడుతూ
ఒంటరై కడుపు తీపితో ఎదురుచూస్తుంది
లక్ష మందిని పొట్టన పెట్టుకుని
కోట్ల మందిని ఆగమాగం చేస్తున్న
ఈ ఉపద్రవం చల్లారేదెప్పుడు
విడిగా ఉన్న బంధాలు కలిసేదెప్పుడు
ఈ బస్సులు మోటార్లు నడిచేదెప్పుడు
మనుషుల మధ్య దూరం తగ్గేదెప్పుడు
పాత రోజుల మోఖం చూసేదెప్పుడు
ఆలోచనల వేడి సల్లారిన ఇమ్మటే
కవిత రాయడం మళ్ళీ మొదలు వెట్టిన
టీవీల్లో తాజా వార్త ఒకటొచ్చింది
సర్కారు పొడిగించింది లాక్ డౌన్.

## మానవాళి కనురెప్పలు

కరోనా రక్కసి ప్రళయ తాండవానికి
మానవాళి మనుగడ ప్రశ్నార్థకమైన వేళ
బాధితులకు కొండంత భరోసా నిస్తూ
ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తూ
చెరగని చిరునవ్వుతో బాధిత రోగులను
కంటికి రెప్పలా నిరంతరం కాపాడుతున్న
వైద్య రూపంలో ఉన్న నడిచే దేవతలారా
ఈ జగత్తు మీ ఋణం ఎలా తీర్చగలదు
ఆయువు ని రక్షించే ప్రాణదాతలారా
అవని అంబరాలు గర్విస్తాయి మిము చూసి

## మానవత్వపు గోడలు

శిథిలమవుతున్న స్వార్థపు పునాదుల పైన
మానవత్వపు గోడలు నిర్మించే సమయం
ఆసన్నమయినది
దీనావస్థలో కూరుకుపోయిన బాధితులకు
సాయమందించే చేతులు ముందుకు రావాలి
విధి వంచితులైన నిర్భాగ్యులకు
నీడ నిచ్చి సేద తీర్చే ధన వృక్షాలై నిలవాలి
పక్షులు తమ అస్తిత్వం కోసం
ఎంత వరకైనా తెగించి పోరాడుతాయి
హాని తలపెట్టితే జంతువులు సైతం
బలవంతులనైనా ఢీ కొట్టి ఎదిరిస్తాయి
సాటి మనుషులు సాయాన్ని అర్థిస్తే
స్పందించని మనిషిది ఒక
బతుకేనా
స్వార్థపు కోరలతో మూర్తీభవించిన
ధన మనసులు ఇప్పుడైనా ద్రవించాలి
మబ్బు పొరల్లో నిగూఢమైన
మనిషి తత్వాన్ని తట్టి లేపాలి
భూమాత శోక సంద్రంలో మునిగింది
ఆర్తనాదాలు అంబరాన్ని తాకుతున్నాయి
రక్కసి గాలిలో స్వైర విహారం చేస్తుంది
శవాలు కాల్చలేక అగ్ని కన్నీరు పెడుతుంది
కరోనా సృష్టించిన నిప్పురవ్వలను
నిలువరించక నీరు ఆవిరయింది
డాక్టర్లు వైద్యం చేస్తున్నారు
పోలీసులు మనల్ని రక్షిస్తున్నారు
శాస్త్రవేత్తలు తగిన ఔషధం కోసం
నిత్యం పరిశోధన చేస్తున్నారు
సఫాయిలు సిపాయిల వలె శుభ్రత కై
సేవలతో శ్రమిస్తున్నారు
ప్రమాదం పొంచియున్న పరిస్థితి లో
ప్రాణాలను లక్ష్యపెట్టక విధి నిర్వర్తించే
వారి గుండె నిబ్బరానికి
మనమేమిచ్చినా సరితూగునా
బాధిత జనాలకు సాయం చేయడం తప్ప
మనమేమి చేయగలం
అదైనా చేసి మనుషులనిపించుకోండి.

# జీవ కారుణ్యం (కథ)

రాము ,సోము ఒక యాత్రా స్థలానికి వెళ్లారు. అక్కడ రాము ఒక అర డజను అరటిపండ్లు తీసుకున్నాడు. అవి చేతిలో పట్టుకుని వేరే పండ్లను బేరమాడాడు.అరటిపండ్లు ప్రక్కన పెట్టి జేబు లోని డబ్బులు తీస్తుండగా అకస్మాత్తుగా ఒక కోతి ఆ అరటిపండ్లను ఎత్తుకుని పోయింది. వెంటనే రాము ఒక బండరాయి తీసి కోపంతో ఆ కోతి పైకి విసరివేశాడు. కోతి తప్పించుకొనడంతో ఆ రాయి ఒక ముసలి తాతకు తగిలి గాయమైంది. అతని బంధువులు రాము దగ్గరకు వచ్చి కోపంతో అతడిని కొట్టబోయారు. వెంటనే ఒక వ్యక్తి వారిని వారించాడు. రాము తాను కోతిని కొట్టడంతో ఆ రాయి పొరపాటుగా తగిలిందని చెప్పాడు .వారు చివరికి అతనికి వైద్య ఖర్చులు ఐదువందల రూపాయలను భరించమని అన్నారు. రాముకు ఒప్పుకోక తప్పలేదు. అరటి పండ్లు పోయి, డబ్బు పోయి, రాము లబోదిబోమన్నాడు.

సోము కూడా రాము లాగే వేరే కొట్టులో అరటిపండ్లు కొని, ప్రక్కన పెట్టి ఇతర వస్తువులను కొంటున్నాడు . ఇంతలో మరో కోతి అరటిపండ్లను ఎత్తుకొని వెళ్ళింది .సోము ఇతర వస్తువులను కొని మరికొన్ని అరటి పండ్లు కూడా కొని అక్కడినుంచి వెళ్ళసాగాడు. ఇంతలో అరటిపండ్లు ఎత్తుకెళ్లిన కోతి అవి తిని ఆశగా సోము వైపుకు చూసింది. సోము వెంటనే మిగతా అరటిపండ్లను కూడా దానికి వేశాడు. వెంటనే చెట్టు పైన ఉన్న ఆ కోతి తన చేతిలో ఉన్న డబ్బుల సంచి సోము పైకి విసిరేసి అరటి పండ్లను తీసుకొని వెళ్ళింది.ఆ సంచీలోని డబ్బును లెక్కించగా అందులో ఐదు వేల రూపాయలు ఉన్నాయి. సోము ఈ డబ్బు ఎవరిదని అందరిని అడిగాడు. ఎవరూ జవాబు ఇవ్వలేదు . అప్పుడు అక్కడ గుమికూడిన వారు "చూడు బాబూ! ఈ కోతికి కడుపు నిండుగా అరటి పండ్లు పెట్టావు. అది నీకు డబ్బులు చెల్లించింది. ఆ డబ్బు అందుకే నిజంగా నీకే చెందుతుంది" అని అన్నారు.

ఇంతలోకే అక్కడికి వచ్చిన రాము వచ్చిన తనకు ఎదురైన సంఘటనను వివరించాడు. ఎప్పుడూ జంతువులను కొట్టవద్దని, అవి ఆకలైతే తప్ప మన దగ్గర ఉన్న ఆహారాన్ని తస్కరించవని సోము అతనికి చెప్పాడు. సోము తనకు ఎదురైన సంఘటనను చెప్పి రాము ఖర్చు పెట్టిన వైద్యఖర్చుల డబ్బు ఐదు వందల రూపాయలు ఆ సంచిలో నుండి తీసి అతనికి ఇవ్వబోయాడు.

ఇంతలో ఒక వ్యక్తి అక్కడకు పరిగెత్తుకుంటూ వచ్చి ఆ సంచీ తమ యజమానిదని గుర్రం పైన ఉన్న వ్యక్తిని చూపించాడు .వెంటనే సోము రాము దగ్గరనుండి 500 రూపాయలు వాపస్ తీసుకొని ఆ వ్యక్తికి ఇచ్చాడు. ఆ వ్యక్తి దానిని తీసుకొని వెళ్లి గుర్రంపైన ఉన్న తన యజమానికి ఇచ్చాడు.ఆ యజమాని దానిని తీసుకుని తిరిగి ఆ సంచీని సోముకు ఇస్తూ "ఇదిగో !నిన్ను పరీక్షించడానికే ఈ నౌకరును పంపాను. ఈ బహుమతికి నీవే అర్హుడవు. జంతువులకు పండ్లుకొని పెట్టడం, వాటిని ప్రేమగా చూడడం నీ వద్ద నుండి నేను కూడా నేర్చుకున్నాను" అని అన్నాడు. సోము తనకు ఆ డబ్బును వద్దన్నాడు. అయినా ఆయన వినకుండా దానిని సోముకు ఇచ్చాడు. సోము దాన్ని గ్రహించి రాముకు ఇవ్వబోగా రాము తాను ఆ బహుమానానికి అర్హుడను కానని నిరాకరించాడు.

అప్పటినుండి రాము జంతువులను ప్రేమగా చూడడం మొదలు పెట్టాడు . గుర్రం పైన ఉన్న యజమాని తాను గ్రామాధికారిననీ, జంతువులను ప్రేమగా చూసినవారికి, వాటిని పెంచిన వారికి ఐదు వేల రూపాయల బహుమానం ఇస్తానని, ఇప్పుడు సోముకు కూడా ఇచ్చానని అందరి ముందు ప్రకటించాడు. అప్పటి నుండి ఆ గ్రామం జంతువుల ప్రేమకు నిలయమై కీర్తి కెక్కింది.

–సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
మొబైల్: 9908554535.

# గుర్తుందా మరి

-స్వాతీ శ్రీపాద
8297248988

ముసురు పట్టిన ఆకాశం
వెలుగునూ వేడినీ మింగి
కొండ చిలువలా వెల్లకిలా పడుకున్న రోజులు
ఉన్నట్టుండి ఒళ్ళు విరుచుకున్న క్షణాల్లో
లేత చీకటీ మసక మబ్బుల మధ్య
మెరుపు కత్తులు దూసి సాగుతున్న యుద్ధం
రాక్షసదంతాలను కొరుకుతూ ఉరుము ఉరిమి
ఉన్నట్టుండి జిగేల్మని కుదిపేసే పిడుగు రాళ్ళ విసుర్లుగుర్తుందా
లోలోపలి భయాలేవో అర్జునా ఫల్గుణా అని
మౌనంగా పలవరిస్తూ
శ్రీకృష్ణుడు చీరలు సమకూర్చినట్టు
కనిపించని అరచెయ్యేదో ఆపుతుందన్న ఆశ.
కథలు కథలుగా విన్న అద్భుతాలు మనకూ దక్కాలన్న కోరిక
నవ్వుల మధ్య పువ్వుల మధ్య కాగితప్పడవల కలల మధ్య
జీవితాన్ని వడబోసుకున్న అమాయకత్వం గుర్తుందా
చినుకులు చినుకులుగా రాలి వడగళ్ళ పూల వాన
కాస్త కాస్త కరుగుతూ
ఇంటి ముందు పూరెక్కల తెల్లదనం పరచినపుడు
అరచేతుల మధ్య ఆణి ముత్యాల్లాఏరుకున్న క్షణాలు
ఎక్కడ ఇంకిపోయాయో
ఏ నాలుక చివర కరిగి నీరయాయో గుర్తుందా?
మిట్ట మధ్యాన్నం వేడి భగభగల మధ్య
ఊరుఊరంతా అర్థరాత్రిలా మాటుమణిగినప్పుడు
చీరలూ పంచెలూ చుట్టుకు నాటకాలాడిన బాల్యం
ఏదీ ఏమూల మొహం దాచుకుంది
నవ్వొస్తుంది
ఇప్పుడు నట్టింట పిడుగులు పడినా
అర్జునుడు గుర్తుకు రాడు.
మంత్రాలకు చింతకాయలు రాలవని తెలుసు
పైన ఓపలేని నిండు మేఘాల పొట్టలు పగిలి
నదులు నేలకు ప్రవహించినా
రెక్కలు విరిగిన మనుషులు కాళ్ళకు సంకెళ్ళు తగిలించుకు
నడిచివచ్చిన దారులు తలచుకుంటూ
కుములుతూ కములుతూ
చుట్టు వస్తున్న ఏకాకితనం కమురువాసనలో కనలుతూ
దారి కనపడని చూపైనా.
చీకటి చరిత్ర పుటలు ఒకదానివెనక ఒకటి
దరీ దాపూ లేకుండా రెపరెపలు కలవరిస్తున్నా
స్వర్గాలు కూలిపోయిన శిధిలాల మధ్య
కనిపించకుండా పాకుతున్న చాపకింద నీరులా వికటజీవి
గడప గడపా తొక్కి తలుపు తలుపూతట్టి
ఉన్నట్టుండి శీతల హస్తమవుతూ
ఏం గుర్తుండాలి? కన్నీళ్ళు కడిగేందుకు
చెమ్మగిలిన చూపులే కావాలి
నువ్వూ నేనూ మధ్య
దారులు తక్కువేమీ కాదు
నువ్వూ నేననే తత్వం ఒకటి గుర్తుందా?
నువ్వే నేననే మాట పలికిందా వేదవాక్కై
గుర్తుందా మరి.

పుస్తక సమీక్ష

# జ్ఞాపకాల చెలిమెకు స్వాగతం

బాల్యంనుండి పరిశీలనా దృష్టిని కలిగి తాను పరిశీలించిన విషయాలను ఉన్నది ఉన్నట్లుగా చెప్పే నైపుణ్యం ఈ కవితా సంపుటికి వేదికైందని తడిగొప్పుల కుమార్ చెప్పుకున్నది వందకు వంద శాతం నిజం అన్నది ఆయన కవితా సంపుటి జ్ఞాపకాల త్రోవలో అగుపిస్తుంది. ఆయన చూసిన దృశ్యాలు,విన్న అంశాలు,స్వీయ అనుభవాలకు ప్రతిరూపాలు ఆయన కవితలు. ఆయన ప్రతి కవిత మన సంస్కృతిని మన ముందుంచుతుంది. గత వైభవాలను జ్ఞప్తికి తెస్తాయి. సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ఉత్తేజితులైన కుమార్ గారు ఈ కవితా సంపుటిని మన ముందుంచినందుకు ముందుగా ఆయనను అభినందిద్దాం.



నిరుపేద కుటుంబానికి చెందిన కుమార్ తెలంగాణ యాసలో జానపదులు వాడే పలుకులను వాడుతూ జానపదుల వృత్తులను, వారి బతుకులను మనకు పరిచయం చేసే ప్రయత్నం చేశారు.

**"మర్యాదను చూపుతూ/పరిశుభ్రతను పెంచుతూ/సుట్టాలకు పక్కాలకు పట్వాలో/నీళ్ళిచ్చి కాళ్ళు కడుక్కోమని చెప్పి/కళ్ళనీళ్ళు తీసి కడుపారా ఏడ్చి/కష్టసుఖాలడిగి బాధల్ని పాపేది/దిగులంతా దిగేది అంపుల్ల తావుల్లో"** అంపుల్ల గురించి తెలుపుతూనే ఆధునిక నాగరికతప్రభావాన్ని **"వాస్తు పేరిట వంటిల్లు వచ్చెను/ఇరుకు గదుల్లో నేడు మెసలకుంటైతిమి"**విశదపరిచారు. "ఆయిటి పూనింది" దాతికాడ,రైతులు ,కొలిమికాడ మనుషులు మెదలడం,రైతులు ఇసిరెలు సిద్ధం చేసుకోవడం మొదలుగా పనులను కళ్ళముందుంచారు. మట్టివాసనను అత్తరుతో పోల్చడం కవితలో చక్కగా ఇమిడిపోయింది.

ఎనకటి పదాలు ఎరుకలేనోళ్ళమైనం మనం. నవనాగరికత పేరున మన సంస్కృతీ సాంప్రదాయాలను,పల్లెటూళ్ళలోని జీవనవిధానాలను మర్చిపోతున్నం."అడ్లోల్ల ఇంటికాడ ఎనకట సందడిగా ఉండేది. నాగళ్ళు ,బండి గీరెలు గుంటుకలకోసం వచ్చేవారు,పొయ్యిలకై చెక్కపొట్టు కోసం వచ్చేవాళ్ళు,పటేండ్లు పంపగా పని మీద వచ్చేవాళ్ళు,ఎవసాయంలో సలహా సంప్రతింపులకోసం వచ్చేవాళ్ళు,తీర్పాటం కోసం వచ్చి ముచ్చట్లాడేటోళ్ళు.."ఇలా అడ్లోల్ల దాతి తిరునాళ్ళుగా ఉండేదని తన కవిత "అడ్లోల్ల దాతి"లో సజీవ దృశ్యంలా మనముందుంచిన కవి నాటి ఆ కమనీయ దృశ్యాలు అంతర్ధానమయ్యాయనే ఆవేదనను చక్కగా ప్రకటించారు.

నేటి ఆధునికత ప్రవాహంలో అందమైన బాల్యం కన్పించకుండా పోయింది. మూడు సంవత్సరాలనుండి మోస్తున్న బరువు భావితరపు వెన్నుపూసని చిదిమేస్తుంది. పరుగెడుతున్న కాలంలో.. మనం పరుగెడుతూ పిల్లల బాల్యాన్ని వికృతపరుస్తున్నాము."ముంజకాయలతో బండ్లు,గోళికాయలాటలు,సైకిల్పయ్యతో పరుగులు,బావులలో ,చెరువులల్లో ఈతలు,సిర్రగోనాటలు,సినిమాకోసం అవ్వ అయ్యల బతిమిలాడుడు,కాదంటె అలుగుడు,ఆరుబయట నాయనమ్మ చెప్పిన కథలు,ఎండ్రికాయలు పట్టుడు,సోపతిగాండ్లతో సినిమాలు,షికార్లు అన్నింటినీ మళ్ళొకసారి?గుర్తుకు తెచ్చిండు బాల్యం కవితలో.

మా ఊరి ముఖద్వారానికి /కట్టని పచ్చని తోరణం"అంటూ తియ్యమామిడి పరిచయం చేస్తూ మర్వలేని మధురమైన జ్ఞాపకంగా మిగిలిందంటారు. వైద్యశాస్త్రం జనపదానికి అంతగా పరిచయంలేని ఆ రోజుల్లో పురుడోసిన మంత్రసాని గురించి తెలుపుతూ తన ఊరి ప్రసూతి వైద్యురాలు మంగలి కాంతమ్మను యాది చేసుకున్నారు.

**"అతను స్వేచ్ఛ అని అరిచే/సైరన్ మోతకి/తొలి కోడి కూతకి/గడియారం ముల్లుకి/బానిసతనమనే బంధీకి/జీవితకాలపు నేరస్తుడం"**టూనాటి దొరల ఆధిపత్యంలో అణగారిన బతుకులు పాలేరు జీవితాలని వివరిస్తూనే,నేడో రేపో తిరగబడతాయని హెచ్చరించారు. శత్రుమూకలనుండి దేశాన్ని రక్షించే క్రమంలో అమరులైన సైనికులకు"సాయుధుడు"కవితలో నివాళులర్పించారు.

**"వెయ్యేండ్ల చరిత్రను వల్లె వేసేది వయి"** అని తలెత్తుకునేలా చేసేది అక్షరమేనని స్పష్టపరిచారు.

"మండువ"లో గౌడన్నను కోర్టులో జడ్జిలా అభివర్ణించడం,గౌడన్న చేతివేళ్ళ మధ్యనుండి జారుతున్న సన్ననిధార శివుని జటల నుండి జారుతున్న గంగమ్మలా పోల్చటమే కాకుండా బాధల్ని మరిపిస్తూ బాధ్యతలని గుర్తుచేస్తూ బతకాలని చెప్పేదని మండువా గొప్పదనాన్ని విశదపరిచారు.

చింతచెట్టు కవితలో తల్లిలేని పక్షిపిల్లలను సాకేదని,ఎదురకోళ్ళకు మంచి విడిదిగా భాసిల్లేదని ఆ చెట్టుకింద శాలోల్లు బట్టలమ్మడం,కమ్మరోళ్ళు సొట్లుతీయడం,ఛత్రీల మరమ్మతులు జరిగేవని ఎందరికో చింతచెట్టు పేదరాసి పెద్దమ్మలా ఆసరాగా నిలిచేదని చింతచెట్టుంటే ఇంటికీ ఏ చింతలుండవని వ్యక్తీకరించడం అద్వితీయం.

తాను వచ్చింది ఎక్కడినుండి అన్నది మర్చిపోకుండా,తనకు జీవితాన్నిచ్చిన నాన్నను "మట్టిమనిషి"లో స్మరించుకోవడం కవి ఔన్నత్యానికి ప్రతీకలా నిలుస్తుంది. శ్రామికవర్గాల వెతలను ''కంచు నగారా''లో పరిచయం చేస్తే,ఎవరినీ యాచించక,ఒకరిపై ఆధారపడక గ్రామాన్ని పరిశుభ్రంచేసే పుల్లూరి మొండయ్యను ''పరిశుద్ధుడు'' కవితలో స్మరించుకున్నాడు.

కోపం లేని తత్వం బుద్ధుని శాంతం ఆప్యాయతే అతని ఆభరణమంటూ అందరిలో చిరస్మరణీయుడైన రాగయ్య సేటును,వూరి జనులకు ఆదరువు ప్రజా దర్బారు ఈ కచ్చీరు అంటూన్యాయవ్యవస్థకు ప్రతీకలా నిలిచిన కచ్చీరు సంగతులను అక్కడ నిర్వహించే భాగోతాలు,సాముగరిడీలు తదితర కార్యక్రమాలను మన కళ్ళముందు నిల్పాడు.

ఇలా జానపదుల జీవితాలతో పెనవేసుకున్న రొద్దు, శెలిమె, కొడవలి, కొలిమి, ఆకిలి, సవరం,బాపమ్మ ఒడిలాంటి తదితర అంశాలను స్పృశిస్తూ వారి గాథలను వెతలను,వేదనలను మారుతున్న ఆధునిక నాగరికత,యాంత్రిక నాగరికత ఏ విధంగా పల్లె జీవనంపై ప్రభావం చూపిందో పాఠకులకందించే ప్రయత్నంలో కవి తడిగొప్పుల కుమార్ కృతకృత్యులయ్యారనే చెప్పవచ్చు. ఈయన కవిత్వంలో తెలంగాణ పదజాల ప్రయోగం ,అనేక పదాలను అవలీలగా తన కవిత్వంలో అర్థవంతంగా చొప్పించడం,చక్కని పదబంధాల ప్రయోగాలు అభినందనీయం. ఈ సందర్భంగా వారు మరిన్ని కవితా సంపుటిలు వెలువరించాలని కోరుకుంటూ...

ప్రతులలకు:
కుమారస్వామి తడిగొప్పుల
1-67,మిర్జంపేట, శ్రీరాంపూర్ మం.
పెద్దపల్లి జిల్లా. సెల్: 8897413530
2 ంబిబీజీఇష్ట్రఎవనిబిబ

-డా. వైరాగ్యం ప్రభాకర్
9014559059

# పిసి'నారీ'



- డాక్టర్ శంకరనారాయణ
80083 33227

నేను ఎంత మంచి వాణ్ని !
నీవు ఎలాంటి దానివో చూడు
నేను దొరను
నిన్ను అలా చూస్తూనే ఉంటున్నాను
ఏం చేయమన్నా చేస్తాను
నీవు దొంగవు
నా మనసంతా
ఎప్పుడో దోచుకున్నావు అయినా నేను
నీ మీద కేసు పెట్టలేదు కదా!
నేను ఎంత దయామయుణ్ని!
నీవు ఎంత పిసినారివి!
మనస్సూ ఇవ్వవు ఏవీ ఇవ్వవు
నేను ఎంత ఉదారంగా ఉంటాను!
నీవు అడుగు డబ్బు అయినా
సబ్బు అయినా ఏమయినా ఇస్తాను
నీవేమో కాలం కన్నా ముందే
కరోనా కాలం కన్నా ముందే
Social distance Social distance
అని ఎంత గర్జించావు?
నా స్వేచ్ఛను ఎంత అరికట్టావు?
నీది చాలా సంకుచిత హృదయం.
అందులో నా ఒక్కడికే స్థానం ఉంది.
నాది ఎంత విశాల హృదయం!
నీతో సహా
ఎంతో మందికి స్థానం ఇచ్చాను.
ఇక ముందూ ఇస్తాను.
నీవు గొప్పా నేను గొప్పా
తేల్చుకుందాం రా .

# నిప్పుల పుక్కిలి

సూరీడు ఎండల్ని తాగి
నిప్పుల్ని పుక్కిలిస్తున్నాడు
ఎక్కడా గాలి అలికిడి లేదు
కనబడని మంటల్లోపడి
ఆత్మహత్య చేసుకున్నట్టుంది
వడగాలులన్నీ పెద్దపులుల్లా
మీదపడిపోతున్నాయి
గర్భాలు విచ్ఛిన్నమై పొలాలు
పగుళ్ల మృతశిశువుల్ని కంటున్నాయి.

పచ్చదనాల్ని సామూహికంగా
ఊపిరితీసిన పాపానికి
పుడమి ఇప్పుడొక నిప్పుల కొలిమి
శీతలఖడ్గాలతో నింగిని
తూట్లు పొడిచిన నేరానికి
వేసవిప్పుడు వడగాలుల బీభత్సం.

ఎప్పుడైతే నువ్వు
స్వార్థాన్ని తలకెత్తుకున్నావో
నీ రెండు చేతుల్నీ
గొడ్డళ్లుగా మార్చుకున్నావో
అప్పుడే ప్రకృతి నీ తప్పుల్ని లెక్కగట్టడం
మొదలుపెట్టింది
రేపు మంచు రాకాసి లక్ష చేతులతో
నీ మీద విరుచుకుపడొచ్చు
కాన్సర్ భూతం భూగోళాన్ని
ఒక్కవేటుతో కబళించొచ్చు!
ఎన్ని అర్జీలు పెట్టుకున్నా
బహుశా నీకు
క్షమాభిక్ష కూడా దొరక్కపోవచ్చు!

- సాంబమూర్తి లండ
9642732008

# మానవత్వం

మానవ"తత్వమే"..మానవత్వం
ఎందుకు విస్మరిస్తోంది... మస్తిష్కం.

గుండెలపై తన్నినప్పుడు పొందిన
తల్లిదండ్రుల ఆనందం...
నేడు వృద్ధాశ్రమంలో,
నడి వీధులలో
రోజులు లెక్కపెట్టుకుంటుంది
వారి విశాల హృదయం....

తోడబుట్టిన చెల్లికై..
అక్కకై తపిస్తున్న తన అన్నతనం ....
పరస్త్రీలలో సోదరిభావం
చూడలేకపోతుందే ఆ మగతనం...

యజమాని సేవకై
దాసోహం అయిన బానిసత్వం....
నలిగిపోతుంది ఈ జీవన
పోరాటంలో అనునిత్యం...

ధన దాహోర్తియై పరిగెడుతున్న
నేటి మానవ నైజం...
ఎందుకు చూడలేకపోతుంది
నిజాయితీలో ఉన్న నిజం...

పరాయి పాలనలో
ప్రజ్వరిల్లిన ఐకమత్యవీరత్వం....
ప్రాకులాడుతుంది నేడు
కుటిల రాజకీయ స్వార్థత్వం...

కుల మత జాతి భేదాలతో
కుళ్ళిపోతున్న ఈ సమాజం...
పుట్టుక చావు మాత్రమనే
నిజాన్ని విస్మరిస్తుంది మనఇజం...

కళ్ళముందే జరుగుతున్న
అన్యాయమారణకాండ హోమం....
కళ్ళున్నా గుడ్డివాళ్ళమంటుంది
ధృతరాష్ట్రుని వారసత్వం.....

ఓ మానవత్వమా....
ఎక్కడ నీ చిరునామా...
అంతులేని అగాధాలలో...
చిరిగిపోయిన పుస్తకాలలో...
గడిచిపోయిన చరిత్ర పుటలలో...
మహాత్ముల అస్తికలలో...
నలిగిపోయిన
హృదయాలలో వెతుక్కోవాల్సిందేనా....

నాగరికత ముసుకు వేసుకొని
నరకలోకం సృష్టిస్తున్నావు...
చాలు ఇక చాలు...
మేలుకో మానవత్వమా...
ఈ మనుషుల హృదయాలలో
మళ్లీ చిగురులు వేసి....
నరకంగా మారుతున్న...
నవసమాజాన్ని నందనవనం చేయుమా...

నీకూ ఇదే నా ఆహ్వానం ...
అందుకో నా ఈ సుమస్వాగతం....

-కల్పన దేవసాని,
9959270063.

# కలం

నా ఆయుధం పరిగెడుతుంది..
ప్రజాసమస్యలు తెలుపాలని..
నా గొంతు వినిపించమంటుంది.
బక్కచిక్కిన బతుకు బాగులని.

కరవాలం కదలమంటుంది..
కష్టాలున్న కర్షకుడి దరికి..
అడుగు ముందుకేయమంటుంది.
అట్టడుగు వర్గాల వైపుకి..

నడ్డి విరుగాగొట్టమంటుంది..
దోచుకు తినే దళారులను..
ముడ్డి వాయగొట్టమంటుంది..
మోసం చేయు మోసకారులను.

నిగ్గతీసి అడుగమంటుంది..
నిజాయితీ వైపు నిలబడి..
కడిగి పారేయమని చెబుతుంది.
బెదిరించే వాళ్ళకి తిరగబడి..

న్యాయముకై పోరాడమంది..
అన్యాయము జరిగినచోట..
అక్షరమనే ఆయుధం బూని..
బడుగు ప్రజలకు నిలువు బాసట..

-పసుల. శంకర్
9542181301

# గ్రామ బొడ్రాయి సాక్షిగా..!

సతికిల పడ్డ సన్నకారు రైతులు
చితికిపోయిన చిన్ని కర్షకులు
వ్యతల పాలవుతున్న వలస కూలీలు
కుమిలి పోతున్న పల్లె పుత్రులు !

చెమటతో చెలిమి చేస్తున్న కార్మికులు
సత్తువుడిగి క్షోభిస్తున్న శ్రామికులు
బక్కచిక్కిశల్యమైన వడ్రంగులు
నెర్రెల చెరువై పోతున్న చాకి రేవులు !

కత్తితో గోళ్లు గీల్లుకుంటున్న మంగలి
తుప్పపట్టిన కుట్టు మిషన్లతో దర్జీలు
చావు డప్పులతో పేద గూడెమన్నలు
గుడిసె తూట్లు లెక్కేస్తున్న మేదరన్నలు !

కొలిమి కుమిలి కమిలి..
అనాథలా పోతున్న అవుసులోల్లు
కాళ్ళ కింద నలిగిన మన్నులా..
ఊపిరాడక నరకయాతనలో కుమ్మరన్నలు !

భారంతో అలిసి ఒగిరి పోతున్న..
వ్యవసాయ కూలీ అతుకుల బతుకు
ఒడ్డున పడ్డ చేపలా గిలగిల..
కొట్టుకుంటున్న ముది'రాజు' ధీనులు !

బురదమయమైన ఎరుకలి బతుకులు
చెదలు పడుతున్న గౌడన్న మోకులు
ఆధారమే తెగిపోయిన సాలోల్ల దారాలు
బండి గిలక ఎగిరిపడుతున్న దీన రైతన్నలు
!

ఎక్కెక్కి ఏడ్చి ఎడారైన పల్లెతల్లి
జనవిస్ఫోటనంతో పెళుతున్న పట్నాలు
ముళ్ళు కర్ర పట్టే చేతిలో సెల్ తిప్పలు
నాగలి పట్టే చేతిలో ట్రాక్టర్ స్టీరింగులు !

పల్లె కట్టిన చీరకు అంటిన..
కూలాల మురికిని చాకిరేవుపై..
కసితో బండపై బాది శుభ్ర పరచాలె !

గ్రామ తలపై కట్టిన..
అసమానతల జడల ఉండలను..
మంగలి కత్తితో గుండి గీకాలె !

ప్రేమానురాగాల దారాలతో..
నేతన్న జన సింగిడి రంగుల చీరలు నేసి..
గ్రామదేవతకు అలంకరింపజేయాలె !

ముత్యాలమ్మ సాక్షిగా..
కట్ట మైసమ్మ దీవెనతో..
పోచమ్మతల్లి సల్లని ఒడిలో..
ఊరు వాడంతా పనిపాటలతో..
సంబరాల ఊయల్లో ఊగి తూగాలె !

-బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఇంపు - కంపు

ప్రతీ మనిషి
వీలయితే ..
కాదు కాదు ...వీలుచేసుకొని

సందడి చేయడానికి
సంతోషంగా ఉండటానికి
మనోధైర్యం ఇవ్వడానికి
మంచిని పంచడానికి
మనద్వారా ఇంకొకరి ముఖంపై
చిరునవ్వు నిలువడం కొరకు
ప్రయత్నించాలి
అది ఇంపు.

అంతే గాని,
బాధపడటానికి ,
కృంగిపోవడానికి ,
బాధపెట్టడానికి ,
చాడీలు చెప్పడానికి ,
అపార్థాలు చేసుకోవడానికి
కారణాలు కోకొల్లలు .....
ఇది కంపు ..??

-రామడుగు వేణుగోపాల్
97455930441

# ఉడుంపట్టు

సూర్యచంద్రులు
కాలంతో కుదుర్చుకున్న సంధి
రేయిపగలు

ఈ సంధి కాలంలో
మనిషి బతకాలి
బతుకునెప్పుడైనా తడిమి
తడి తడి జ్ఞాపకాలు తలుసుకున్నపుడు
పేగు బంధాల చావులు
బొచ్చెల మెరిస్తే
బొక్కలు కలుపుడు యాదికొస్తే
గుండె ధైర్యం చెదిరిపోతుంది
కానీ... ఏంజేస్తాం
గుండె రాయిచేసుకుని
యాదిమర్సుడు ఒప్పకపోయిన
కాలం తిప్పలను ఓర్సుకోకతప్పదు.

చావు
చేతుల చెయ్యిగల్పనికి
చెప్పులుతొడుక్కొని నీవైపే నడుస్తుంది
గిట్లాంటప్పుడు
ఉరికే నెత్తురుతో ఉత్తముచ్చట ఎందుకు
అనుకున్నదేదో కళ్ళముందే కదలాడినట్టు
పానం కొలికిలకు వచ్చి
బతుకు బనాయించకముందే
ఉడుంపట్టు పట్టి ప్రయత్నించాలి
ప్రయత్నమే ఊపిరి ఫలితమే బతుకు.

-జినుకల వెంకటేష్
9652092120

# "చూపు"లో

"రుబ్బురోలును" చూసినప్పుడల్లా
నువ్వే గుర్తొస్తావు
"బుజ్జిరోలును" చూసినప్పుడల్లా
నువ్వే గుర్తొస్తావు
"కొండరాళ్ళను" పగలకొట్టినప్పుడల్లా
"ఉలి"తో రాళ్ళు చెక్కుతున్నప్పుడు
చెట్టుకి కట్టిన
చిరిగిన, నలిగిన, మాసిన
"చీర" వూయలలో
పసికందుని చూసినప్పుడు
మండుటెండలో కాలుతోన్న పాదాలతో
తాగే నీటికోసం పరుగెడుతోన్న
శ్రమజీవిని, ఓచిన్నదాన్ని
అనేక రూపాల్లో ఉన్న
"శ్రమజీవుల్ని" చూసి చూసి
చెలించి, చెలించి
జ్వలించి,జ్వలించి
సమ సమాజం కోసం కలలుకంటున్న
వృద్ధుణ్ని- ఆశారాజుని
నాలుగుకూడల మధ్య నున్నపేదవాణ్ణి
సమాజం మరచిపోయిన వాడిని.

- సత్యం
సెల్: 9100495714

# ఆమె

ఆధారాపు దారం తెగి గాలిపటం రెపరెపలాడుతోంది
నూరేళ్ళ నమ్మకం వమ్ముచేసి గగనానికి ఎగసింది
కంటిరెప్ప కనుపాపను కాటేసి వెళ్ళిపోయింది
రేపటి శూన్యం కంటిముందు ఆవిష్కృతమయింది
కారుమబ్బులు తప్ప చినుకు జాడ లేదు
పిందెలలో పసరుతనాన్ని వీడని అమాయకత్వం
కాలం చేసిన గాయం తెలియని పసితనం
తల్లి కొమ్మ గుండెను ఆధారం కోసం హత్తుకున్నాయి
బాధ్యతల వలయం బరువును మనసులో నొక్కుకుని
ముల్లును దాచుకున్న గులాబీలా నవ్వింది ఆమె
చిరురెమ్మల భుజాల మీద చేతులు వేసింది
మీకు నేనున్నానన్న భరోసాను ఇచ్చింది
లోకపు పరిహాసింపులకు ఎదురొడ్డి నిలిచింది
సుడులను ఎదలో దాచి చిరునవ్వుల పంచింది
రెక్కలొచ్చిన పక్షులు దిక్కులు పట్టి ఎగిరిపోతే
జంట పక్షి వదిలిన కర్తవ్యాన్ని పూర్తి చేశానని
తృప్తితో నవ్వుకుందే గాని కుమిలిపోలేదు
పుడమి చేరిన నాటి నుంచి పృథివి వీడే వరకు
బంధాల చట్రంలో నవ్వుతూ పరుగులు పెడుతూనే ఉంది
ఊపిరి గగనాన్ని తాకే వరకు పోరాడుతూనే ఉంది ఆమె.

-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

# కలికాల మహిమలు చూడరా

మానవత్వాన్ని వదిలిన 'మనీ'షులు దగాను దరిచేర్చుకొని
తడి గుడ్డతో పీకలు కోస్తూ
ఆత్మస్తుతితో పరనిందతో పరుల గాయపెడుతూ పరమానందంతో
ఉన్న పాపుల భువన భవనం.

తిమ్మిని బొమ్మను, బొమ్మను తిమ్మిని చేస్తూ
టక్కుటమారా గజకర్ణ గోకర్ణ విద్యలతో
వాక్చాతుర్య పటిమచే అరచేతిలో
వైకుంఠం చూపే జగత్ కిలాడీల జగము.

శ్రీరంగనీతులు వల్లిస్తు మాటలతో మురిపిస్తు
ఆశల గుర్రం ఎక్కిస్తు దైవం పేరుతో బురిడిలు కొట్టి
పంగనామాలు పెట్టి పైసలకై పడిచచ్చే
దొంగ బాబాల బ్రతుకుతెరువు ఈ భూతలం.

స్వార్థచింతన పరమార్థమై వంచన మాటలే మంత్రాలై
తేనె పూసిన కత్తిని నాకించి నరుల నట్టేట ముంచే
మమతలేని మర మనుషుల నిలయం

మోసం ద్వేషమనే కవలలకు ఆయువు పోసి
అన్యాయ అధర్మాలకు అగ్రపీఠమేస్తూ నమ్మకాన్ని వమ్ముచేస్తూ
కుత్రకుయుక్తుల జిత్తులమారి నక్కల కారడవి.

ఈకారడవిలో విలువలనే భీజము మొలకెత్తి
న్యాయధర్మాలు మహా వృక్షమై మమత సమతనే
ప్రతిఫలాలు కాచేదెప్పుడో
ప్రజల్లో ఆనందమెప్పుడో ?

-డి. అమీర్
9642480702

# బాల్యం తీయని గుర్తు

బాల్యం గుర్తుకొస్తుంది
తియ్యని జ్ఞాపకాల
గని పొరలు తెర్చుకుంటున్నాయి
చేదు దొండకాయలు కోసి
చీపురు పుల్లలు విర్చి గుచ్చి
గుంటుకలు గొర్లు చేసి
తొలకరి వేళన నేలను దున్నిన
విత్తనాలు చల్లిన రోజులు గుర్తుకొస్తున్నాయి
సొప్పబెండ్లతోని బండ్లు చేసి
చేదొండకాయలను ఎడ్లుగా కట్టి
ఆడిన రోజులు
గిల్లి దండా ఆడి ఓడి
అల్లు అంటూ ఉరికిన రోజులు
వర్షాకాలం వాన వెలిసిన తర్వాత
కాలువలకు అడ్డుకట్టలు వేసి
బ్రిడ్జీలు కట్టిన కోతకు కూలిపోతే
మల్లి మల్లి కట్టిన బాల్యం గుర్తుకొస్తుంది
సబ్బు పెట్టెలకు అగ్గిపెట్టెలకు
రబ్బరు మూతలను టైర్లుగా పెట్టి
లారీలంటూ బస్సులంటూ రైళ్ళంటూ
పరుగులు తీస్తు పాటలు పాడుకున్న
ఆటలు ఆడుకున్న బాల్యం గుర్తుకొస్తుంది
సైకిల్ను తోసుకుంటు కైంచీ తొక్కుకుంటు
దండా ఎక్కి సీట్ తొక్కి
ఎత్తులను ఎక్కించి
మురిసిపోయిన రోజులు గుర్తుకొస్తున్నాయి
పలకా బలపం పట్టి
అ ఆ లు దిద్దిన రోజు
అమ్మ బడిలో చేర్చిన రోజు
పెన్సిల్,పెన్నుతో పేపరు పైన రాసిన రోజు
కూర్చున్న బడి గుడి గదులు
ఆడుకున్న ఆట స్థలం
ఓటములు గెలుపులు తరగని గని
జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి
బొమ్మలుగీసి బదులుగా
నోట్ బుక్ పేపర్లను తీసుకున్న
గుంపులు గుంపులుగా తిరుగుతు
ఒకరినొకరం తోసుకున్న తియ్యని జ్ఞాపకం
మదిలోన మెదులుతున్నాయి
బుడగ పండుగ రోజు ఎడ్లకు రంగులేసిన
దసర పండగ రోజు జమ్మి ఆకు పంచి
పాల పిట్టను చూసిన
సద్దుల బతుకమ్మ నాడు
చిమ్మన గొట్టాల్లో పాసికాయలు నింపి
వదినెలను మరదండ్లను
వరసైన వాళ్ళను
కొట్టి బుద్ధిలేనోడా అంటు తిట్లు తిన్న
హోళీ పండుగ రోజు కందెన ఒంటినింద
పూసుకోని పచ్చి కుంకుడు కాయలతో
పెద్ద వాగులో బండల మద్దు దగ్గర
గంటల కొద్ది తానం చేసిన రోజులు
పీరీల పండుగ రోజు
నిప్పుల గుండం చుట్టు
ఆశన్న ఊశన్న అస్సోయ్ ధూలా అంటు
ఆడి పాడుకున్న రోజులు
ఆలాయ్ బలాయ్ తీసుకున్న రోజులు
జాజరి పండుగ రోజు కోలలు కొట్టిన
కాముడి పండుగ రోజు కోలలను కాల్చిన
సంక్రాంతి రోజు
చేసిన చకినాలు తీసుకొని
జొన్న చేను కాపలకెల్లి పైమంచె ఎక్కి
వడిసెలను గిరగిర తిప్పుతు పిట్టల కొట్టి
అటుకుటెన్నులను కాపుకొని
జాడు చొప్పును పీక్కోని మోపుకట్టి
నెత్తిన పెట్టి తెచ్చి
లాగెదూడలకు వేసి మేపిన రోజులు
సుక్కపొద్దు జాము లేసి
ఎడ్ల బండి కట్టుకోని
ఇసుక మట్టి రాళ్ళు ఐదు త్రిప్పులేసి
ఇంటికొచ్చి మొఖం కడిగి అంబలి తాగి
గట్క తిని నాన్నకు అప్పుడప్పుడు
పని సహాయం వ్యవసాయం సహాయం
చేసిన చిన్ననాటి జ్ఞాపకాలు
గుండె తలుపులను తెరుస్తున్నాయి
నాన్న నన్ను చూసి సంబర పడ్డ
సంతోష పడ్డ దినాల
బాల్యం గుర్తుకొస్తుంది
బాల్యం స్మృతులు తరగనివి
చిన్ననాటి జ్ఞాపకాలు చెరగనివి
ఒక్కసారి బాల్యంలోకి జారిన వేళ
ఆ తియ్యని జ్ఞాపకాలను తనవి తీర
నా కలం అక్షరాలను కూర్చి
పదాలుగా పేర్చి కవితగా మార్చి
మీ అందరి దగ్గరకు చేర్చుతున్న
నా తరగని బాల్యపు గని కానుకను.

-ఉప్పెన
8106073661

# పర్యవసానం

రోజంతా కాయకష్టం
సాయంత్రం కల్లు పాకలోనో
సారాయి దుకాణంలోనో
ఒళ్లు తెలీకుండా తాగి
ఉన్న డబ్బులు
కాస్త ఊడగొట్టు కోవడం.

తూలుతూ ఇల్లు చేరడం
భార్య ను పిల్లలను చితకబాదడం
గుర్రుపెట్టి నిద్ర పోవడం
మళ్లీ తెల్లారగానే షరా మామూలే.

మార్పులేని దినచర్య
మార్పు లేని జీవితం
ఇల్లు ఒళ్లు గుల్ల చేసుకోవడం
ఎవరు ఎంత నచ్చచెప్పిన
పెడచెవిన పెట్టడం.

వ్యసనం మానుకోమని
కుటుంబం కూలగొట్టుకోవద్దని
ఎన్నిసార్లు హితవు చెప్పిన
వినకపోగ కలహాలు పెట్టుకున్న
సందర్భాలు
చుట్టుపక్కల వారిని
నిందించిన సందర్భాలు
బంధుత్వాలు మంటగలిసిన
తెలుసుకోని మూర్ఖత్వం.

మత్తు లో మునిగితేలుతూ
ఇల్లు చేరి భార్య మాటలు
రుచించిక ఇంటిపైకప్పు తీసి
పెట్రోలు వెదజల్లి
నిప్పుపెట్టిన క్రూరత్వం
భార్య పిల్లలు బంధువులు
మొత్తం అరడజను మంది
ఊసురు తీసిన సంఘటన
మానవత్వానికే మచ్చ
తెచ్చిన సంఘటన.

ప్రభుత్వానికి ఆదాయవనరు
పేదవాడి జీవితంతో చెలగాటం
ఆరోజు దూబగుంట మహిళల
పోరాటం ఈరోజు మళ్లీ అవసరం
లాక్ డౌన్ లో కూడా
ఏరులై పారిన మద్యం
మద్యం దొరకనివాళ్లు శానిటైజర్ తాగి
ప్రాణం పొగొట్టుకున్న
అభాగ్యులకు దిక్కెవరు
బెల్టు షాపులు మూస్తామంటూనే
ఎక్సైజ్ సుంకం రాబట్టుకునే
ప్రభుత్వాలు
ఎలామారతాయి మత్తులో
చిత్తైన పేదల జీవితాలు?

-అరుణ డేనియల్
9000606889

# చెట్టే-పట్టు

బుట్టెడు మందారాలను
పూయించిందెవరు?
పుట్టెడు మరుమల్లెలనూ
పుట్టించిందెవరు?
పిడికెడు ధాన్యపు గింజలు
పిలచిచ్చిందెవరు?
గంపెడు చిరుధాన్యాలను
పంపించిదెవరు?
గెలల కొలది ఫలాలను
తినిపించిదెవరు?
మందూమాకులనుకొన్ని
మనకిచ్చినదెవరు?
మేఘాలను రప్పించి
చినుకిచ్చినదెవరు?
ప్రాణావాయు కోశాలై
బ్రతికించినదెవరు?
మారణహోమాలనెల్ల
మట్టుబెట్టునెవరు?
ఎవరు?ఇంకెవరు??
ఎదుగు కొలది ఒదిగియున్న
చెట్టేమన పట్టు!
నేల నుదిటి బొట్టు!

-కిలపర్తి దాలినాయుడు
7780589336

# బతుకుబాధ్యతొక్కటే

పుట్టగానే
కన్నీళ్ళ ఆహ్వానం
గిట్టేవరకు
కాలతివాచీలా పర్చుకుంది
అగ్నిసాక్షిగా
ఈడదాన్ని ఆడదాన్నైతేనే
బతుకు బడభాగ్నియైన
భరించాలనే నిర్వాకం.

పుట్టినిల్లు మెట్టినిల్లు
జోడికితోడుగా నిలవాలి
తోడునీడగా మారాలి
భార్యభర్తలిద్దరైనా
బతుకుబాధ్యతొక్కటనే
సంసారామృతం పంచాలి.

సమస్యనో సంవేదనో
సందర్భమో సంఘటనో
సంసారసాగరంలో
సుడులుతిరుగుతూసుడిగుండాలై
సునామీలాముంచెత్తుత్తాయి.

ఉద్వేగాలు క్షణికం
ఉజ్వలభవితే శాశ్వతం
సహనంతో మెలగాలి
సమన్వయంతో సాగాలి
సౌఖ్యంగా జీవించాలి

-జినుకల వెంకటేష్
9652092120

## మనిషి +మనుగడ ..

జీవితం అనిర్వచనీయం
చిత్రవిచిత్రాల సమ్మేళనం
జీవితం వాస్తవమా అన్నది
అందరూ విశ్వసించే భావన
కాలచక్ర భ్రమణమే జీవితం
దృశ్యాదృశ్య మధ్యన నడిచే నాటకం..
జీవితం.
ఒకరి సుఖం మరొకరు ఆస్వాదించలేరు.
ఒకరి బాధ మరొకరు అనుభవించలేరు
జీవుడు తను నిర్మించుకున్న
రంగుల ప్రపంచంలో
కలలుకంటూ జీవిస్తాడు
జీవిత నాటకం ఒక రసాను భూతి
సుఖాలు దుఃఖాలు ఆనందం అనుబంధం
కాలగమనంలో కలిసిపోతాయి
ఈ జీవితం అంతా మాయ
ఏది సత్యమో అసత్యమో
ఏది నిత్యమో అనిత్యమో
నిరంతరము అన్వేషణ
సత్యం అనే పదానికి
శాశ్వతత్వం లేదు సత్యంమిధ్య
ఎప్పటికీ ఏది మంచిదో అదే నిజం
అందరి మనస్సులో
అదే ప్రశ్న అంకురిస్తుంది.
సర్వవ్యాపియైన అంతర్యామి ఒక్కడే !

–రసస్రవంతి " & " కావ్యసుధ"
9247313488.

## విను నేస్తం

నన్ను పొగడవోయ్
నాతో మాట్లాడవోయ్
నా పక్క నుండవోయ్
నాకేసి చూడవోయ్
యెందుకంటావ్ నేస్తం
యెందుకంటావ్
ఒకప్పుడు నూరేళ్ళ జీవితం
ఇప్పుడు, ఇప్పుడు
ఓ నిమిషం
ఏ నిమిష్టం నేస్తం
ఓ జీవితం
నిన్ను నువ్వు ప్రేమించుకో
అనేదో వేదాంతం!
అందుకే
ప్రేమించుకుందాం
మాట్లాడుకుందాం
నిరాడంబరంగా
హాయి హాయిగా
జీవితం ఓ నిమిషం
అర్థం చేసుకో నేస్తం
అర్థం చేసుకో.

– సత్యం
సెల్: 9100495714

## మనిషే!

నక్కలా వినయం చూపుతాడు!
కుక్కలా విశ్వాసం నటిస్తాడు
గంగిరెద్దులా అన్నిటికీ తలాడిస్తాడు
పిల్లిలా కళ్ళు మూసుకుని వ్యవహరిస్తాడు!!

తిట్టినా.. దున్నలా చలించడు
కొట్టినా.. చెప్పుకింది తేలునంటాడు
పైకి గంగిగోవులా కనిపిస్తాడు
పాపం! అమాయకపు జింకపిల్ల అనిపిస్తాడు!

ఊసరవెల్లిలా రంగులు మారుస్తాడు
తోడేలులా అదనుచూసి దాడి చేస్తాడు
తాబేలులా రక్షా కవచాన దాగుంటాడు
పీతలా బొరియలోకి జారుకుంటాడు.

హెచ్చరిక లేకుండా గాయపరిచే క్రూరమృగం
బుస కొట్టకుండానే కాటువేసే విషసర్పం
సత్యాన్ని మరుగుపరిచే మేకవన్నె పులి
స్వార్థానికే పరిమితమైన గొంగళి!

ఎవరో అయితే.. ప్రమాదమేముంది?
ఎక్కడో ఉంటే.. ఆందోళనెందుకు?
మన ప్రక్కనే.. మనలాగే
మనతోనే.. ఉండే.. మనలాంటి మనిషే!

– ఎస్. కాశింబి
సెల్: 9052216044

## చక్రం తిప్పే అక్రమ నీతి

అవసరాలను అత్యవసర ఖజానాలుగా
మార్చుకొనే తిరుగులేని బ్యాంకు
కార్పొరేటు బ్యాంకు బాలెన్సులా
అవినీతి అమ్యామ్యా–లంచం– నజరానా
మరెన్నో అవతారాలతో
దేశం కుర్చీ నుండి గల్లీ కుర్చీ
పైరవీకారుదాకా
విశ్వరూపంతో ఊరేగుతున్నది
ఫైళ్ళు మాయం కావడంతోబాటు
కొత్తఫైళ్ళు పుట్టించేవరకూ
అవినీతి గ్రేడుల విలువలు
విశృంఖుల నాటకాలే
కేసుల పరిష్కారం కోసం వచ్చేటోళ్ళు
భిక్షాధికార్లవుతుంటే
విలువలు తారుమారుచేసేవాళ్ళు
లక్షాధికారులౌతుండ్రు
రాజకీయ నిరుద్యోగులకూ
రాజకీయులకూ
దళారులకూ పెట్టుబడిలేని
లాభాల వ్యాపారం
ప్రజావసరాల మైదానాన్ని
స్వలాభాల అభయారణ్యంగా
అవినీతి చాణక్యం
అదిప్పుడు గ్లోబల్ సామాజిక నీతిగా
చలామణి అవుతూ
బతుకు మెదళ్ళను
ఆసిడు దాడులకు బలిచేస్తున్నది
అవినీతి–అవినీతి–అవతరాల చక్రవర్తి
దాని నిగరానీలో
చవుడుభూమి పంటభూమిగా
పంటభూమి బీడుగా మారుతున్నది
ఆ ఊసరవెల్లి అంతానికి
జనచైతన్యమే ఖడ్గం.
చక్రం తిప్పుతున్న అక్రమ నీతికి
జనచైతన్య ఖడ్గమే ముగింపు పలుకుతుంది
అందాకా ఎక్కుడూ–దిగుడూ–పడుడు– లేసుడే.



– వల్లభాపురం జనార్దన
సెల్:9440163687

## నానీలు

మాటలేగా తగిలేవి
తూటాలై
మనసుకు మాయని
గాయం చేస్తూ...!

మాటలు సాగనీ
మార్దవమై
మదిలో మిగిలేలా
శాశ్వత జ్ఞాపికలై..!

శిలాశాసనాలే
మేధావుల మాటలు
చరిత్రలో చెరగక
నేటికీ మిగిలి..!

కల్లబొల్లి మాటల
కసరత్తులు
ఓటు వేటలో
నాయకుల పాట్లు

ఎంత మధురమో
అమ్మ మాటలు
పసితనానికి
మరల తీసుకెళుతూ..

మురిపాల మూటలే
చిన్నారి మాటలు
చిరుజల్లులై
మదిని చేరుతూ..

మోహవిరులే
తన మాటలు..
వలపు తోటలో
విహరింపజేస్తూ..

నీ మౌనంలోనూ
మాటలు వింటున్నా
మనసెరిగిన
చెలిమిని కదా..

వేదన వేళ
చల్లని మాట...
ఎడారిలో
వసంతమే...

వలపు కురిసింది
వాక్కులుగా
మదిని ప్రేమగా
బంధించేస్తూ...!

–అనూశ్రీ
9666688370













# 'మానేరు మా కళ్ళకు ముత్యాల పేరు'

మానేరు రచయితల సంఘం
(రాజన్న సిరిసిల్ల జిల్లా రచయితల సంక్షేమ సంస్థ)
స్థాపితం : 1989, రిజిష్టర్ నెం. 414 / 2007
సిరిసిల్ల – 505 301, రాజన్న సిరిసిల్ల జిల్లా,
తెలంగాణ రాష్ట్రం

### జ్ఞానపీఠ పురస్కార గ్రహీత – డా. సి. నారాయణ రెడ్డి

తెలంగాణ సాహిత్యంలోనే కాదు, తెలుగు సాహిత్య చరిత్రలో చారిత్రక కాలల నుండి నేటి సిరిసిల్ల జిల్లాది, లేదా ఎనమిదవ వతాబ్దిల్లో మహా సామ్రాజ్యంగా వర్ధిల్లిన వేములవాడ ప్రాంతానిది మహోన్నత స్థానం. నన్నయకు నూటా యాభై యేండ్ల ముందు కన్నడ భాషలో ఆదికవి పంపకవి కన్నడ భారతం రాసింది వేములవాడలోనే. తెలుగుకు ప్రాచీన హోదా లభించేందుకు కారణం అయిన బొమ్మలగుట్ట శాశనంలోని 'తొలి తెలుగు కంద పద్యాలు' రాసిన జినవల్ల భుడు వేములవాడ రాజ్యంలోని వాడే.

సిరిసిల్లకు ఈ శాసనంలోని 'సిద్ధశిల' అనే పదం వల్లనే ఆ పేరువచ్చిందని ప్రము ఖ చారిత్రక పరిశోధకులు కుర్ర జితేంద్ర బాబు 'కరీంనగర్ ఖాన్‌దాన్' గ్రంథంలో ప్రస్తావించారు.

**మారసం స్థాపన ఉద్దేశ్యం:**

నిత్య చేతన్యానికి, నిరంతర ఉద్యమాలకు ఆలవాలమైన మానేరు తీరం తొలినాళ్ళ నుండి ఉద్దీపనకు, సాహిత్యానికి, వివిధ వామపక్ష ఉద్యమాలకు ఆలవాలంగా నిలిచింది. భాషా సాంస్కృతిక ఉద్యమంలో భాగంగా 1921లోనే సిరిసిల్లలో 'వెలి గందుల నారయ ఆంధ్ర భాషా నిలయం' పేరుతో ఇప్పటి పోస్టాఫీసు వీధిలో గ్రంథాలయం స్థాపించబడింది. 1935లో జరిగిన నాల్గవ ఆంధ్ర మహాసభ, ఆంధ్ర మహిళా సభ, రైతాంగ పోరాటోద్యమాల గురించి మనకు తెలిసిందే. డెబ్భయ్యవ దశ కంలో యుం సాహితీ సమితి, టౌన్ క్లబ్, వివిధ సామాజిక సంస్థల కృషితో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినప్పటికీ తరువాత ఆ పరంపరం ఆగిపోయింది.

ఈ సమయంలోనే సిరిసిల్ల ప్రాంతంలో నెలకొన్న స్తబ్ధతను తొలగించేందుకు ఎనభయ్యవ దశకంలో ఉత్సాహవంతులైన యువ మిత్రులు సాహిత్య కార్యక్రమాలను కొనసాగించి, యువతను చైతన్య పరిచేం దుకు మహాకవి డా.సి. నారాయణరెడ్డి గారి ఆశీస్సులతో, స్వాతంత్ర్యానంతర తొలితరం తెలంగాణ కథా రచయిత, కవి జి. రాము లు చేతుల మీదుగా, ప్రసిద్ధ గేయకవి కనపర్తి, ప్రముఖ నాయకులు రుద్ర శంకరయ్యగారి సమక్షంలో, 16 సంవత్సరాల యువకుల సారథ్యంలో 1989 బుద్ధపూర్ణిమ రోజున (20, మే, 1989, శనివారం) మారసం 'మానేరు రచయితల సంఘం' స్థాపించ బడింది.

**తొలి కార్యవర్గం**

మహాకవి డా. సి. నారాయణ రెడ్డి గారిని 'గౌరవ ముఖ్య సలహాదారులు'గా పొందిన సంస్థ మారసం. జి.రాములు తొలి అధ్యక్షులుగా, తరువాత గూడూరి సీతారాం అధ్యక్షులుగా, వ్యవస్థాపకులు డా.పత్తిపాక మోహన్ కార్యదర్శిగా, ఎలగొండ రవి, కందేపి రాణీప్రసాద్, మ్యాన శ్రీనివాస్, ప్రవీణ్, గుడ్ల అనీల్ తదితరులతో ప్రారం భమైంది. తరువాత టివి నారాయణ, భోగ సతీష్, కోడం దేవేందర్, గెంట్యాల భూమేశ్, గోనె బాల్‌రెడ్డి, చేపూరి అశోక్ తదితరులతో కార్యవర్గం ఏర్పడింది. డా.నలిమెల భాస్కర్, చొప్పకట్ల చంద్రమౌళి, నగుబోతు చంద్రమౌళి, నిజాం వెంకటేశం, డా. పులి విఠల్, డా.వడ్డేపల్లి కృష్ణ, రుద్ర రవి, జూకంటి జగన్నాథం, పరవస్తు ప్రేం చందలు సల హాదారులుగా కార్యక్రమాలను విస్తరించింది.

**తొలి ప్రచురణ**

ప్రతీనెల సిరిసిల్ల ప్రాంతంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతి నెలా కవి సమ్మేళనాలు, ఆనాటి సాహిత్య ప్రముఖుల ప్రసంగాలు నిర్వహించింది. 1994లో వెలువడిన తొలి ప్రచురణ నుండి నేటి వరకు మారసం సంస్థ పేరుతో 69 ప్రచురణలు వెలువరించింది. మానేరు కవుల తొలి కవితా సంకలనం (పత్తిపాక మోహన్, ఎలగొండ రవి, కనపర్తి ప్రదీప్, సామల మహేశ్) 'ఖడ్గధార' 1995లో డా.వడ్డేపల్లి కృష్ణ రజతోత్సవం సందర్భంగా వెలువరించి, వారికి అంకితం చేయడం జరిగింది. తరువాత 'సముద్రం', కె.వి. నరేందర్ 'అమ్మ', గూడూరి సీతారాం, జి.రాములు కథలు, కందేపి రాణీప్రసాద్ బాల సాహిత్యం, పిల్లల రచనలు ఇలా ఇప్పటికి 68 సంకలనాలు, సంపుటాలు మారసం పక్షాన ప్రచురించబడ్డాయి. 69వ సంకలనం మానేరు కవుల కరోనా కవితలు 'చెమల పాదాల నడక' వచ్చే నెలలో వెలువడేందుకు సిద్ధంగావుంది.

**కొన్ని కార్యక్రమాలు**

కవి సమ్మేళనాలు, అవధానాలు, చర్చా కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు, సదస్సులు, బాల కవి సమ్మేళనాలు నిర్వహించిన మారసం యువతలో అవగాహన కల్పించి, సాహిత్యం పట్ల ఆసక్తిని కలిగించేందుకు ప్రతి నెల గోష్టులు నిర్వహించింది. అందులో భాగంగా నిజాం వెంకటేశంతో ఈ శతాబ్ది కవిత్వం, నలిమె లతో ఆనాటి కవిత్వం వంటి ప్రసంగాలను, చొప్పకట్ల చంద్రమౌళి, జి. రాములు గార్లతో 'చర్చా కార్యమ్రకాలు' నిర్వహిం చింది.

**జి.రాములు, సినారె, గూడూరి కార్యక్రమాలు**

స్వాతంత్ర్యానంతర తొలితరం తెలంగాణ కథకులు జి.రాములు 'సాహితీ జీవిత షష్టిపూర్తి ఉత్సవం', మహాకవి సినారె సమగ్ర సాహిత్యం 14వ సంపుటం ఆవిష్కరణ, 'గూడూరి సీతారాం సాహితీ జీవిత స్వర్ణోత్సవం' వంటివి మారసం నిర్వహించిన ప్రముఖ కార్యక్రమాల్లో కొన్ని. మహాకవి గుర్రం జాషువా జయంతి, మధురకవి మామిడిపల్లి సాంబకవి జయంతి వంటివి ప్రతియేడు మారసం నిర్వహించింది. స్వాతంత్ర్య సమరయోధులు అమృతలాల్ శుక్ల స్మారక ప్రసంగాలను ఏర్పాటేచేసి ప్రముఖకవి జ్వాలాముఖి వంటి వారితో ప్రసంగాలు ఏర్పాటు చేసింది.

**స్వర్ణ భారతికి బాల భారతి కవితా నీరాజనం**

ఇవ్వాళ్ళ స్వతంత్ర్య భారత అమృతోత్సవాలు (75 యేండ్లు) సందర్భంగా దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం మనకు తెలుసు. అయితే 1997లోనే స్వతంత్ర్య భారత స్వర్ణోత్సవాల సందర్భంగా (1947–1997 యాభై యేండ్లు) సందర్భంగా యాభై మంది బాలబాలికలతో స్వర్ణ భారతికి బాల బారతి కవితా నీరాజనం పేరుతో తొలి సారిగి బాలల కవి సమ్మేళనం నిర్వహించి పుస్తకంగా ప్రచురించింది. ఈ కార్యక్రమంలో ప్రధాన విశేషం వ్యాఖ్యాత లుగా బాలలు (స్వాధీన్ కుమార్ శుక్ల, రమ్య) వ్యవహరించారు. ఇదే సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలో ఇప్పుడు దంత వైద్యుడుగా ఉన్న డా.గరిపెల్లి నవీవన్ బహుమతి గెలుచుకున్నాడు.

**సినారెతో అనుబంధం**

ప్రారంభం నాటి నుండి సినారె ఆశీస్సులతో నడిచిన మారసం 1995 తర్వాత ప్రతియేడు సి.నా.రె ను సిరిసిల్లకు ఆహ్వానించి వివిధ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. వారే గౌరవ ముఖ్య సలహాదారుగా ఉన్నారు. సినారె చేతుల మీదుగా పుస్తకావిష్కరణలు, వివిధ పురస్కార ప్రదాన సభలు మారసం నిర్వహించింది. వాటిలో మారసం పురస్కారాలు, పూలతోట, కౌముది, బంతిపూలు వంటి పుస్తకావిష్కరణ సభలు విశేషమైనవి. ఈ అనుబంధంతోనే సినారెగారి సమగ్ర సంపుటాల్లో పద్యాలుగవ సంపుటం ఆవిష్కరించబడింది. మంత్రి పెద్దిరెడ్డి, ఎంఎల్ఏ ఆర్.పాపారావు, రుద్ర శంకరయ్య, డా.తిరుమల శ్రీనివాసాచార్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**మారసం సాహిత్య పురస్కారాలు, విశేష బ్రోచర్లు**

సిరిసిల్ల ప్రాంతంలోని ప్రముఖ సాహితీవేత్తలు, అప్పటికే కీర్తిశేషులైన 'మధురకవి మామిడిపల్లి సాంబకవి పద్య కవితా పురస్కారం', 'అలిశెట్టి కవితా పురస్కారం', 'జి.సురమౌళి కథా పురస్కారం' మరియు 'అమృతలాల్ శుక్ల స్మారక పురస్కారం'లను మారసం చాలా సంవత్సరాలు అందజేసింది. వీటిలో సాంబకవి తొలి పురస్కారం 'డా.వేముగంటి నరసింహాచార్యులు', కథా పురస్కారం 'ఆడెపు లక్ష్మీపతి', కవితా పురస్కారం 'డా.అప్సర్'లు, తరువాత, డా.గీతాంజలి, పెద్దింటి అశోక్, పసునూరి శ్రీధర్‌బాబు, ఆర్. సీతారాం, కొలిపాక శోభారాణి, డా. దేవరాజు మహారాజు తదితరులు అందుకున్నారు. అమృతలాల్ శుక్ల పురస్కారం రుద్ర శంకరయ్య, ప్రజాకవి రాజలింగం, దూడం నాంపల్లి మొదలగు వారికి ప్రదానం చేయడం జరిగింది. పై పురస్కారాలకు తోడుగా, త్వరలో బాల సాహిత్యం, బాల రచయితలు, సాహిత్య కార్యక్రమాల నిర్వాహకులు మొదలగు పురస్కారాలను మారసం స్థాపించి అందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. రుద్ర రవి నేతృత్వంలోని కళాసాగర్ కార్యక్రమాల సందర్భంగా ప్రముఖులపై విశేష బ్రోచర్లు ప్రచురించగా మారసం వాటికి సహ ప్రచురణకర్తగా వ్యవహరిం చింది. ఈ బ్రోచర్లలో భాగంగా 'డా.ఎన్. గోపి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పైడి జైరాజ్, డా. సుద్దాల అశోక్ తేజ, బి. ఎన్.రాములు, డా.నలిమెల భాస్కర్, ఎం.డి. సలీంలపై ప్రచురించినవి ప్రశంసల్ని పొందాయి.

**1857 తొలి స్వాతంత్ర్య సమరోత్సవం**

2007లో తొలి స్వాతంత్ర్య సమరం నూటా యాభై యేండ్ల సందర్భంగా అప్పటి కరీంనగర్ జిల్లా కలెక్టర్ సత్యనారాయణగారు మంజూరు చేసిన ఆర్థికవనరులతో మారసం ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం కూడా ఎన్నదగింది. దాదాపు వందమంది సిరిసిల్ల డివిజన్‌లోని కవులు ఇందులో పాల్గొన్నారు.

**బాలల సృజన కార్యశాలలు**

1997లోనే తొలిసారిగా బాలలతో కార్యక్రమం జరిపిన మారసం తరువాత స్వయంగా, వివిధ సంస్థలతోనూ అనేక పిల్లల కోసం పలు కార్యశాలలను నిర్వహించింది. వీటిలో 2015లో నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, చింతోజు బ్రహ్మయ్య చారిటబుల్ ట్రస్ట్‌తో కలిసి నిర్వహించిన కార్యశాల ఎన్నదగింది. ఈ కార్యశాలలో పిల్లలు రాసిన రచనలు అచ్చుకావడమే కాక, ఇందులోని రచన మహారాష్ట్ర పాఠ్య పుస్తకంలో పాఠంగా వచ్చింది.

పైన పేర్కొన్న కార్యక్రమాలే కాక వందలాది కార్యక్రమాలను మారసం నిర్వహించి, విశేషంగా జరిపింది. 2019–2020లో మారసం ముప్పైయేండ్ల పండుగను విశేషంగా రెండు రోజులపాటు మే, 2010లో జరపాలని, ఈ సందర్భంగా ముప్పై పుస్తకాల ఆవిష్కరణ చేయాలని నిశ్చ యించింది. కొవిడ్ కారణంగా రద్దు కాగా ఇంకా ఆ కార్యక్రమాన్ని నిర్వహించలేదు. మరో అయిదు పుస్తకాలు ఈ రెండేండ్లలో ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నాయి.

**అమృత భారతికి బాల బారతి కవితా నీరాజనం**

స్వతంత్ర్య భారత అమృతోత్సవాలు (75 యేండ్లు) సందర్భంగా డెబ్బై అయిదుగురు పిల్లలతో అమృత భారతి కవితా నీరాజనం పేరుతో బాలల కవి సమ్మేళనం నిర్వహించి పుస్తకంగా ప్రచురించనున్నాం.

ప్రస్తుతం డా.నలిమెల భాస్కర్ (అధ్యక్షులు), గరిపెల్లి అశోక్ (కార్యనిర్వాహక అధ్యక్షులు), టి.వి నారాయణ, డా.కందేపి రాణీ ప్రసాద్‌లు (ఉపాధ్యక్షులు), ఎలగొండ రవి (ప్రధాన కార్యదర్శి), జిందం అశోక్, డా.వాసరవేణి పరశురాం (నిర్వాహక కార్యదర్శి), గెంట్యాల భూమేశ్, గోనె బాల్‌రెడ్డి (సంయుక్త కార్యదర్శి), ఆడెపుల లక్ష్మణ్, బూర దేవానందం (కార్యదర్శి)గా సిరిసిల్ల జిల్లా రచయితల సంక్షేమ సంస్థగా మారసం కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

**'చైతన్యానికి మరో పేరు మారసం'**
– జి. రాములు

**'మా అంటే మాతృత్వం, నే అంటే నేతృత్వం, రు అంటే రుషిత్వం'**
– డా. వడ్డేపల్లి కృష్ణ

**'మానురు జీవధారే కాదు, సాహిత్య జీవధాతువు కూడా'**
– జూకంటి జగన్నాథం






## కవయిత్రులకు పురస్కారాలు

కందేపి రాణీప్రసాద్

వడ్డేపల్లి సంధ్య

సిద్దిపూటకు చెందిన శ్రీవాణి సాహిత్య పరిషత్ సారథ్యంలో ఏటా అందించే ప్రతిభా పురస్కారాలకు జిల్లాలోని ఇద్దరు కవయిత్రులు ఎంపికయ్యారు. వచన కవిత, బాల సాహిత్య విభాగాల్లో జిల్లాకు చెందిన డాక్టర్ కందేపి రాణీప్రసాద్, వడ్డేపల్లి సంధ్య ఈ పురస్కారాలకు ఎంపికైనట్లు పురస్కార కమిటి ప్రతినిధులు శుక్రవారం వెల్లడించారు. రాణీప్రసాద్ రచించిన కవితా సంపుటి **'హౌస్ వైఫ్'**, 'సంధ్య వెలువరించిన బాల గేయ సంపుటి **'చిటపట చినుకులు'** పుస్తకాలను ఎంపిక చేశారు. పురస్కారం కింద నగదు బహుమతి, ప్రశంసపత్రం అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. మానేరు రచయితల సంఘం 32 వసంతాల వేడుక సందర్భంగా కవయిత్రులు పురస్కారాలు అందుకోవడంపై మారసం అధ్యక్షుడు డాక్టర్ నలిమెల భాస్కర్, గరిపెల్లి అశోక్, డాక్టర్ పత్తిపాక మోహన్, రవి, అశోక్ అభినందించారు.

## ఎక్కడిదీ ఎక్కడిదీ మనకు జన్మ ఎక్కడిదీ ?

ఎక్కడిదీ ?ఎక్కడిదీ ?
మనకు జన్మ ఎక్కడిదీ?
అమ్మానాన్న లేకపోతే
మనకు జన్మ ఎక్కడిదీ?

తాళియే లేకపోతే
ఆలిఅంటు ఎక్కడిదీ?
ఆలియే లేకపోతే
ఆనందం ఎక్కడిదీ?

బందాలే లేకపోతే
బాధ్యతలంటెక్కడివి?
బాధ్యతలే లేకపోతే
హక్కులంటు ఎక్కడివీ?

పాఠమే లేకపోతే
పరీక్షంటు ఎక్కడిదీ?
పరీక్షయే లేకపోతే
ఫలితమంటు ఎక్కడిదీ?

పందెమే లేకపోతే
పతకమంటు ఎక్కడిదీ?
పతకమే లేకపోతే
ప్రశంసలంటెక్కడివీ?

ఆటలే లేకపోతే
పోటీఅంటెక్కడిదీ ?
పోటీనే లేకపోతే
ఓటమంటు ఎక్కడిదీ?

గురువంటూ లేకపోతే
గ్రంధమంటు ఎక్కడిదీ?
గ్రంధమే లేకపోతే
జ్ఞానమంటు ఎక్కడిదీ?

విద్యయే లేకపోతే
వినయమంటు ఎక్కడిదీ?
వినయమే లేకపోతే
విజయమంటు ఎక్కడిదీ?

మేఘమే లేకపోతే
మెరుపంటు ఎక్కడిదీ?
నిప్పన్నది లేకపోతే
మంటంటు ఎక్కడిదీ?

మేఘమే లేకపోతే
వర్షమంటు ఎక్కడిదీ?
వర్షమే లేకపోతే
పంటంటు ఎక్కడిదీ?

విత్తనమే లేకపోతే
మొక్కంటూ ఎక్కడిదీ?
మొక్కయే లేకపోతే
వృక్షమంటు ఎక్కడిదీ?

వస్తువులే లేకపోతే
వంటంటూ ఎక్కడిదీ?
వంటంటూ లేకపోతే
ఆకలెట్లు తీరేదీ?

ఆకలంటు లేకపోతే
ఆశలంటు ఎక్కడివీ?
ఆశలంటు లేకపోతే
అభివృద్ధి ఎక్కడిదీ?

కోపమంటు లేకపోతే
పాపమంటు ఎక్కడిదీ?
పాపమంటు లేకపోతే
మరణమంటు ఎక్కడిదీ?

ధనమంటూ లేకపోతే
దాత్రుత్వం ఎక్కడిదీ?
దాతృత్వం లేకపోతే
దైవత్వం ఎక్కడిదీ?

కులమంటూ లేకపోతే
కుమ్ములాటలెక్కడివీ?
మతమంటూ లేకపోతే
మారణకాండ ఎక్కడిదీ?

అణచివేత లేకపోతే
విప్లవమంటెక్కడిదీ?
విప్లవమే లేకపోతే
విముక్తి అంటెక్కడిదీ?

ప్రశ్నంటూ లేకపోతే
ప్రతిఘటన ఎక్కడిదీ?
ప్రతిఘటనే లేకపోతే
ప్రగతంటూ ఎక్కడిదీ?

కోవెలే లేకపోతే
భక్తంటు ఎక్కడిదీ?
భక్తంటు లేకపోతే
ముక్తంటూ ఎక్కడిదీ?

ఊహనే లేకపోతే
మహమ్మారి ఎక్కడిదీ?
మహమ్మారె లేకపోతే
మరణఘోష ఎక్కడిదీ?

–పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## ఎంత హాయి! ఎంత హాయి!

తల్లిలాంటి పల్లెటూరిలో
చల్లనైన గుడిసెలోన
పేడ అలికిన నేలమీద
మోదుగాకుల విస్తరేసి
కొసరి కొసరి అవ్వ నాకు
వేడి అన్నం పెడతా వుంటే
గోంగూర రోటి పచ్చడి,
చింత చిగురు ఇగురు పప్పు,
తోట వంకాయ ఘాటు కూర,
ఆవునెయ్యి, గడ్డ పెరుగు
గట్టిగా లాగించి, త్రేంచి,
ఆరుబైట వేపచెట్టు
నీడ లోన నులకమంచం
వేసుకోని కునుకుతీసి
కమ్మనైన కలలు కంటే
ఎంత హాయి ఎంతహాయి!



– నోరి రఘురామమూర్తి,
7337058008

## ఆకాశ పర్వం

ఆకాశం వికసించిన పూవు
అదిగాలితో దోస్తి గట్టింది
నీలవర్ణ చాయ రూపములతో..
నా కండ్లలో బంధి అయింది!

అప్పుడప్పుడు నవ్వుతుంది
అప్పుడప్పుడు ఏడుస్తుంది
అయినా ఓ సారి ఉరిమి ఉరుమి
మెరుస్తు నా వైపు చూస్తుంది!

అనంతమైన బాహువులలో
సూర్య చంద్రుల నెత్తుకుని
మురిపెంగ మురిసిపోతునే
కాలమానంబై సాగుతుంది!

చుక్కలన్ని తన గుప్పిట్లోనే
రాశులు రాశులుగా పోసుకుని
చమికిలద్దుకున్న తీరు రూపం
శూన్యంలో నుండి తొంగిచూస్తుంది!

భగ భగ మండే భాస్కరుడు
ఎర్రగా మారుతు ప్రకాశించును
జీవరాశులకు ఊష్ణానిస్తునే
తన ఉనికిని చాటుకుంటుంది!

తెల్లని ముధుపర్కాలతో చంద్రుడు
మేలిముత్యాల పల్లకిలో లాలిత్యమై
మనసును రంజిపజేయగా వచ్చే
వెన్నెల పరిచిన ఆనందాలవాకిట్లోకి!

ఏడురంగు వర్ణాల తెరచాపా
సహకార భావంతో పెనవెసుకున్న
బంధాలని ఇంపు గొల్పేల చూపుతు
ఇంద్రధనస్సై నన్ను మురిపిస్తుంది!

భూమిని చూస్తు ఎన్నెన్ని అందాలతో
ఒయ్యారాల సొగసులను ఒలకబోస్తు
మేఘాల మాలతో రాగల ఊయలూగుతూ
ఓ పర్వమై ఎప్పుడు నాతోనే వుంటుంది!!



– వజ్జీరు ప్రదీప్
9989562991

## సూర్యులం....

ఒక బాధనుకంటు
ఒకబాధను వింటూ
ఒక కధనుకంటు
ఒక కధను వింటూ
ఒక మనిషిని తడుతూ
ఒక మనిషిని గురి పెడుతూ
ఒక గాధను చదువుతూ
ఒక గాధకు మననమౌతూ
ఒక కథనానికి కదిలి ఒక నేపధ్యానికి కరిగి
ఒక సన్నివేశానికి పొంగి
ఒక భావావేశానికి మనసుప్పొంగి
గాల్లో మాటలా పేలుతూ
అపుడపుడూ చెట్టుకొమ్మలా
మౌనంగా గాల్లో ఊగుతూ
ఊర్లకు ఊర్లు
దారి కాని దార్ల వెంట
ఊసుల మూలవేర్లెంట
ఊహల ఊయలలో
ఆశల ఆవలి తీరాలగుండా
ఊరేగే బాటసారులం మనం
లోకమంతా మాదే శోకమంతా మాదే
రక్తం మరిగి
నరాల్లో శివతాండవమాడితే
గుండె కరిగి కన్నీరుగా ఉబికి
నీలంసిరగా కలం కాయిదం పైనాట్యమాడితే
కోటితలపుల తలుపులు తెరవగా
లక్షల అక్షరాలు పదాలపెదాలై అరవగా
వాక్యాలసమూహాల సందోహంలోంచి
శ్రీకారం చుడుతుందో కవిత
ఆకారం దాలుస్తుంది
అన్నార్తుల, అభాగ్యులభవిత మా చేత
మేం కులాలకతీత నవకలల్ని
స్వప్నిస్తున్న కవివర్యులం
మేం కలాలెత్తి అహోరాత్రాలు శ్రమిస్తూ
అస్తమించని ఆకస కవన సూర్యులం.

–నల్లగొండ
83094532179

## షామియానా..

ఎరుపు నీలం
రంగుల షామియానా...!
ఎవర్ గ్రీన్
టెంటు రంగులవి!!

ఇంటి ముంగిట్లో
వెలసిన టెంట్
పిల్లల కోలాహలం
మొదలు!!

షామియానా
వెలయాల్సిందే...!
శుభకరమైనా
అశుభమైనా...!

చిరునామాకై
గాబరా పడకు...
టెంట్ వేసిన ఇల్లదిగో
పద ముందుకు...!!

–వెగ్గలం ఉషశ్రీ
9440370066

## మల్లెతీగ

ఇంటి ముందు అల్లుకున్న
మల్లెతీగ
పచ్చని నవ్వుల్లో నుంచి
రాలిపడ్డ నీటిబొట్లు
నాలో చైతన్య స్ఫురణ కలిగిస్తాయి.

ఇంటబయటా నడిచిన ప్రతీసారి
తీగ జారి
తలనో భుజాన్నో తడిమి
గిలిగింతలు పెడుతుంది.

ఉదయసాయంత్రాల్లో
మొగ్గల పరిమళాలు
కుదేసి లంగరేస్తాయి
నన్నొంటరిగా.

దాని ఊతకర్రను పట్టి
తల పైకెత్తి చూస్తాను –
చిటికెన వేలుపై
పురి విప్పుకుని దర్శనమిస్తుంది
పందిరి గొడుగు.

తన అంతరంగ మదిలో
ఎంత యుద్ధ ప్రక్రియ నడిస్తే గాని
పువ్వుల్ని కాస్తుంది.

భాదలన్నీ తనివి
అనుభూతులన్నీ మనవి.

ఎన్ని నదులను నింపుకున్న దేహమో
శరీరాన్ని సాగదీస్తూ
ఒక్కో గాయాన్ని కుట్టుకుంటూ
ప్రవాహంగా పాకుతుంది?

–ఇ. రాఘవేంద్ర
9494074022

## ఆమె మానవ శాస్త్రం.!

ఆమె...
సృష్టి సూత్రం
మానవ శాస్త్రం

ఆమె...
ఉత్పత్తి జూ
పునరుత్పత్తుల
భౌతిక ప్రపంచ
శక్తి యుక్తి.!

ఆమె..
జీవన తత్వం
జీవిత సత్యం

ఆమె...
అన్నీ తానే అయినా
అడుగడుగున వివక్ష
క్షణ క్షణం విషమ పరీక్ష

ఆమె...
ఇపుడు చేయాల్సింది
ఉత్సవం కాదు
విముక్తి ఉద్యమం.

ఆమె
ఇపుడు పురుషాధిక్యతకు
శస్త్ర చికిత్స చేసే
అస్త్రంగా మారాలి.!
సమ సమాజ నవ సమాజ
గానమై సాగాలి.!

(ఉత్పత్తి ,పునరుత్పత్తిలో పునరంకితమౌతున్న మహిళ శక్తులకు అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవ శుభాకాంక్షలు...)

–చిలువేరు అశోక్
9492443141

# జీవవైవిధ్యంతోనే జీవులమనుగడ
# కాపాడు కోకుంటే రేపటి తరాలకు ముప్పు

-గుండేటి యోగేశ్వర్,
ఫోన్:984925 47 47

చిన్న చీమ నుండి పెద్ద ఏనుగు వరకు ఒక జీవి మరొక జీవి మనుగడకు ప్రత్యక్షంగా లేక పరోక్షంగా సహకరిస్తుంది. మానవుని తో పాటు సకల జీవుల మనుగడ జీవవైవిధ్యం పైనే ఆధారపడి ఉంది..

ఈ భూగోళం మానవ శరీరం లాంటిది. శరీరంలోని ఏ అవయవానికి హాని కలిగినా మొత్తం శరీరం పై దాని ప్రభావం ఉంటుంది. చిటికెన వేలి బాధ ఆ వెలికే పరిమితం కాదు. జీవ వైవిధ్యం మానవ శరీరం అనుకుంటే అందులోని ఏ జాతి జీవులు నశించినా దాని ప్రభావం మానవజాతి పై పడక తప్పదు. ఈ నిజాన్ని పర్యావరణ శాస్త్రవేత్తలు గుర్తించినా ఎంతమాత్రం ఫలితం ఉండదు. ప్రపంచంలోని ప్రతి మనిషి గుర్తించాలి. అప్పుడే జీవ వైవిధ్యం మనుగడ సాగిస్తుంది.

ఈ భూగోళం పై ఉన్న సకల ప్రాణులు ఒక జీవి మరొక జీవి పై ఆధారపడి ఉంది. అన్ని ప్రాణులకు ఆహారం లభించాలంటే జీవులన్నీ బతకాలి...వైవిధ్యం నిలవాలి..

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని మే 22న నిర్వహించి ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కలిగించడానికి..1992 సంవత్సరంలో కెన్యా దేశంలో ని నైరోబి నగరంలో ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.ప్రతి సం.వేర్వేరు సందేశాలతో కార్యక్రమాలు నిర్వహిస్తుంది.2021 సం.లో "వి ఆర్ పార్ట్ ఆఫ్ ద సొల్యూషన్ ఫర్ నేచర్" అనే సందేశం తో అవగాహన కల్గిస్తుంది.

## జీవవైవిధ్యం ఇలా

భూగోళం పై ఉన్న వివిధ జీవుల మధ్య గల భేదాన్నే 'జీవవైవిధ్యం' అంటాం. నేడు మన భూమిపై ఉన్న అనేక మిలియన్ల వివిధ జాతుల జీవ వైవిధ్యం సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల పరిణామం. మన జీవనశైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుంది. దీంతో జీవవైవిధ్యం దెబ్బతింటోంది. ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయి. ఇదివరకూ ప్రతి ఇంటిలో పిచ్చుకలు ఉండేవి. రాను రానూ అవి కనుమరుగైపోతున్నాయి.

## జీవుల ఆవిర్భావం ఇలా జరిగింది

దాదాపు 200 కోట్ల సంవత్సరాల పూర్వం భూగోళం మండుతున్న అగ్నిగోళంలా ఉండేది. నేటికి దాదాపు వంద కోట్ల సంవత్సరాల క్రితం కాలక్రమేణ చల్లబడి ప్రాణకోటి ఆవిర్భవించింది. సూక్ష్మజీవి రూపంలో 'తొలిజీవి ప్లాజిల్లేట'అనే ఏక కణ జీవి ప్రీ బయాటిక్ సూప్ అనే సముద్రం అడుగు భాగంలో పుట్టిందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. తొలుత వృక్షాలు ఆ తర్వాత జంతుజాలం అవతరించాయి క్రమక్రమంగా ఉబయచరలు, పక్షులు పుట్టాయి. నేడు భూమ్మీద సుమారు 80 లక్షలు వృక్ష జంతుజాలం మనుగడ సాగిస్తున్నాయి. ఆధునిక ఇందులో ఆధునిక మానవజాతి కూడా ఉంది. ఇప్పటివరకు 17 లక్షల జాతులను మాత్రమే గుర్తించగలిగారు.ప్రకృతి లోని అనంత జీవకోటిలో ప్రతి జీవి మనుగడకు ప్రత్యేక కారణం ఉంటుంది. జీవావరణం లోని ఏ జీవి కూడా నిరుపయోగమైనది కాదు. ఏ ఒక్క జీవి అంతరించిన మొత్తం జీవావరణం పై ప్రభావం చూపుతుంది.

## మన దేశం విశిష్టత

ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాలలో భారత దేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు ఈ దేశంలో ఉన్నాయి. కానీ ఇదంతా గతం. నేడు ఆ విస్తారమైన జీవ సంపదలో 10 శాతానికిపైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికి పైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు లుప్తమైపోయాయి. విస్తారంగా ఉన్న పచ్చిక బయళ్ళను మన జీవనశైలితో రూపుమాపేశాము. సముద్రతీరాలను అతలాకుతలం చేసేశాము. ఇవన్నీ చాలవన్నట్టు అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి అంతమొందిస్తున్నారు.

వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణారహితంగా వాడేలా చేసింది. దీంతో మన నేలను, దానిపై నివసించే విలువైన జీవసంపదను కోల్పోవాల్సి వచ్చింది. అంతేకాదు, అత్యధిక కీటక నాశనులను ఉత్పత్తి చేసే దేశంగా భారత్ విరాజిల్లుతోంది. ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్టపోయాం. అంతేకాదు అపార జీవజాతులు అంతరించిపోయాయి.ఈ వైవిధ్యం తరచుగా అనేక రకాల మొక్కలు, జంతువులు మరియు సూక్ష్మజీవుల పరంగా అర్థం అవుతుంది. ఇప్పటివరకు, సుమారు 1.75 మిలియన్ జాతులు గుర్తించబడ్డాయి, ఎక్కువగా కీటకాలు వంటి చిన్న జీవులు. వాస్తవానికి 13 మిలియన్ జాతులు ఉన్నాయని శాస్త్రవేత్తలు లెక్కించారు, అంచనాలు మూడు నుండి 100 మిలియన్ల వరకు ఉంటాయి.జీవవైవిధ్యంలో ప్రతి జాతిలోని జన్యుపరమైన తేడాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు, పంటల రకాలు మరియు పశు వుల జాతుల మధ్య. క్రోమోజోములు, జన్యువులు, మరియు ఆరెం- జీవితం యొక్క బిల్డింగ్ బ్లాక్స్-ప్రతి వ్యక్తి మరియు ప్రతి జాతి యొక్క ప్రత్యేకతను నిర్ణయిస్తాయి.

## మన రాష్ట్రంలో ఎంతో ఘనం

తెలంగాణకు ఘన మైన జీవ వైవిధ్య సంపద గల చరిత్ర ఉంది. అనేక రంగాలలో ఏంతో విశిష్టత గల మన తెలంగాణ జీవ వైవిధ్య సంరక్షణలో సైతం ఆదర్శంగా నిలుస్తోంది. అరుదైన పక్షి జాతులు, విభిన్నమైన చేపల రకాలు, సీతాకోకచిలుకల, ఇతర జంతు జాతులు.. ఇలా అనేక ప్రత్యేకతలను రాష్ట్రం సొంతం చేసుకుంది. రాష్ట్రంలోని పోచారం, మంజీరా, అనంతగిరి, జన్నారం, ఏటీఆర్, ఖమ్మం, వరంగల్, పాకాల తదితర ప్రాంతాల్లో అద్భుతమైన జీవ వైవిధ్యం అలరారుతోంది.

తెలంగాణకే ప్రత్యేకమైన కొన్ని రకాల చేపలు, గుడ్లగూబలు, పావురాలు, 400 వరకు రకాల వివిధ పక్షులున్నాయి. జీవవైవిధ్యం పెంపుదలకు పులులు, చిరుత పులుల వంటివి కీలకమైనవిగా నిలుస్తున్నాయి. తెలంగాణలోని 500 నుంచి 600 రకాల ఔషధ మొక్కలూ కీలక భూమికను నిర్వహిస్తున్నాయి.

## రాష్ట్రంలోని పక్షులు, వృక్షాలు, జంతుజాతులు..

రాష్ట్రంలో 1,900 రకాల వృక్షాలు, మొక్కల జాతులు, 166 రకాల చేపలు, 376 రకాల పక్షులు, 155 సీతాకోకచిలుకలు, 13 రకాల రొయ్యలు, 4 రకాల ఎండ్రకాయలు (పీతలు), 28 రకాల తూనీగలు, 53 రకాల మోత్స్, 46 రకాల సాలెపురుగులు, 12 రకాల తేళ్లు, 107 రకాల ఇన్వర్టెబ్రేట్స్, 41 రకాల నత్తలు, 17 రకాల కప్ప లు, 60 రకాల పాములున్నాయి. ఇక 376 రకాల పక్షి జాతుల్లో భాగంగా గుడ్లగూబలు, బాతులు, పావురాలు, కొంగలు, రామచిలుకలు, పిట్టలు, రాబందులు.. 70 రకాల జంతువుల్లో భాగంగా పులులు, చిరుతపులులు, వివిధ జాతుల కోతులు, జింకలు, ఎలుకలు, ముంగిసలు, నీల్గాయిలు, నక్కలు వంటివి ఉన్నాయి.

రాష్ట్రంలో 8 వన్యప్రాణి అభయారణ్యాలున్నాయి. ప్రాణహిత, శివ్వారం, ఏటూరునాగారం, నాగార్జున సాగర్, శ్రీశైలం, పాకాల, కిన్నెరసాని, మంజీరా, పోచారం.. వీటిల్లో చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, పులులు, నక్కలు, మొసళ్లు, కొండచిలువలు ఇతర జంతువులున్నాయి.అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, 2,166 చదరపు కి.మీ., కవ్వాల్ టైగర్ రిజర్వ్, 892 చదరపు కి.మీ. మేర పులుల అభయారణ్యాలు విస్తరించి ఉన్నాయి.

## జాతీయపార్కులు..

కాసు బ్రహ్మానందరెడ్డి జాతీయ పార్కు, మృగవాణి నేషనల్ పార్కు, మహావీర్ హరిత వనస్థలి జాతీయపార్కు,హైదరాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూ జూలాజికల్ పార్కు, వరంగల్‌లో వన విజ్ఞానకేంద్రం (మినీ జూ) ఉన్నాయి.

సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న అమీన్‌పూర్ చెరువు బయో డైవర్సిటీ హెరిటేజ్‌సైట్‌గా ఉంది.

## మన రాష్ట్ర అభయారణ్యాలు

తెలంగాణకు ఘనమైన జీవవైవిధ్య వారసత్వ సంపద ఉంది. రకరకాల మొక్కలు, వృక్షాలు, జంతువుల జాతులతో వైవిధ్యమైన ప్రత్యేకతను సొంతం చేసుకుంది. వీటిని పరిరక్షించుకునే విషయంలో సాధారణ ప్రజల్లో అవగాహనను పెంచాలి. పర్యావరణం, ప్రకృతి, జీవవైవిధ్యం నుంచి మనం ఏమి పొందుతున్నాం.. వాటి వల్ల ప్రయోజనాలు కొనసాగాలంటే వివిధంగా వాటిని సురక్షితంగా ఉంచుకోవాలన్నది వారు తెలుసుకోగలగాలి. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. స్థానికంగా పండించే వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, పండ్లు వంటి వాటిని ప్రోత్సహించాలి. ఔషధ మొక్కల వల్ల ఆరోగ్య పరిరక్షణకు అవకాశం ఏర్పడుతోంది. వాటి ప్రాముఖ్యతను గుర్తించి సంరక్షణ చేస్తే భావితరాల మనుగడకు అమ్మలా ఆదుకుంటుంది.

రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలి. జన్యుమార్పిడివల్ల వచ్చే ప్రభావాలు స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో ఎలా ఉంటాయో పూర్తి అధ్య యనం చేయకుండా వీటిని ఏ జీవజాతుల్లోనూ ప్రవేశ పెట్టకూడదు. తొందరపడితే ప్రస్తుతం మనుగడలోని జీవజాతికే ప్రమాదం వాటిల్లు తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## మన అలవాట్లు మారాలి

జీవ వైవిధ్యాన్ని హాని చేసే మానవ జీవన శైలిని మార్చుకోవాలి. భూతాపాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి. జంతువుల్ని మొక్కల్ని పరిరక్షించుకోవాలి. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు విరివిగా అవలంబించాలి.

అంతరించే ప్రమాదం ఉన్న జాతులను ప్రతిష్ట చేసి రక్షించాలి. ప్రకృతిని మనం రక్షిస్తే ప్రకృతి మనల్ని రక్షిస్తుంది. అప్పుడే జీవ వైవిధ్యం ఫలాలు రేపటి తరాలకు అందుతాయి.

## కాపాడు కోవడం అందరి బాధ్యత

మానవ మనుగడకు జీవ వైవిధ్యం ఆధారం కావున రక్షించవలసిన ఆవశ్యకత ప్రతి పౌరుని పైన ఉంది. వన నిర్మూలనకు అడ్డుకట్ట వేస్తూ నరికిన ప్రతి చెట్టుకు మరొక 2 చెట్లు పెంచాలి. జీవ వైవిధ్య పర్యావరణ చట్టాలను ఉల్లంఘించిన వారికి జరిమానాలు శిక్షలను మరింత కఠినతరం చేయాలి. అక్రమ వృక్ష, జంతు రవాణ అరికట్టాలి. 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలి. అటవీ వ్యవసాయ తోటల పెంపకాన్ని అనుమతించకూడదు. దేశంలోని 497 అభయారణ్యాలు 27 టైగర్ ప్రాజెక్ట్ పరిశోధన శాలను ప్రత్యేకంగా నిర్వహించాలి. పర్యావరణ దినం, భూగోళం సంరక్షణ దినం, జీవ వైవిధ్య దినోత్సవాల సందర్భంగా ప్రజల్లో, విద్యా సంస్థలలో అవగాహన కలిగించాలి. జీవ వైవిధ్య సదస్సులో జరిగిన తీర్మానాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి.

మానవ జీవన శైలిని మార్చుకోవాలి. భూతాపాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి. జంతువుల్ని మొక్కల్ని పరిరక్షించుకోవాలి. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు విరివిగా అవలంబించాలి.

అంతరించే ప్రమాదం ఉన్న జాతులను ప్రతిష్ట చేసి రక్షించాలి. ప్రకృతిని మనం రక్షిస్తే ప్రకృతి మనల్ని రక్షిస్తుంది అప్పుడే జీవ వైవిధ్యం ఫలాలు రేపటి తరాలకు అందుతాయి. సకల ప్రాణకోటి మనుగడ నిరంతరాయంగా కొనసాగుతుంది.

(22 మే అంతర్జాతీయ జీవవైవిధ్య దినం సందర్భంగా)

## తరువులు మన బతుకు దెరువులు

మానవాళి మనుగడకు
పర్యావరణ పరిరక్షణకు
వాతావరణ కాలుష్య నివారణకు
జీవ వైవిధ్యమునకు
మానవాళికి పట్టుకొమ్మలు చెట్లు.

నిస్వార్థానికి నిలువెత్తు రూపాలు
మన బ్రతుకు దెరువులు
ప్రాణవాయు ప్రధాతలను
తాత్కాలిక సుఖాల కోసం నాశనం చేస్తే
భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

చెట్లు నరకడం అంటే
సమస్త జీవరాశులను చంపడమే
భవిష్యత్తు తరాలకు హాని చేయడమే
పర్యావరణ సమతుల్యతను దెబ్బతీయడమే
ప్రమాదాలను ఆహ్వానించడమే.

మానవాళికి బతుకునిచ్చే
జీవితంలో వెలుగులు పంచే
పరోపకారమే పరమావధిగా భావించే
చెట్లను కాపాడుకుందాం
భవిష్యత్ తరాలను రక్షించుకుందాం
బావి భారతాన్ని నిర్మించుకుందాం

-పిల్లి.హజరత్తయ్య
9848606573

## పర్యావరణ పరిరక్షణ

తరువుల నరికితే
చెరువు లెలా నిండుతయ్
ఎండిన కర్రకు పచ్చని
బట్టలు తొడిగితేనే కదా
పది కాలాల పాటు పైలంగ
బతికేయొచ్చు
పచ్చని చెట్లకు వెచ్చని
కత్తులు కడితే ఎలా ?
ఆరోగ్యాన్ని ఆయుస్సు ఇచ్చే చెట్లు
కార్బన్ డయాక్సైడ్ ఇస్తే ఎలా ?.
పచ్చని చెట్లను పడేసి నరుకుతుంటే
అమ్మలాంటి చెట్టు ఆక్రోశాన్ని చూపదా
తరువులన్నీ నరుకుతుంటే
కరువులురాక మరేమి వస్తాయి ?
అమ్మలాంటి అడవి తల్లిని
అడ్డదిడ్డంగా చిదిమేస్తుంటే
ఆకలి తీర్చే పండ్లు
కాయల పూలు ఎక్కడినుంచొస్తాయి
భూగర్భ జలాలు అడు గంటితె
చెట్లు ప్రాణం ఎలా నిలుస్తుంది !.
చెట్టుంటే నీడుంటది
చెట్టుంటే పిట్టలొస్తయి
చెట్టుంటే జంతువొస్తది
చెట్టుంటే గాలి వీస్తోంది
చెట్టుంటే ఆహారమొస్తది
చెట్టుంటే మందులొస్తయి
చెట్టు లేకుంటే జీవజాతికి
మనుగడ లేదు
చెట్టు లేకుంటే మానవ
జాతికి బతుకే లేదు
చెట్టే ప్రగతికి తొలిమెట్టు
చెట్టు లేకుంటే నీ బతుకే వేస్టు
మనిషి కొక్క చెట్టు నాటి
మనిషి మనుగడ మార్గం చూపించు
చెట్టే నీ ఆయువు ప్రాణవాయువు
పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

-ఓ.ఆ.ఆఫ్రిన్
9959524585

## పర్యావరణం

ప్రగతి మార్గమంటూ
ప్రపంచీకరణపై మోజు
నవత పోకడలంటూ
మానవతకే బూజు.
కష్టజీవులపై నిర్లక్ష్యం
కాలుష్య కోరల్లో చిక్కడం
దానగుణాలకు దూరం
ధరిత్రినే వ్యథలకు గురి.
కులాల కుట్రలు
మతాల మారణ హోమాలు
వనాల నరికివేత
వన్య ప్రాణులకు హాని
గాలి , నీరు కలుషితం
గాండ్రించే ప్రకృతిపై అలక్ష్యం
పరిశ్రమలపై మోజు
పర్యావరణ కాలుష్యం పెంపు.
అందుకే ..
సహజ వనరుల్ని సంరక్షిద్దాం
సక్రమ ఆలోచనల్ని పెంచుదాం
తెలివిగా మసులుకుందాం
తెలంగాణ వికాసాన్ని కోరుకుందాం

-సుతారపు వెంకట
నారాయణ
9848958690

## బీళ్ళభూమి కాదు

బీళ్ళభూమి కాదు
మొళ్ళభూమి కాదు
రాళ్ళభూమి కాదు
అటు చూడు
అలుగులు ఆడుతున్నాయి
గుంటలు నీటిగంటలు మోగిస్తున్నాయి
పగుళ్ళభూమి కాదు
దిగుళ్ళభూమి కాదు
కన్నీళ్ళభూమి కాదు
ఇటు చూడు
కొండల్ని చుట్టుకొని
అడవుల్ని దాటుకొని
వాగులు వయ్యారాలు పోతున్నాయి
సెలయేళ్ళు పరవళ్ళు తీస్తున్నాయి
మాది నీళ్ళ భూమి-
ఇంకుడు గుంతలు కొట్టాం; చెక్‌డ్యాములు
కట్టాం
ప్రాజెక్టులు చేపట్టాం
నీళ్ళ భూమి మాది-
కష్టాల కొలిమిలోంచి
దారిద్రపు శృంఖలాల్లోంచి బైటపడ్డాం-
మనస్సులను మంత్రించే
హృదయాలను కదిలించే
కరువు కదలికల్ని కట్టడిచేసే
వాననీళ్లో వరదనీళ్ళో-
చెర్లు బోర్లు నిండి నీళ్ళు
పల్లెలన్నీ పసిడిపంటల లోగిళ్ళు-
చిత్రకారుడు నీటికుంచెతో ఎంత
అందమైన చిత్రం గీసాడు
జీవనప్రస్థానం సజావుగా సాగడాన్కి
నీరెంత అవసరమో చెప్పాడు
చేయూతతో
రైతుహిత సేద్యం
సర్వహిత జనామోదం

-కోటం చంద్రశేఖర్
9492043348

## పరాన్న - క్షయము

ఇల్లు వాకిలంతా
ఒక్కటి జేస్తివి -
ప్రపంచానికంతా
పదితలల ఆలోచననింపినావు -
అంతుచిక్కని మహమ్మారివైరస్.
ఒక్కొక్కర్ని
ఒక్కొక్క గదికి బంధిచేసి
ఆలోచనమెదడుకు తాళంవేసి -
పంచపంచన కావలికాస్తున్నావ్!
స్వార్థంతో ఎవరికి వారే
యమునా తీరే
అన్నట్టు గొప్పోరైనరు
ప్రాణరక్షణ సూత్రంలా నీవు.
చిద్రంచేసిన జీవనాలు -
లెక్కకు మించిపాయే!
బ్రతుకు దూరమెంతున్నా?
అడుగులే...తడబడుతున్నయ్!
మాకు ఏదీకాదిప్పుడు శాశ్వతం
బ్రతికితే ప్రాణమే మిగిలే -
ఒక్కొక్కరు శ్వాసతో
ఎదురీదుతుంటే...
నిఘాలో... జనసంద్రోహమంతా
రెక్కలువిరిగిన బ్రతుకులు -
ఈ కాలభూతంలో...
తిరోగమన గడియారాలు!
వాడు- వీడు
దోచుకున్న సొత్తుకు,
దాచుకున్న సొమ్ముకు,
అలగం- బలగం దేనికి... విలువ లేకపాయే.
ఒక్కటే స్వార్థం నేర్చుకోవాలిప్పుడూ -
ఈ కరోనను అంతమొందించాలి
ఎవరైనా ఎవరైనా అన్నట్టుందీ...
ఈ లోకమంత

- కోవూరి నర్సింలు
సెల్: 9676310056

## సూక్తులు

అర్థానికి పరమార్థం వెతికేవు
వెతుకులాటలో నీ దారి మరిచేవు
నిన్ను నువ్వు అర్థం చేసుకో
పరమార్థం అదే బోధపడు
భోధి వృక్షం కానరాలేదని కంగారేల
నీలోని ఆత్మభోదను
మరిచెదవేల మానవ...
ఏది మనది శాశ్వతం కాదని తెలుసు
ఏది మనతో రాదని తెలుసు
అన్ని తెలిసి పట్టించుకోక
అహంకారం ఎందుకో
మానవత్వం విడిచిన
ఎవరికి కానీ ఈ జీవితం
ఎవరికోసం మానవ...

-పి.విశాలాక్షి
9908435805

## చిలిపి తలపు!!!

రోజులాగే సూరన్న
తెల్లమొగమేసుకుని బయల్దేరాడు...
పడుకోవడానికి లేదుకదా అని నిరసిస్తూ
జీవులు కాళ్ళు సవరించుకున్నాయి...
రాత్రంతా నలిగిన ఆలోచనలు
మస్తిష్కపు మడతల్లోకి దూరిపోయాయి...
సమస్యల గొంగళీలు ఒళ్ళు విరుచుకుని
రోకలిబండల్లా నావైవు రాసాగాయి..
నేను శుభ్రపడి బయల్దేరి శ్రమ
కర్మాగారపు తాళం తీయబోతే చేతిలోకి అవి...
చిరునవ్వు సాధనంతో పగలును తవ్వడం
మొదలయ్యాకా నాకు నేను
గుర్తొచ్చేది సందె వేళకే...
చెమట చిత్తడిలో పురుగులన్నీ కొట్టుకుపోయ్యాక
గూటికి చేరి తన గుండెల్లో గువ్వనైనప్పుడు...
ఇంటికెళ్లిపోయాకా కూడా నేను గుర్తొచ్చి
సూరన్న
కుళ్ళుకుంటాడేమో మరి...!!!

-కొత్తపల్లి ఉదయబాబు
9441860161

## భల్లం భాష్యం
# కవిత్వాన్ని మరో మంచి కోణం నుంచి..

కవి కావడానికి అర్హత ఏమిటి...? ఆకర్షణీయమైన భావ చిత్రాల సమాహారాలతో, ఆకట్టుకునేటట్టు కవిత్వం రాయడమా..? అన్న ప్రశ్నకు నాటి నుండి నేటి వరకూ సర్వులకూ సంతృప్తికరమైన సమాధానం లభించకపోయినప్పటికీ- "పాఠకులకు బాగా కనెక్టయ్యేలా రాయగలగడమే అసలు సిసలైన అర్హత" అని రడీమేట్ సమాధానంతో ఇప్పటికి సరిపుచ్చుకోవాలేమో..

ఒకప్పుడు కవిత్వం గ్రంథస్తమై 'అట్టహాసం'గా ఉండేది. ఇప్పుడు అధికభాగంగా ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌లలోనూ కవిత్వం కనిపిస్తోంది. చిత్రమేమంటే- ఫేస్‌బుక్, ట్విట్టర్ కవిత్వాన్ని- వాటిని మూసేస్తే మళ్లీచూడలేం.

కవిత్వం- రోజూ తయారయ్యే దినపత్రికలాంటిది కాదుగా. కవిత్వం వ్యక్తిత్వం భిన్నమైంది. అపుడపుడూ వాదాలు కవిత్వానికి కొత్త ఉత్తేజం ఇస్తుంటాయి. ఈ నూతన పరిణామాలు రాకుండా ఉండివుంటే- కవిత్వం పేలవంగా కించిత్ మిగిలిపోయేదేమో. ముఖ్యంగా వాదాల కవులు భాష మీద చేసిన పోరాటం, ప్రవేశపెట్టిన కొత్త ధోరణులు చాలా ప్రత్యేకమయినవి.

కవికి రాయాలన్న ఉత్సాహం, ఉద్వేగం ఉంటే చాలదు. ఉన్నతంగా కవిత్వం రాయడానికి నిరంతర అధ్యయనం, కృషి ఉండాలి. రాసిన కవిత్వాన్ని మరోసారి చదువుకుంటే- సీనియర్ కవులకు చూపించుకొని సరిచేయించుకుంటే ఆ కవిత్వంలో లోపాలు తెలుస్తాయి.

కవిత్వం రాయడం వేరు. ఆ కవిత్వాన్ని ప్రమోట్ చేయడం వేరు. ప్రమోషన్ ఆరాటం ఎక్కువైనప్పుడు అది వెగటు పుట్టిస్తుంది. కవిత్వం ఒక గొప్ప వాతావరణాన్ని కల్పిస్తుంది. కవిత్వం కల్పించే వాతావరణం సత్యమైంది. నిత్యమైంది.

మనసు నిండా మానవత్వం మూర్తీభవించిన కవి- తన కవిత్వంలో ఎన్నో ఉన్నత శిఖరాలధిరోహించి, కవిత్వంనిండా మట్టి పరిమళాలు గుబాళింప చేస్తుంటాడు. కాలచక్రాన్ని నిశిత దృష్టితో పరికించి, ప్రతీకలలో జీవితానుభవ సారాన్ని అక్షరీకరిస్తుంటాడు. ఆధునికత పేరుతో, అత్యంత ప్రభావితాలలైన మూలాలనే నరుక్కొంటున్న మానవ మూర్ఖత్వాన్ని నిరసించడానికి అక్షరాల్నే అస్త్రాలుగా సంధిస్తాడు.

> "కవికి రాయాలన్న ఉత్సాహం, ఉద్వేగం ఉంటే చాలదు. ఉన్నతంగా కవిత్వం రాయడానికి నిరంతర అధ్యయనం, కృషి ఉండాలి"

కవిత్వ దృక్పథాన్నే ఉదాహరణగా గ్రహిస్తే కవి భావన- కవిత్వ చింతన అంతా అనుభవైక నేపథ్యమౌతుంది. కవిత్వ ప్రతిపత్తి అంతా ప్రవృత్తి నివృత్త్యాత్మకమౌతుంది. ఇది ఒక రకంగా సక్రమం కాదేమో. ఎందుకంటే- సాహిత్య సంస్కృతీ సంప్రదాయాలలో కవిత్వ దృక్పథాన్ని విభిన్నమైన ధోరణులను అవలంభించే చాలా సిద్ధాంతాలు ఉన్నాయి. అవి కవిత్వయదార్థతను ప్రాతిపదికగా గ్రహిస్తాయి.

కవిత్వం ఎపుడూ వ్యతిరేక దిశనించి అనుకూల దిశవైపు, అపుడపుడూ అనుకూల దిశనించి వ్యతిరేక దిశవైపు మారుతూ వుంటుంది. ఆ భిన్న దృశాలు కవిత్వానికి ప్రాథమిక లక్షణాలు కానప్పటికీ, కవి వ్యక్తిత్వ తత్త్వం అందుకు అనుకూలంగా ఉండడంతో అలా రూపాంతరం చెందుతుంది.

కవిత్వం మీద, అందులోను ఇప్పుడు పుంఖాను పుంఖంగా రాసి పడేస్తున్న వర్థమాన కవుల మీద అభిమానం లేదని కాదు. కానీ కవిత్వం పూర్తిగా వాణిజ్య బందీ అయినప్పటి నుంచీ, భావ చిత్రాలతో పరిఢవిల్లుతూ, అరిగి, ఒరిగి తరిగిపోతున్న పదబంధాలతో కొన్నిచోట్ల కవిత్వం పరిఢవిల్లుతోందన్న బాధ కలుగుతుంది. అయితే నిన్నా మొన్నటి వరకూ అస్పష్టతని వెతకవలసి వచ్చేది. మరిప్పుడూ వెతుకుతూనే ఉన్నాం- అయితే అది- అస్పష్ట పదాల్లేని కవిత్వాన్ని..

ఎక్కడా ఎట్లాంటి రక్షణా- భద్రతా కవిత్వానికి లేదని, అది పునాది రహితమయినప్పుడు- భద్రత గురించి అడగడంలోనే సమస్యని సృష్టించుకోబడుతుందని, కోరే కొద్దీ- మరింత అభద్రత అన్నది- జీవితానికి సంబంధించిన లక్షణం. మంచి కవిత్వం ఎప్పుడు జీవన మూల్యాలకు రక్షణ కవంగా వుంటుంది. కవిత్వం ద్వారా జీవితం ఆనందమయం కాబడుతుంది కాబట్టి..

ఎవరన్నారో- ఎప్పుడు- ఎక్కడన్నారో అంతగా గుర్తు లేదు కానీ- ఇప్పటికీ ఆ విషయం గుర్తుకొస్తే గుండె చెరువు అవ్వకపోయినా- నిజమే కదాని బరువు ఎక్కుతుంది. ఇంతకూ అదేమంటే " తెలుగు కవులకున్న బలహీనత ఏమంటే- తమని గురించి- అంటే తమ పుట్టు పూర్వోత్తరాలు, ప్రాంత విషయ విశేషాల గురించి చెప్పుకోరు" ఒక రకంగా కొంత నిజమే అనిపిస్తుంది. ఎందుకంటే మన గొప్ప ప్రాచీనకవులు- ప్రసిద్ధకవులు- తమ సాహిత్య కృషిని గురించి, తమ రచన వైశిష్ట్యాన్ని గురించి ఆకర్షణీయంగా చెప్పుకొన్నారు. ఏ కాలంలో ఎక్కడ జన్మించారో ఇదమిద్ధంగా పేర్కొనలేదు.

కవిత్వమంటే- కవులకూ, ప్రపంచానికీ ఉండే సత్సంబంధం. అది ఎంత విశాలంగా ఉంటుందనేది కవుల సామాజిక జీవిత వైశాల్యాన్ని బట్టీ, వ్యక్తిగత జీవితం లోతును బట్టీ, వ్యక్తిగత జీవితం లోతును బట్టి ఉంటుంది. తెలిసిందే రాయడం ఒక పద్ధతి. అలా రాస్తే జీవితం గొప్పగా ఉంటుం ది. కాని తెలుసు కొని రాయడం కూడా మరో పద్ధతి. ఎప్పటి నుంచో పోగుపడి ఉన్న జీవితానుభవాల మీద రాసిన దానికంటే అందులోని మార్పుల చేర్పుల క్రమాలను పట్టుకున్న కవిత్వమే మంచిగా మానవీయ విలువలకు ప్రతీకగా నిలిచిపోవడం కూడా ఒక గొప్ప వాస్తవం.

కవిత్వం వినోదం కాదు- అనుభవం..! మానవ హృదయానికి విశాలత్వానిచ్చే ఉన్నత పరివర్తన కలగ చెయ్యాలని నిరంతరం ప్రయత్నిస్తుంది. ఇప్పుడు కొంత మంది కవులలో కూడా మార్పు రావాల్సిన పరిస్థితి ఉంది. కేవలం తమ పాత చింతకాయ పచ్చడి కవిత్వాన్నే నమ్ముకుంటే ఫలితం మరోలా వుంటుంది కాబట్టి. లాంగ్ లాంగ్ ఎగో ఒన్స్ అపానే టయిమ్స్ ఇజాల భావ జాలాలను పక్కన పెట్టి- మంచి మంచి బలమైన ప్రతీకల కోసం పదబంధాల కోసం కొత్తగా ప్రయత్నిస్తే, కచ్చితంగా చక్కని ఫలితాలు అందుకోగలరని వేరే చెప్పాల్సిన అగత్యం లేదు. తమ క్రేజ్‌ని క్యాష్ చేసుకోవడం తప్పులేదు కానీ, అసలు వర్తమాన కవిత్వ విధానాల గురించి పట్టించుకోకుండా, కేవలం నినాదమే ప్రధానమైన ఊకదంపుడు కవిత్వాన్ని నమ్ముకుంటే - అమ్ముకుంటే కష్టాలు కళ్ళముందు సాక్షాత్కరించి కలత చెందిస్తుంది..!

-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

## నిత్య స్మరణీయులు

-దోరవేటి
సెల్:9866251679

కాళిదాసు

కవికుల గురువను నామము
ప్రవిమలమౌ కీర్తికాంతి భాసవంతంబౌ
రవివీవు కాళిదాసా!
సవినయముగ వందనములు సలిపెద సతమున్.

వసుధ మెచ్చగ 'రఘువంశమ్ము' నిర్మించి
భవ్య 'కుమార సంభవము' గూర్చి
సరస శైలిని 'మేఘ సందేశము' నొసంగి,
నాటకత్రయము నానంద మొప్ప

కమనీయమౌ 'యభిజ్ఞాన శాకుంతలం
బల 'విక్రమోర్వశీయమును మరియు
'మాళవికాగ్నిమిత్ర'ల నందించిన
శ్రవణ దృశ్యకావ్య -చతుర మతివి !

మేలు గూర్చు సంభాషణలే, మేలికథలు,
బుధులు మెచ్చెడి శైలిలో సుధలు మించు
కావ్య మమృతమై ప్రవహించె కథనఝరిని
కవికులము దేశికా! నమస్కార శతము!

అవిరళ రచనలతో దే
శ విదేశములందు భరత సంస్కృతి నిలిపే
కవివర! ఉపమాలంకా
ర విశేషపు కాళిదస! రమ్యోద్ఘాసా!

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
పోటీ ఫలితాలు
'బుధవారం బాద్షా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ బహుమతి విజేత

### తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర

కాళోజి కవనాగ్ని నుండి పుట్టిన పౌరుషం,
దాశరథి తిమిరంతో సమరంలోని రుధిరం,
సి.నా.రె కలం నుండి జాలువారిన విశ్వంభరం
నా తెలంగాణం నా తెలంగాణం.
అలిశెట్టి ప్రభాకర్ శోధన నుండి పైకెగసిన సిటీలైఫ్
సామల సదాశివుడి మూడోనేత్రం నుండి వెలువడిన అస్తిత్వ కిరణం
బిరుదురాజు రామరాజు జానపద వాఙ్మయ శిఖరం
నా తెలంగాణం నా తెలంగాణం.
కాకతీయ కవనామృతం పోతన భాగవతం
దేశిఛందస్సుల విన్యాసం సోమన బసవోదాహరణం
పట్టుదలతో ప్రాణం పోసిన సురవరం గోల్కొండ దర్పనం
నా తెలంగాణం నా తెలంగాణం.
వేములవాడ భీమకవి కణక్వణ విస్ఫులింగం
పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి'వాణి నా రాణి' యన్న నినాదం
బోయిభీమన్న సామాజిక మానవత్వం
నా తెలంగాణం నా తెలంగాణం.
తెలంగాణతల్లీ! వందనం! అభివందనం!
కోటిరతనాల కొంగొత్త బోనం
స్వర్ణకాంతుల సరికొత్త అలంకారం.

-డా.రామక కృష్ణమూర్తి
7989661142

ద్వితీయ బహుమతి విజేత

### పాటే ప్రాణం

తెలంగాణ మా!
నా బంగారు మా గాణమా !
సింగరేణి సిరుల సింగారమా!
కష్టేఫలి అన్న నినాదం ఫలించే నేడు
ఆనందభాష్పాలతో అభిషేకిద్దాం నేడు!
తెలంగాణ తల్లికి పాటే ప్రాణం, జీవం పాటలోనే సంస్కృతి సాహిత్యాలు ఒదిగిపోయాయి పాటలోనే చైతన్యం పోరాటపటిమ దాగివున్నాయి ఉద్యమం మొదలు చివరలు పాటతోనే ముడిపడ్డాయి
సుద్దాల హనుమంతు ఘోష నిజాంకు ఘోరీ కట్టాలని!
దాశరథీ కోటి రతనాల వీణ అనే నీ కీర్తి పతాకాన్ని దశదిశలా చాటాలని! కాళోజి తెలంగాణ వస్తుందన్న ఆశతో చివరిదాకా( నా) గొడవ చేసే!
జయశంకర్ సార్ కు నీళ్లు నిధులు నియామకాలు తెలంగాణకు తేవాలనే యాతన!
అనుపానులు గుర్తుచేస్తూ, అస్తిత్వం కాపాడుతూ ఎక్కడ ఆగు తారీ కవులలోకం
కదం తొక్కుతూ పదం పాడుతూ పోరాటఝరిలో అసువులు బాసిన అమరవీరుల స్మృతి లో పోరు బాట పట్టి, పాటలను కట్టి,వినిపించి విజయకేతనం ఎగురవేసే గద్దర్,జయరామ్ అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ ,గోరేటి వెంకన్న ,
ఎందరో ఎందరెందరో గాయక శిఖామణులు అందుకోండి
తెలంగాణ వందనములు.

-పరంజ్యోతి

## రైతుకు చదువు అవసరమే
కథ

గన్నేరు వరం అనే ఊరిలో రాము అనే బాలుడు ఉండేవాడు. అతడు ఎప్పుడూ ఒక చెట్టు కింద కూర్చొని ఖాళీగా సమయం వృధా చేసే వాడు. ఇది గమనించిన ఒక ఉపాధ్యాయుడు అతని దగ్గరికి వెళ్లి "నీవు ఎందుకు చదువుకోవడం లేదు, ఎప్పుడు ఇలా సమయాన్ని వృధా చేసుకుంటున్నావు " అని అడిగాడు. అప్పుడు అతడు

"నాకు చదువు అంటే ఇష్టమే కానీ నా లక్ష్యం ఒక గొప్ప రైతు కావడం ఇదే విషయాన్ని మా అమ్మానాన్నలతో చెప్పాను , అందుకు వారు రైతు కావాలంటే చదువు అవసరం లేదన్నారు అందుకే నేను చదువుకోవడం లేదు" అన్నాడు.

ఉపాధ్యాయుడు అతని దగ్గర కూర్చుని "రైతు కావాలంటే చదువు అవసరం లేదని అందరికీ తెలిసిన విషయమే కానీ రైతు కావాలంటే కూడా చదువుకోవాలి. చదువు వలన మనకు ఎన్నో లాభాలున్నాయి ఇతరుల పట్ల ఎలా ప్రవర్తించాలో త నేర్చుకోవచ్చు,ధాన్యం అమ్మకానికి వెళ్ళినప్పుడు మనం మోసపోకుండా ఉండవచ్చు, విత్తనాలు కొనుగోలు చేయునపుడు చదువు చాలా అవసర పడుతుంది. సమాజంలో మోసగాళ్లను ఎదుర్కోవాలంటే ఒక చదువే ఉపయోగపడుతుంది. అందుకు నీవు బాగా చదువుకోవాలి. గొప్ప రైతువై పదిమందికి ఉపయోగపడాలి. నేటి సమాజంలో జనాభా పెరిగిపోతున్నది అందుకు తగినట్టుగా ఆహార ఉత్పత్తి పెరగడం లేదు. సేంద్రియ విధానంతో, తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి సంపాదించాలి." నచ్చ చెప్పాడు.

ఉపాధ్యాయుని మాటలతో నిజం తెలుసుకొని రాము పాఠశాలకు వెళ్లాడు. సెలవు రోజుల్లో రైతుల పొలాల దగ్గరకు వెళ్లి, వారు సాగు చేస్తున్న విధానాన్ని దగ్గర నుండి పరిశీలించాడు. పాత పద్ధతులలో వారు చేస్తున్న వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే తను బాగా చదువుకోవాలని నిర్ణయించుకున్నాడు.

కొన్ని సంవత్సరాల తర్వాత రాము రైతుగా మారి, నూతన విధానాలతో, తక్కువ నీటితో ఎక్కువ మొత్తంలో పంటలు పండించాడు. చాలా మంది రైతులకు సలహాలు ఇస్తూ, వారి చేత కూడా అధిక దిగుబడులు సాధించేలా పంట ఉత్పత్తులు చేయించాడు.
తన స్నేహితులు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తుంటే తాను మాత్రం పొలంలో పనిచేస్తూ, రైతులకు ఉపయోగ పడుతున్నాడు. చదువు రాని రైతులు మోసపోకుండా వారికి చదువు నేర్పుతున్నాడు.

-మట్టే ప్రసన్న
8008168642

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.